
www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ఆదివారం | 20-1-2019 | పేజీలు: 18 + 20 + 32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: రూ. 8.00 | సంపుటి: 59 సంచిక: 275 | శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి మ. 2.20 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: ఆరుద్ర ఉ. 8.08 తదుపరి పునర్వసు తె. 5.16; వర్జ్యం: రా. 6.45-8.10; దుర్ముహూర్తం: సా. 4.30-5.14; అమృతఘడియలు: తె. 3.15-4.40; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.55; సూర్యాస్తమయం: 5.59 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

లలితా జ్యువెల్లరి
మన విజయవాడలో




కింది ప్రశ్నలలో కనీసం ఒక్కదానికైనా
'అవును' అనే సమాధానం వస్తుందా?
Lalithaa
ఇదివరకు న్యాయమైన ధరకు విజయవాడలో నగలు లభించాయా?
☐ అవును
☐ కాదు
న్యాయమైన ధరకు విక్రయించకుండా, పలురకాల ఆఫర్ల పేరుతో వినియోగదారులను తికమకపెట్టడం సమంజసమేనా?
☐ అవును
☐ కాదు
చెల్లించే డబ్బుకు న్యాయమైన గ్రాముల బంగారాన్ని ఇంటికి తీసుకెళ్తున్నామా అని సరిచూసుకున్నారా?
☐ అవును
☐ కాదు
నగలు కొనేముందు మీకు నచ్చిన నగకు ఎస్టిమేట్ స్లిప్, మొబైల్‌లో ఫొటో తీసుకుని నాలుగైదు షోరూంలలో ధరలు పోల్చి చూసి ఎక్కడ తక్కువ ధరకు నగలు లభ్యమవుతాయోనని లెక్కగట్టారా?
☐ అవును
☐ కాదు
BIS 916 హాల్‌మార్క్ బంగారం ఆభరణాలను లలితా జ్యువెల్లరి మాదిరిగా విజయవాడలో తయారీ ధరకే, తక్కువ V.A.కు విక్రయించే షోరూం ఏదైనా ఉందా?
☐ అవును
☐ కాదు
విజయవాడలో ఏ షోరూంలోనైనా 'నగలు కొనుగోలు పథకం'కు తొలి వాయిదా ఉచితం మరియు ఏ నగకూ 50% V.A. లేదన్న వెసులుబాటు ఉందా?
☐ అవును
☐ కాదు
ఏమాత్రం V.A. చెల్లించకుండా నగలు కొనే వెసులుబాటు గల 'అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్' విజయవాడలో ఉందా?
☐ అవును
☐ కాదు
వజ్రాభరణాలకు VVS క్లారిటీ, E-F కలర్‌గ్రేడ్, అంతర్జాతీయ స్థాయి నాణ్యత సర్టిఫికెట్‌తో పాటు క్యారెట్ రూ.46,000 నుంచి, V.A. గ్రాముకు కేవలం రూ.975 మాత్రమే చెల్లించగల వెసులుబాటు విజయవాడలో ఉందా?
☐ అవును
☐ కాదు
మాకు తెలుసు!... ప్రతి ప్రశ్నకు 'కాదు' అన్న అతిపెద్ద సమాధానం మీ నుంచి వస్తుంది. ఈ పరిస్థితిని మార్చేందుకు,
మీరు నగలు కొనే విధానంలో సరికొత్త మార్గాన్ని తీసుకొచ్చేందుకు లలితా జ్యువెల్లరి విజయవాడ మార్కెట్‌లోకి అడుగుపెడుతోంది.
For any clarification or doubts write to us at info@lalithaajewellery.com. We will be glad to reply.
లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్
100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్
లక్షలాది డిజైన్లు!
విజయవాడ : 60-9-10, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్, సిద్ధార్థ నగర్,
సిద్ధార్థ క్యాటరింగ్ కాలేజ్ ఎదురుగా. ఫోన్: 0866-2481133 / 91332 98333 / 91332 98444.
వైజాగ్ : 29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891-6600001.
తిరుపతి : 481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్కరోడ్, (V.V. మహల్‌రోడ్) ఫోన్: 0877-666 0505 / 0606 / 7888.
హైదరాబాద్ : 6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ సర్కిల్. ఫోన్: 040 - 6748 6677.
చెన్నై • తిరువళ్లూరు • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్
నగలు కొనడం ఎలా?..
అన్న విషయంపై
రూపొందించిన పుస్తకం మా షోరూంలో
ఉచితంగా లభ్యమవుతుంది.
www.lalithaajewellery.com
WANTED BRANCH MANAGERS
With 5 to 10 years exp. in Jewellery. Please contact Vijayawada showroom.

www.andhrajyothy.com

విజయవాడ సిటీ

ఆంధ్రజ్యోతి

ఆదివారం 20-1-2019

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



కోల్‌కతాలో జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ ఆలింగనం

పతనం తథ్యం!

- మోదీ ప్రచారాల ప్రధాని
- మనకు పనిచేసే ప్రధాని కావాలి
- రాష్ట్రాలపై నీచ రాజకీయం
- 'కర్ణాటక' మూల్యం చెల్లించాలి
- కీలక వ్యవస్థల దుర్వినియోగం
- కోల్‌కతా సభలో చంద్రబాబు

కోల్‌కతా, జనవరి 19: "మోదీ ప్రభుత్వ పతనం మొదలైంది. ఇందులో ఏమాత్రం అనుమానం లేదు. దేశానికి కొత్త ప్రధాని రావడం ఖాయం!" అని తెలుగుదేశం అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. మోదీ కేవలం ప్రచారాల ప్రధాని అని విమర్శించారు. ఈ దేశానికి పనిచేసే ప్రధాని

మిగతా 15వ పేజీలో...



వైభవంగా కోటప్పకొండ పండగ 4

డ్వాక్రాకు భారీ నజరానా 4

- ఆడపడుచులకు రూ.9 వేల కోట్ల వరం
- పసుపు కుంకుమ కింద మరో పది వేలు
- 93 లక్షలమంది మహిళలకు తక్షణ లబ్ధి
- కీలక నిర్ణయం తీసుకొన్న రాష్ట్ర సర్కార్
- 1,2, 3 తేదీల్లో చెక్కుల పంపిణీకి ఏర్పాట్లు



ఆకాశ వీధిలో అందాల బెలూన్లు 4

అరకులోయకు భారీగా తరలివస్తున్న సందర్శకులు



కోల్‌కతా సభా వేదికపై కుమారస్వామి, చంద్రబాబు, ఫరూక్‌అబ్దుల్లా, దేవెగౌడ, మమతాబెనర్జీ, ఖర్గే, పవార్, కేజ్రీవాల్, శరద్‌యాదవ్ తదితరులు

మోదీ హటావో!

కోల్‌కతా వేదికగా లోక్‌సభ ఎన్నికలకు ప్రతిపక్షాల శంఖారావం

బీజేపీపై యుద్ధ భేరి మోగించిన 23 మంది విపక్ష నాయకులు

- ఓ మాజీ ప్రధాని, నలుగురు సీఎంలు.. ఆరుగురు మాజీ సీఎంలు, కేంద్ర మాజీ మంత్రుల రాక
- సోనియా, రాహుల్ తరపున ఖర్గే, సింఘ్వీ హాజరు
- ఉమ్మడి పోరాటానికి సంకల్పం.. విజయంపై ధీమా
- తదుపరి సభలు అమరావతి, ఢిల్లీల్లో ఖరారు



న్యూఢిల్లీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): 'ప్రధాని మోదీని దించేద్దాం.. ఢిల్లీలో సర్కారును మార్చేద్దాం' అంటూ ప్రతిపక్ష నేతలు నినదించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలకు కోల్‌కతా వేదికగా శంఖం పూరించారు. యుద్ధ భేరీ మోగించారు. ఉమ్మడిగా పోరాడదామని సంకల్పం చెప్పుకొన్నారు. ఉమ్మడి విపక్షం విజయం సాధిస్తుందని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ వ్యతిరేక పార్టీలతో కలిసి శనివారం కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో 'యునైటెడ్ ఇండియా' పేరిట నిర్వహించిన భారీ సభ విజయవంతమైంది. దాదాపు ఐదు లక్షల మందితో మైదానం నిండిపోయింది. ఉదయం పది గంటలకే సభా ప్రాంగణం కిక్కిరిసింది. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత

మిగతా 15వ పేజీలో...

ఈవీఎంలపై పోరు!

- అభ్యంతరాలు ఈసీ దృష్టికి
- రాఫెల్‌లో వేల కోట్ల అవినీతి
- ఆ సొమ్ములతో ఎన్నికలకు బీజేపీ
- దీన్ని ప్రజలకు బలంగా చెప్పాలి
- విపక్ష కూటమి నేతల నిర్ణయం
- ఇతర రాష్ట్రాల్లోనూ ర్యాలీలు

మోదీ సర్కారుకు కాలం చెల్లింది

- ఇందిర ఎమర్జెన్సీ కంటే దారుణం
- విభజించి పాలిస్తున్న బీజేపీ
- మోదీ హయాంలో కుంభకోణాలు
- వచ్చిన అవకాశాన్ని చేజార్చుకుంది
- బీజేపీపై భగ్గుమన్న మమత

ఐదుగురికి 100 పర్సంటైల్!

- జేఈఈ మెయిన్‌లో మెరిసిన తెలుగు విద్యార్థులు
- ఏపీ నుంచి ఒకరికి.. దేశవ్యాప్తంగా 15 మందికి
- వేలాది మంది విద్యార్థులకు 90 పర్సంటైల్
- ఏప్రిల్ పరీక్ష తర్వాత ర్యాంకుల ప్రకటన 11



16

నిధుల 'దారి'లో దగా

- ఏపీపై వివక్ష అక్షర సత్యం
- జాతీయ రహదారుల లెక్కలతో స్పష్టం
- 6 బీజేపీ రాష్ట్రాలకు 1.07లక్షల కోట్లు
- ఏపీకి రూ.5,399 కోట్లే



ఎల్‌అండ్‌టీ రూపొందించిన తొలి యుద్ధ ట్యాంకులో మోదీ

లూటీదార్ల కూటమి!

- దోపిడీదారులంతా జత కట్టారు.. ప్రజా వ్యతిరేక మహా'కూటమి'
- లూటీని అడ్డుకున్నందుకే కక్ష .. అందరి మేలు కోసం పనిచేస్తున్నా
- గత ప్రభుత్వ పథకాలు కుటుంబం కోసం.. మావి దేశం కోసం
- సొంత లబ్ధికే విపక్షాల యత్నం.. కోల్‌కతా ర్యాలీపై మోదీ విమర్శలు 14

'వేలిముద్ర'కు పరిష్కారం!

- డీలరుకు కార్డుల్లో 5 శాతం వెసులుబాటు
- 'ముద్ర' పడనివారికి రేషన్ పంపిణీ 4
- వేల కుటుంబాలకు తప్పనున్న తిప్పలు



పరంజ్యోతి

కర్మ యోగం.. జీవన్ముక్తికి మార్గం



కర్మల ద్వారా ఏదైనా ఆశిస్తున్నామంటే అది కామ్యకర్మనే అవుతుంది. వేదవిహితములైన కర్మలు కూడా కామ్యములే. కానీ అవి లోకహితమైనవి. ఉదాహరణకు.. ఒక యజ్ఞం చేయడం ద్వారా యజమాని పుష్టిని పొందడమే కాక.. లోకంలోని ప్రాణులకు హితాన్ని కలిగిస్తున్నాడు. అయితే, కేవలం వేదసమ్మతమైన కర్మలను ఆచరించడం ద్వారా మోక్షం లభించదు. ఏమీ ఆశించకుండా ఉండడమే మోక్షం. మోక్షం కోసమని ఏమీ ఆశించకుండా ఉంటే అది కూడా ఆశించడమే అవుతుంది. ఏమీ ఆశించకుండా ఉండడం అంటే.. ఊరకే ఉన్నదానితోపాటుగా ఉండడం. సమాధిలో ఉండడం. ఎల్లవేళలా సమత్వమైన బుద్ధి కలిగి ఉండడమే సమాధి.

ఉన్నదంతా బ్రహ్మమే కాబట్టి.. ఉన్నదానితోపాటుగా ఉండడమంటే భగవంతునితో ఉండడమే. ఈ జ్ఞానం తెలిసి, ఏమీ ఆశించకుండా ఊరకే ఉండడమంటే బ్రహ్మమునందు ఉన్నట్లే. ఊరకే ఉండడమంటే.. ఏ పనీ చేయకుండా ఉండడమని కొందరు భావిస్తారు. కానీ, అది తప్పు. కర్మలు ఆచరిస్తూనే ఏమీ ఆశించకుండా ఉండాలి. అప్పుడు ఈ లోకంలోనే మోక్షస్థితిని అనుభవించగలం. మోక్షమంటే.. దేహం నుంచి విడుదలైన జీవుడు మళ్లీ జన్మ లేకుండా పరాంతకాలం వరకూ పరమేశ్వరునియందు ఉండిపోవడమే. ఈ దేహంలో ఉన్నప్పుడు సైతం పరమేశ్వరుని యందే-బ్రహ్మమునందే ఉన్న అనుభూతిని పొందడమంటే ఈ లోకంలోనే మోక్షస్థితిని అనుభవించడం కదా!!

సృష్టిలో ప్రతి జీవీ కర్మలు ఆచరించవలసిందే. కర్మలు చేయకుండా ఎవరూ ఉండలేరు. కానీ, చేస్తున్న కర్మ మనకు బంధనం కానప్పుడు.. ఆ కర్మ చేసినప్పటికీ చేయకుండా ఉన్నట్లే. ఇదెప్పుడు సాధ్యమంటే.. చేస్తున్న పని నుంచి ఫలితాన్ని ఆశించకుండా ఉన్నప్పుడు. పని మనం చేసినా ఫలితానికి పరమేశ్వరుడే అధికారి అనుకున్నప్పుడు.

కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన
మా కర్మఫలహేతుర్భూః మా తే సంగోస్త్వ కర్మణి

భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పింది కూడా అదే. 'శాస్త్రవిహిత కర్మను ఆచరించడం యందే నీకు అధికారం కలదు. కానీ, ఆ కర్మ ఫలితంపై హక్కు లేదు. నీవే కర్మఫలములకు హేతువు అని అనుకోకు. చేయాల్సిన పనులు మానడంలో ఆసక్తి ఉండరాదు.' అని దీని అర్థం. కర్మ ఫలితంపై ఆసక్తి లేనప్పుడు మనం చేసే ఏ పనీ మనకు బంధనం కాదు. అప్పుడది కర్మ కాదు. కర్మయోగం అవుతుంది. తద్వారా జీవన్ముక్తికి మార్గం ఏర్పడుతుంది.

- జక్కని వేంకటరాజం, 9440021734



కోటప్పకొండలో ఆకట్టుకుంటున్న ప్రభ సెట్టింగ్

కొండ పండగ ప్రారంభం

కోటప్పకొండ(నరసరావుపేట), జనవరి 19: దేశంలోనే ప్రథమంగా గుంటూరు జిల్లా నరసరావుపేట మండలంలోని కోటప్పకొండలో కొండపండగ శనివారం వైభవంగా ప్రారంభమైంది. స్పీకర్ కోడెల శివప్రసాదరావు వీటిని ప్రారంభించారు. ఆదివారం కూడా ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసమే కొండ పండుగను నిర్వహిస్తున్నామన్నారు. ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎంపీలు సుజనాచౌదరి, కొనకళ్ల నారాయణ, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, కలెక్టర్ కోన శశిధర్, పర్యాటక శాఖ జేడీ మల్లికార్జునరావు, కోడెల శివరామ్ హాజరయ్యారు. ఒడిసా, యూపీ, మహారాష్ట్ర కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. లేపాక్షి స్టాల్స్, హెలికాప్టర్ రైడ్స్, పారా రైడర్ ఏర్పాటు చేశారు.

డ్వాక్రాకు భారీ నజరానా

- ఆడపడుచులకు రూ.9 వేల కోట్ల వరం
- పసుపు కుంకుమ కింద మరో పది వేలు
- 93 లక్షల మంది మహిళలకు తక్షణ లబ్ధి
- కీలక నిర్ణయం తీసుకొన్న రాష్ట్ర సర్కార్
- 1,2, 3 తేదీల్లో చెక్కుల పంపిణీకి ఏర్పాట్లు

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలకు రూ.9 వేల కోట్ల భారీ నజరానా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సంఘాలకు మరింత ఆర్థిక పరిపుష్టి చేకూర్చి వాటిని బలోపేతం చేసే నిమిత్తం ఈ సాయం ఇవ్వాలని నిర్ణయించారు. ఒక్కో డ్వాక్రా మహిళకు రూ.10 వేలు వంతున పసుపు కుంకుమ పథకం కింద ఈ సాయం అందనుంది. రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాల్లో ప్రస్తుతం 93 లక్షల మంది సభ్యులు ఉన్నారు. 9లక్షల పైచిలుకు సంఘాలు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 7.25లక్షల సంఘాలు, పట్టణ ప్రాంతాల్లో 2లక్షల సంఘాలు ఉన్నాయి. వీటన్నింటిలో సభ్యులకు ఈ సాయం ఇస్తారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా 'పసుపు కుంకుమ' కింద చెక్కులను ఆడపడుచులకు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పసుపు కుంకుమ కార్యక్రమం కింద డ్వాక్రా మహిళలకు ఇంతకు ముందు కూడా రాష్ట్ర ప్రభుత్వం తలకు రూ.10 వేలు ఇచ్చింది. ఆ మొత్తాన్ని మూడు విడతలు చేసి ఏడాదికి ఒక విడత చొప్పున ఇచ్చారు. ఆ రకంగా ఇంతకు ముందు రూ.11వేల కోట్లు చెల్లించారు. ఇప్పుడు అదే మొత్తాన్ని రెండు నెలల వ్యవధిలోనే ఇవ్వనున్నారు. ఈ మొత్తం రూ.9వేల కోట్ల పై చిలుకు ఉంటోంది. అంటే నాలుగేళ్ల వ్యవధిలో డ్వాక్రా సంఘాలకు రూ.20వేల కోట్ల సాయం అందుతుందన్నమాట! ఈ స్థాయిలో మహిళా సంఘాలకు సాయం అందించడం దేశ చరిత్రలో ఇదే ప్రథమమని అధికార వర్గాలు అభివర్ణిస్తున్నాయి.

వందల్లోంచి వేలల్లోకి...

ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఉండగా ఈ సంఘాలకు రూ.250 కోట్లు సాయం ఇచ్చారు. ఇప్పుడు ఈ సాయం మొత్తాన్ని ఏకంగా 20 వేల కోట్లకు టీడీపీ ప్రభుత్వం పెంచింది. గతంలో కూడా టీడీపీ ప్రభుత్వ హయాంలోనే డ్వాక్రా సంఘాలు బలోపేతం అయ్యాయి. ఇప్పుడు ఈ ఆర్థిక సాయం వాటిని మరింత బలపడేలా చేస్తుందని అంటున్నారు. తొలి విడత పసుపు కుంకుమ సాయం నిద్రాణంగా ఉన్న చాలా సంఘాలను క్రియాశీలం చేసింది. ఆ డబ్బును ఆసరాగా చేసుకొని అనేక సంఘాలు మళ్లీ రుణాలు తీసుకొని వివిధ కార్యక్రమాలు చేపట్టడం మొదలుపెట్టాయి. ఈ సంఘాల నుంచి చెల్లింపులు కూడా పక్కాగా ఉండటంతో బ్యాంకులు కూడా తేలిగ్గానే రుణ సహాయం చేస్తున్నాయి. రెండో విడత సాయం ఈ సంఘాల సభ్యుల్లో టీడీపీ ప్రభుత్వంపై సానుకూలతను బాగా పెంచుతుందని, రానున్న ఎన్నికల్లో దీని ఫలితం కనిపిస్తుందని ప్రభుత్వ పక్షం ఆశిస్తోంది.

మూడు విడతలుగా..

మూడు విడతలుగా చెల్లింపులు జరిగేలా చెక్కులు అందిస్తారు. ఒక చెక్కుకు సంబంధించిన డబ్బు ఇప్పుడు వెంటనే అందుతుంది. మిగిలిన రెండు విడతల చెక్కులపై ముందుగానే తేదీలు ముద్రించి ఉంటాయి. రెండు నెలల్లో అంటే మార్చి నెలాఖరులోపు ఈ డబ్బు పూర్తిగా డ్వాక్రా మహిళలకు అందుతుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ అధికారులు రెండుసార్లు బ్యాంకుల అధికారులతో ఈ అంశంపై చర్చించారు.

ఆ స్వేచ్ఛ సంఘాలకే..

రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఈ డబ్బును ఎలా వినియోగించుకోవాలో నిర్ణయించుకొనే స్వేచ్ఛను ఆయా సంఘాలకే వదిలేయనున్నారు. దీనిని సీడ్ మనీగా పెట్టుకొని దానికి ఐదింతల వరకూ కొత్త రుణాలు తీసుకొనే అవకాశం కూడా ఆయా సంఘాలకు ఉంది. అలా తీసుకోవాలా లేక సభ్యుల మధ్య ఎవరి డబ్బు వారికి పంపిణీ చేసుకోవాలా అన్నది ఎక్కడికక్కడ సంఘాలే నిర్ణయించుకొంటాయి.

వర్సిటీ పరీక్షల్లో ఆటోమేషన్

- 16 విశ్వవిద్యాలయాల ప్రక్రియ ఒకే గొడుగు కిందకు
- వచ్చే ఏట నుంచే అమలు

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల పరీక్షల్లో ఆటోమేషన్ విధానం అమలుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు ఒక్కో వర్సిటీలో ఒక్కో పద్ధతి అమలవుతుండటం వల్ల ప్రభుత్వానికి సరైన డేటా అందటం లేదన్న అభిప్రాయాల నేపథ్యంలో ఇకపై పూర్తిస్థాయిలో కామన్‌గా జ్ఞానభూమి వైబ్‌సైట్ ప్లాట్‌ఫాం కిందకు తీసుకువచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. 16 వర్సిటీల పరీక్షలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం వల్ల పలు ప్రయోజనాలు ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది. 2019-20 విద్యా సంవత్సరం నుంచే వర్సిటీల్లో పూర్తిస్థాయిలో ఆటోమేషన్ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలన్నది సర్కారు నిర్ణయం. అన్ని విశ్వవిద్యాలయాలతో పాటు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీలలో యూజీ, పీజీ కోర్సులన్నింటికీ సంబంధించిన అడ్మిషన్లు తొలుత ఆన్‌లైన్‌లో నిర్వహించిన అనంతరం .. ఆ డేటాను కామన్ వెబ్ పోర్టల్‌కు అప్‌లోడ్ చేస్తారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన ఈ డేటాను విశ్వవిద్యాలయాలు అప్రూవ్ చేస్తాయి. అక్కడి నుంచి వివిధ ప్రక్రియలన్నింటికీ ఆటోమేషన్ విధానాన్ని వర్తింపజేస్తారు. విద్యార్థుల హాజరు, ఫీజు రీయింబర్స్‌మెంట్, పరీక్షలు, ఫలితాలు, హాల్‌టికెట్లు, పరీక్షా కేంద్రాల మ్యాపింగ్, ప్రశ్నపత్రాలు ఆన్‌లైన్‌లో తయారు చేయించడం, పరీక్షల నిర్వహణ, జవాబుపత్రాల మూల్యాంకనం, మార్కులను స్కాన్ చేసి ఫలితాలు ప్రకటించడం..ఇకపై ఆటోమేషన్ ద్వారానే జరుగుతాయి. పాత పద్ధతికి స్వస్తి చెప్పనున్నారు.



స్పందించే హృదయాలు!

ఈ చిత్రంలో మధ్యలో ఉన్న వ్యక్తి పేరు జాన్. వయసు 59 సంవత్సరాలు. అమెరికాలోని ఒహియోలో ఉంటారు. లైంగిక వేధింపులు, అత్యాచార ఘటనలు భారత్‌లో అధికంగా సాగుతున్నట్లు తెలుసుకుని జాన్, ఆయన సతీమణి షు (ఇన్‌సెట్ ఫొటో) కలత చెందారు. లైంగిక వేధింపుల సమస్యపై ఊరూరా తిరుగుతూ విద్యార్థులు, యువతలో అవగాహన పెంచాలని నిర్ణయించారు. తొలి విడతలో చెన్నై నుంచి భువనేశ్వర్‌కు బయలుదేరారు. శనివారం సూళ్లూరుపేటకు చేరుకున్నారు. జాన్‌తోపాటు బెంగళూరుకు చెందిన కిమ్ (22), నెల్విన్ (28) సైకిల్‌పై పర్యటిస్తుండగా... జాన్ సతీమణి, మరికొందరు భారతీయులు వీరికి సంఘీభావంగా మరో వాహనంలో అనుసరిస్తున్నారు. సమాజ సేవకోసం ఖండాంతరాలు దాటి వచ్చిన జాన్ దంపతులకు హ్యాట్సాఫ్ చెబుదామా! - సూళ్లూరుపేట

ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి కార్యదర్శిగా టీవీ శ్రీ కృష్ణమూర్తి

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి కార్యదర్శిగా టీవీ శ్రీ కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం మండలిలో జాయింట్ డైరెక్టర్ హోదాలో పనిచేస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం (తిరుపతి) ఈసీఈ ఆచార్యులు ఎస్.వరదరాజన్ డిప్యుటేషన్‌పై 2016 జనవరి 20న ఉన్నత విద్యామండలి కార్యదర్శి బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్ల ఆయన పదవీ కాలం శనివారంతో ముగిసింది. పదవీ కాలం పొడిగింపునకు సంబంధించిన ఫైలుపై సీఎం 'డిస్కస్' అని రాయడం, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కె.దమయంతి 3 రోజులుగా ఢిల్లీలో ఉండటంతో ఫైలు పెండింగ్‌లో పడింది. దాంతో టీవీ శ్రీ కృష్ణమూర్తిని నియమిస్తూ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య ఎస్.విజయరాజు శనివారం ఆదేశాలిచ్చారు. వరదరాజన్ శనివారం మండలి నుంచి రిలీవ్ అయ్యి ఎస్వీయూలో జాయిన్ అయ్యారు.

'వేలిముద్ర'కు పరిష్కారం!

- డీలరుకు కార్డుల్లో 5% వెసులుబాటు
- 'ముద్ర' పడనివారికి రేషన్ పంపిణీ
- వేల కుటుంబాలకు తప్పనున్న తిప్పలు

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): చేతి గీతలు అరిగిపోయి ఈపోస్ యంత్రంలో నమోదు కావడం లేదు. ఐరిస్ కూడా పడటం లేదు. దీంతో పలువురు లబ్ధిదారులు రేషన్ కోసం తిప్పలు పడుతున్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో సుదీర్ఘకాలంగా వేధిస్తున్న 'వేలిముద్ర' సమస్యకు ప్రభుత్వం కొత్త పరిష్కారమార్గాన్ని కనుగొంది. ఒక్కో డీలరు పరిధిలో ఉన్న కార్డుల్లో 5శాతం కార్డులకు వేలిముద్రతో సంబంధం లేకుండా రేషన్ పంపిణీ చేయడం ద్వారా శతశాతం పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

లక్షల నుంచి వేలకు తగ్గించినా..

ప్రతినెలా సగటున 20వేల మంది వేలిముద్ర పడక సమస్య ఎదుర్కొంటున్నారు. ఒక్కో నెల ఈ సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటోంది. మొత్తం రాష్ట్రంలో ఉన్న 1.46కోట్ల కార్డులతో పోలిస్తే ఇది కేవలం 0.15శాతం మందికేనని అధికారులు చెబుతున్నారు. కానీ దీనివల్లే అసంతృప్తి పెరిగిపోతోందని ప్రభుత్వవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అది తక్కువ శాతమే అయినా కార్డుదారుల్లో ప్రతికూల అభిప్రాయం పెరుగుతోందని అంచనా వేస్తోంది. ప్రతినెలా 1100 ద్వారా చేపడుతున్న సంతృప్తస్థాయి సర్వేలో ఇదే కీలకంగా ఉంది. సరుకుల కోసం ఒకటికంటే ఎక్కువసార్లు షాపునకు వెళ్లాల్సి వస్తోందని ఎక్కువ మంది సర్వేలో చెబుతున్నారు. దాదాపుగా వృద్ధులే ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. వృద్ధాప్యం వల్ల చేతి గీతలు అరిగిపోయి అవి ఈపోస్ యంత్రంలో నమోదు కావడం లేదు. అలాగే ఐరిస్ కూడా పడటం లేదు. దీంతో వృద్ధులు ప్రతిసారీ వచ్చి తిరిగి వెళ్తున్నారు. మొదట్లో ఇలాంటి సమస్య లక్షల కార్డులకు ఉండగా క్రమంగా దానిని వేలల్లోకి తగ్గించారు. అయినా పూర్తిగా మాత్రం పరిష్కరించలేకపోయారు. ఫేసియల్ రికగ్నిజేషన్ విధానం తీసుకురానున్నట్లు మంత్రి ప్రకటించినా అదీ అమల్లోకి రాలేదు. వేలిముద్ర పడనివారికోసం వీఆర్వో ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒక రోజు పంపిణీ చేపడుతున్నా, కార్డుదారుల నుంచి సగటు సంతృప్తి శాతం 90శాతం రావడం లేదని పలువురు మంత్రులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి చిన్నపాటి సమస్యల వల్ల చెడ్డపేరు వస్తోందని భావించిన సీఎం.. డీలర్లకు 5శాతం పంపిణీలో వెసులుబాటు కల్పించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ విధానంపై అధికారుల్లో కొందరికి వ్యతిరేక భావం ఉన్నట్లు తెలుస్తోంది. అందువల్లే సీఎం ఆదేశించి 20 రోజులు దాటినా.. ఉద్దేశపూర్వకంగా అమలుచేయడం లేదని డీలర్లు ఆరోపిస్తున్నారు. వేలిముద్ర సమస్యపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల్లోనూ అసంతృప్తి నెలకొంది. ఇంతచేసీ చివరికి చిన్న సమస్య పరిష్కరించలేకపోతున్నాం అనే ఆరోపణలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అందుకే రావడం లేదా?

వేలిముద్ర సమస్యతో కార్డుదారులు క్రమంగా రేషన్‌కు దూరమవుతున్నారని మంత్రులే అంటున్నారు. గత కలెక్టర్ల సదస్సులో పౌరసరఫరాల శాఖ మంత్రే ఈ విషయాన్ని సదస్సు దృష్టికి తీసుకొచ్చారు. ఒకసారి వేలిముద్ర పడకపోతే ఇక సరుకులు ఇవ్వరేమోనన్న భావనతో, ఇక తర్వాత రేషన్ కోసం రావడం లేదని, దీనివల్లే పంపిణీ శాతం గణనీయంగా తగ్గుతోందని ఆయన వివరించారు.

ఆర్టీసీ కార్మికుల పోరుబాట!

- ఈయూ నేతృత్వంలో ఎస్‌డబ్ల్యూఎఫ్, కేపీ కూటమి
- రేపు, ఎల్లుండి డిపోల వద్ద ఎన్ఎంయూ నిరశన

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వేతన సవరణ కోసం ఆర్టీసీ కార్మిక సంఘాలు ఆందోళనను తీవ్రతరం చేశాయి. గుర్తింపు యూనియన్ ఈయూ నేతృత్వంలో ఆర్టీసీలోని కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి సమ్మెబాట పట్టనున్నాయి. విజయవాడలో శనివారం ఈయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, కార్మిక పరిషత్ నేతలు పలిశెట్టి దామోదర్‌రావు, వైవీ రావు, సుందరయ్య, వీవీ నాయుడు తదితరులు సమావేశమై 22 తర్వాత సమ్మెబాట పట్టాలని నిర్ణయించారు. అయితే, ఆర్టీసీలో అత్యధిక సభ్యత్వం కలిగిన ఎన్ఎంయూ.. జేఏసీతో కాకుండా సొంతంగా ఆందోళన బాట పట్టింది. ఈ నెల 21, 22న ఆర్టీసీ డిపోల వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని ఎన్ఎంయూ రాష్ట్ర నాయకులు చల్లా చంద్రయ్య, పీవీ రమణారెడ్డి, శ్రీనివాసరావు నిర్ణయించారు. 54% ఫిట్‌మెంట్ కోరుతూ సమ్మెకు వెళతామని ఈయూ కూటమి యాజమాన్యానికి డిసెంబరు చివరివారంలో నోటీసు ఇచ్చింది. మంత్రి ఆదేశాలతో ఈయూ నేతలతో చర్చించిన ఎండీ పండగ ముందు ప్రయాణికులను ఇబ్బంది పెట్టొద్దని, జనవరి 18లోపు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో తాత్కాలికంగా వాయిదా వేసుకున్న ఈయూ నేతలు శనివారం ఇతర కార్మిక సంఘాలతో కలిసి కూటమి ఏర్పాటుకు నిర్ణయించారు. అయితే ఎన్ఎంయూ మినహా ఇతర సంఘాలు వచ్చాయని, ఈ నెల 22 నాటికి సమస్య పరిష్కారం కాకుంటే ఆ తర్వాత సమ్మె తప్ప మరోమార్గం లేదని ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి ప్రకటించారు.





పిల్ల పక్షికి ఆహారం తినిపిస్తున్న పెలికాన్

నేటి నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్

సూళ్లూరుపేట/దొరవారిసత్రం, జనవరి 19: పులికాట్ సరస్సుకు విచ్చేసే విహంగాలపై విస్తృత ప్రచారం చేసే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న పక్షుల పండుగ (ఫ్లెమింగో ఫెస్టివల్) ఆదివారం ప్రారంభం కానుంది. 3రోజుల పాటు సాగే ఈ పండగను శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట జూనియర్ కళాశాల ఆవరణలో మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ ప్రారంభించనున్నారు. తడ మండలం భీములవారిపాళెం, పడవలరేవు వద్ద బోట్ షికార్లకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఉత్సాహంగా బెలూన్ల పండగ

- అరకులోయకు భారీగా తరలివస్తున్న సందర్శకులు
- కుమారుడితో కలిసి వీక్షించిన నారా బ్రాహ్మణి

అరకులోయ, జనవరి 19: ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలో బెలూన్ల పండుగ ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతోంది. రెండోరోజు శనివారం ఉదయం 10గంటలకు సుమారు 12 బెలూన్లు గాలిలోకి ఎగురవేశారు. వింత ఆకారాలతో గాల్లో ఎగురుతున్న రంగురంగుల బెలూన్లు, వాటిని ఎగురవేస్తున్న విదేశీయులను చూడటానికి స్థానికులతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఒడిసా, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా సందర్శకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మంత్రి నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణి, తనయుడు దేవాన్ష్, ఎమ్మెల్యే బాలకృష్ణ అల్లుడు, గీతం సంస్థల అధ్యక్షుడు శ్రీభరత్, మంత్రి గంటా శ్రీనివాసరావు భార్య శారద తదితరులు హాజరయ్యారు. బెలూన్ ఎక్కడానికి భయపడుతున్న దేవాన్ష్‌ను నిర్వాహకులకు అప్పగించి బ్రాహ్మణి, శ్రీభరత్ బెలూన్‌లో ప్రయాణించారు. ఇటలీ, స్పెయిన్ నుంచి వచ్చిన పారా మోటారిస్టుల విన్యాసాలు సందర్శకులను అలరించాయి. 2రోజుల్లో వేయిమంది వరకు ఆకాశయానం చేశారు.



బెలూన్‌లను దేవాన్ష్‌కు చూపిస్తున్న బ్రాహ్మణి

లోకం తీరు



చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
కడప	14.0	33.0
హైదరాబాద్	15.8	29.4
గుంటూరు	16.1	31.2
విశాఖపట్నం	17.0	30.4
విజయవాడ	19.8	29.9


కొనసాగిన పొగమంచు

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కోస్తా, రాయలసీమల్లో పొగమంచు కురిసింది. దీంతో ఉదయం పది గంటల వరకు వాహన రాకపోకలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. మంచు ప్రభావం కొనసాగనున్నదని వాతావరణ శాఖ తెలిపింది. కాగా రాయలసీమ, ఉత్తర కోస్తాల్లో చలి కూడా స్వల్పంగా పెరిగింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. ఆరోగ్యవరంలో 13 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

కేంద్రమంత్రి చేతులు నరికేయాలనుకున్నా

కేంద్రమంత్రి రామ్‌కృపాల్ యాదవ్ భారతీయ జనతా పార్టీలో చేరినప్పుడు ఆయన చేతులు నరికేయాలనుకున్నా. రామ్‌కృపాల్‌కు రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ)లో ప్రాధాన్యతనిచ్చినా.. పార్టీని తిరస్కరించి, బీజేపీలో చేరారు. నేను ఆర్జేడీ తరఫున పాటలీపుత్ర నుంచి మళ్లీ పోటీ చేయాలనుకుంటున్నా.

- రామ్‌కృపాల్‌పై లాలూ కుమార్తె ఆగ్రహం



దేశానికి జాతీయ దేవుడు కూడా ఉండాలి

దేశానికి జాతీయ దేవుడు ఉండాలి. జాతీయ గీతం, జాతీయ చిహ్నం, జాతీయ జంతువు ఉన్నట్లే.. జాతీయ దేవుడు కూడా ఉండాలి. గణేశుడిని ఆ దేవుడిగా ప్రకటించాలి. వినాయకుడికి పెద్ద చెవులు ఉన్నట్లే.. దేశ నాయకత్వానికీ ప్రజల సమస్యలు వినే సామర్థ్యం ఉండాలి.

- రమేశ్‌భాయ్ ఓజా, సాందీపని విద్యాపీఠం అధ్యక్షుడు

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్ (విజయవాడలో)		డీజిల్	
పాత ధర	రూ. 74.45	పాత ధర	రూ. 69.92
కొత్త ధర	రూ. 74.69	కొత్త ధర	రూ. 70.22
పెరుగుదల: 24 పైసలు		పెరుగుదల: 30 పైసలు	

ధూమపానంతో వృద్ధాప్యం!

వాషింగ్టన్, జనవరి 19: ధూమపానం ఆరోగ్యానికి హానికరం. ఇది తెలిసినా చాలా మంది ఈ వ్యసనాన్ని త్వరగా వదులుకోలేరు. అమెరికాకు చెందిన ఇన్సిలికా మెడిసిన్ నిర్వహించిన తాజా సర్వేలో కొత్త అంశాన్ని గుర్తించారు. పొగతాగేవారికి త్వరగా ముసలితనం వస్తుందని ఆ అధ్యయనం పేర్కొంది. ఈ అంశాన్ని శాస్త్రీయంగా నిర్ధారించుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయం తీసుకున్నారు. ఈ వివరాలను సైంటిఫిక్ రిపోర్ట్స్ జర్నల్‌లో ప్రచురించారు. ధూమపానం అలవాటు లేనివారికి, సిగరెట్ తాగేవారికి మధ్య శారీరక మార్పునకు కారణమవుతున్న అంశాలపై ఏఐ సాయంతో పరిశోధన చేశారు. త్వరగా ముసలితనం వచ్చే విషయంలో ఆడ, మగ మధ్య ఎలాంటి తేడా లేదని, కేవలం ధూమపానం అలవాటే ఈ పరిస్థితికి కారణమని వివరించారు. శాస్త్రీయ అధ్యయనంలో భాగంగా లక్షా 49 వేల మంది రక్తపరీక్షల వివరాలను పరిశీలించారు.

2 నిమిషాలు వాసన పీల్చితే చాలు..!

వాషింగ్టన్, జనవరి 19: కళ్లముందు పిజ్జా, బర్గర్, శాండ్‌విచ్ కనిపిస్తున్నాయా? తినేయాలని నోరూరిస్తున్నా.. అధిక క్యాలరీలు ఉంటాయని నియంత్రించుకుంటున్నారా? తినకపోయినా.. కనీసం వాసన పీల్చి సరిపెట్టేద్దామని అనుకుంటున్నారా? అయితే 2 నిమిషాలు వాసన పీల్చితే ఎంతో సంతృప్తి లభిస్తుందని తాజా సర్వే పేర్కొంది. ఆ తర్వాత తీసుకునే ఆహారం ఏదైనా తక్కువగా ఆరగిస్తామని చెబుతోంది. ఆహార పదార్థాల సువాసన వల్ల పూర్తి సంతృప్తి లభించి కడుపు నిండినట్లు అనిపించడమే దీనికి కారణమని వివరించింది. యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఫ్లోరిడా పరిశోధకులు నిర్వహించిన ఈ సర్వే బృందంలో భారతీయ ప్రొఫెసర్ కూడా ఉన్నారు. ఆహార పదార్థాలను ఇలా వాసన పీల్చి వదిలేయకుండా కనీసం 2 నిమిషాలు ఆస్వాదిస్తేనే ఆకలి మందగిస్తుందని మార్కెటింగ్ రిసెర్చ్ అనే జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనంలో వివరించారు.


DIL RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
A 'DIL' RAJU PRODUCTION
DHOTI PARTNER
For the Prestigious People...
RAMRAJ
COTTON
DHOTIS • SHIRTS
BOMMA BLOCKBUSTER
FUN
F2
FRUSTRATION
సంక్రాంతి అల్లుళ్ళు
SHIRISH - LAXMAN
ANIL RAVIPUDI
DEVI SRI PRASAD
HARSHITH REDDY
SAMEER REDDY
AS PRAKASH
TAMMIRAJU
VENKAT
BANDI RATNA KUMAR
S KRISHNA
DSP
VENKATESH VARUN TEJ
U/A
RAMRAJ SHOWROOMS
VIJAYAWADA : M.G.ROAD : NEAR PVR MALL, LABBIPET | BESANT ROAD : GOVERNORPET, OPP. RAGHAVAIAH PARK
RAMRAJ PRODUCTS AVAILABLE AT COMPANY SHOWROOMS & ALL LEADING TEXTILE OUTLETS



ఆర్కే RK

కొత్తపలుకు

ఏపీ అసెంబ్లీ ఎన్నికలలో చంద్రబాబు ఓడిపోబోతున్నారనీ, జగన్ అధికారంలోకి వస్తారనీ కేసీఆర్ నమ్ముతున్నారు. ఈ కారణంగానే, జగన్‌ను పక్కన పెట్టుకుని జాతీయ రాజకీయాలలో కీలక పాత్ర పోషించాలని కేసీఆర్ తలపోస్తున్నారు. కుదిరితే ఉప ప్రధాని కావాలని అభిలషిస్తున్నారు. తన కోర్కె నెరవేరాలంటే ఏపీలో జగన్మోహన్ రెడ్డికి అత్యధిక ఎంపీ స్థానాలు దక్కాలి. అందుకోసం అవసరమైన మార్గదర్శకత్వం చేయడంతోపాటు ఆర్థికంగా అండదండలు అందించడానికి కేసీఆర్ అండ్ కో ఒక నిర్ణయానికి వచ్చింది.

బహు'మతుల' రాజకీయం

గిఫ్ట్‌లు, రిటర్న్ గిఫ్ట్‌లు.. ఇప్పుడు తెలుగునాట ఎక్కువగా వినిపిస్తున్న పదాలు. ఏపీ అసెంబ్లీకి జరిగే ఎన్నికలలో చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తామనీ, అది అద్భుతంగా ఉంటుందనీ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అండ్ కో పదే పదే ప్రకటించడంతో.. మీరు ఒకటిస్తే మేం మూడు రిటర్న్ గిఫ్ట్‌లు ఇస్తామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారంనాడు ప్రతిస్పందించారు. నిజానికి, ఈ రిటర్న్ గిఫ్ట్‌ల సంస్కృతి ఇటీవలి కాలంలో మన సంస్కృతిలో భాగం అయిందే కానీ, పూర్వం ఉండేది కాదు. గతంలో ఎవరైనా చనిపోయినప్పుడు వారి దశ దిన కర్మకు హాజరైన వారికి మృతుల స్మృత్యర్థం రోజువారీ వాడుకకు ఉపయోగపడే వస్తువులను రిటర్న్ గిఫ్ట్‌గా ఇచ్చేవారు. ఆ వస్తువులపై ఫలానా వారి జ్ఞాపకార్థం అని రాయించేవారు. ఈ సంస్కృతి కాస్తా ఇప్పుడు అన్ని రకాల కార్యక్రమాలకూ విస్తరించింది. డబ్బు ఎక్కువగా ఉన్న వాళ్లు చిన్న చిన్న శుభకార్యాలకు కూడా భారీగా రిటర్న్ గిఫ్ట్‌లు ఇవ్వడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయాల్లోకి కూడా రిటర్న్ గిఫ్ట్‌ల సంస్కృతి తీసుకొస్తున్నారు. ధనిక రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ ఇవ్వబోయే గిఫ్ట్ కూడా అత్యంత ఖరీదైనదిగానే ఉండవచ్చు. తెలుగుదేశం పార్టీ వాళ్ల లెక్క ప్రకారం.. ఏపీలో జరగబోయే ఎన్నికలలో ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్ రెడ్డికి భారీ మొత్తంలో ఆర్థిక సహాయం చేయడానికి కేసీఆర్ అండ్ కో నుంచి ఆఫర్ వచ్చిందట! జగన్మోహన్ రెడ్డిని ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా చంద్రబాబును ఓడించడమే కేసీఆర్ అండ్ కో చెబుతున్న రిటర్న్ గిఫ్ట్ అని తెలుగుదేశం నాయకులు అర్థం చెబుతున్నారు. చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చే క్రమంలోనే, తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ వద్ద ఉన్న జగన్మోహన్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు గురించి చర్చించడానికే జగన్మోహన్ రెడ్డిని కలిశామని కేటీఆర్ చెబుతున్నప్పటికీ.. ఆ కలయిక ఆంతర్యం అందరికీ తెలిసిందే!

> కేసీఆర్ ప్రకటించిన రిటర్న్ గిఫ్ట్‌ను తిప్పికొట్టాలని చంద్రబాబు యోచిస్తున్నారు. ఇందుకోసం ఆయన ద్విముఖ వ్యూహాన్ని ఎంచుకున్నారు. ఇందులో మొదటిది.. కేసీఆర్–జగన్‌ల కలయికకు వ్యతిరేకంగా ప్రజలలో సెంటిమెంట్‌ను రగిలించడం. సంక్షేమ పథకాల జోరు పెంచడం రెండవది. తెలుగుదేశం పార్టీ కేసీఆర్ పట్ల ఏపీ ప్రజలలో ఏ స్థాయిలో వ్యతిరేకతను పెంచగలుగుతుంది అన్న దాన్నిబట్టి జగన్మోహన్ రెడ్డి పరిస్థితి ఆధారపడి ఉంటుంది.

ఫెడరల్ ఫ్రంట్‌లో జగన్, నవీన్

కేసీఆర్ చెబుతున్న ఫెడరల్ ఫ్రంట్‌కు ఇంకా ఒక రూపమే ఏర్పడలేదు. శనివారంనాడు కోల్‌కతాలో మమతా బెనర్జీ నిర్వహించిన భారీ ర్యాలీకి కేసీఆర్, నవీన్ పట్నాయక్ మినహా మిగతా బీజేపీ వ్యతిరేక పక్షాలన్నీ హాజరయ్యాయి. దీన్నిబట్టి, కాంగ్రెస్– బీజేపీ వ్యతిరేక ఫ్రంట్ ఎండమావిగానే కనిపిస్తున్నది. ప్రస్తుతానికి, నవీన్ పట్నాయక్ ఒక్కరే కేసీఆర్‌కు తోడుగా ఉన్నారు. నిజానికి, నవీన్ పట్నాయక్ కూడా బీజేపీతో సన్నిహితంగా ఉంటున్నారు. జాతీయ రాజకీయాలలో కీలక పాత్ర పోషించాలని కానీ, ప్రభావితం చేయాలన్న ఆసక్తి కానీ నవీన్ పట్నాయక్‌కు లేదు. ఇక, జగన్మోహన్ రెడ్డి విషయానికి వస్తే.. ప్రస్తుతానికి ఆయన బీజేపీతో సన్నిహితంగా ఉంటున్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్– బీజేపీ మధ్య బంధం నానాటికీ బలపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వాన్ని కనీసం సంప్రదించకుండానే కేంద్ర హోం శాఖ కోడి కత్తి కేసును ఎన్‌ఐఏకు అప్పగించడమే ఇందుకు నిదర్శనం. తనపై నమోదైన కేసుల నుంచి బయట పడడమే జగన్మోహన్ రెడ్డి ప్రథమ ప్రాధాన్యం. రానున్న ఎన్నికలలో ఏపీలో అధికారంలోకి రావడం కూడా జగన్మోహన్ రెడ్డికి చాలా అవసరం. వచ్చే ఎన్నికలలో కూడా ఓడిపోతే జగన్మోహన్ రెడ్డి రాజకీయ జీవితం మసకబారుతుంది. అవినీతి కేసుల నుంచి కూడా ఆయన బయటపడలేరు. ఈ కారణంగా, కేసీఆర్ తరహాలో జాతీయ రాజకీయాలకు సంబంధించి ఆయన పెద్ద లక్ష్యాలనేమీ పెట్టుకోలేదు. పైగా, బీజేపీతో కెమిస్ట్రీ బాగానే కుదిరింది. కనుక, ఎన్నికల తర్వాత కూడా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే రావాలని జగన్మోహన్ రెడ్డి కోరుకోవడం సహజం. రాజకీయాలలో తెర వెనుక జరిగే వాటికి.. తెర ముందు జరిగే వాటికి పొంతన ఉండదు. జగన్, కేటీఆర్‌ల కలయిక కూడా ఈ కోవలోకే వస్తుంది. రెండు తెలుగు రాష్ట్రాల ఎంపీల మద్దతు ఉంటే ప్రత్యేక హోదా సాధించవచ్చునని చెబుతున్న మాటలకు ప్రాధాన్యం ఇవ్వవలసిన అవసరం లేదు. ఏపీకి ప్రత్యేక హోదాకు పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించినా నరేంద్ర మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అలాంటప్పుడు, కేసీఆర్ లేఖ రాసినంత మాత్రాన ప్రత్యేక హోదా ఇస్తారనుకోవడం అత్యాశే అవుతుంది. దీన్నిబట్టి, కేటీఆర్–జగన్ కలయిక ప్రథమ లక్ష్యం చంద్రబాబును ఓడించడమే అని చెప్పవచ్చు. జాతీయ స్థాయిలో తమదైన పాత్ర పోషిస్తున్న ప్రధాన రాజకీయ పక్షాలేవీ కూడా జగన్మోహన్ రెడ్డిని పెద్దగా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. కోల్‌కతా ర్యాలీకి మమతా బెనర్జీ నుంచి జగన్‌కు ఆహ్వానం అందకపోవడమే ఇందుకు నిదర్శనం. అయితే, కేసీఆర్‌కు మాత్రం జగన్ అవసరం ఉంది. ఏపీ అసెంబ్లీకి జరగబోయే ఎన్నికలలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓడిపోబోతున్నారని, జగన్ అధికారంలోకి వస్తారనీ కేసీఆర్ నమ్ముతున్నారు. ఈ కారణంగానే, జగన్‌ను పక్కన పెట్టుకుని జాతీయ రాజకీయాలలో కీలక పాత్ర పోషించాలని కేసీఆర్ తలపోస్తున్నారు. ప్రధాన మంత్రి పదవిపై రాహుల్ గాంధీ, మాయావతి, మమతా బెనర్జీ వంటివారు ఆశలు పెట్టుకున్నందున.. కుదిరితే ఉప ప్రధాని కావాలని కేసీఆర్ అభిలషిస్తున్నారు. తన కోర్కె నెరవేరాలంటే ఏపీలో జగన్మోహన్ రెడ్డికి అత్యధిక ఎంపీ స్థానాలు దక్కాలి. అందుకోసం అవసరమైన మార్గదర్శకత్వం చేయడంతోపాటు ఆర్థికంగా అండదండలు అందించడానికి కేసీఆర్ అండ్ కో ఒక నిర్ణయానికి వచ్చింది. దీనికే వారు 'రిటర్న్ గిఫ్ట్' అని పేరు పెట్టుకున్నారు.

జగన్‌కు లాభమా!? నష్టమా!?

జగన్మోహన్ రెడ్డిని చేరదీయడంలో కేసీఆర్ ఆశిస్తున్న ప్రయోజనాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. అయితే, కేసీఆర్‌తో అంటకాగడం వల్ల జగన్మోహన్ రెడ్డికి కలిగే లాభం ఏమిటన్నదే ప్రధాన ప్రశ్న. కేసీఆర్‌తో చెలిమి వల్ల ఎన్నికలలో జగన్ లాభపడతారా? నష్టపోతారా? అన్న అంశంపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలన్న ఆరాటంలో కేసీఆర్ అండ్ కో– జగన్మోహన్ రెడ్డి తొందర పడ్డారన్న అభిప్రాయం బలంగా వినిపిస్తున్నది. తెలుగుదేశం పార్టీ కూడా కేటీఆర్– జగన్‌ల భేటీని ఆయుధంగా మలచుకుని ఏపీ ప్రజలలో సెంటిమెంట్‌ను రగిలించబోతోంది. వివిధ సందర్భాలలో ఆంధ్రా ప్రజలను ఉద్దేశించి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ప్రముఖంగా ప్రచారం చేయాలని ఆ పార్టీ నిర్ణయించుకుంది. 'ఆంధ్రావాళ్ల బిర్యానీ పేడలెక్కుంటది'..; 'తెలంగాణలో బర్రెలు తాగే ఉలవచారును ఆంధ్రావాళ్లు తాగుతారు'..; 'జగన్‌ను తెలంగాణలోని జైలులో పెడితే జైలు స్థలం కూడా కబ్జా చేస్తారు'.. అంటూ కేసీఆర్, కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా సర్క్యులేట్ అవుతున్నాయి. అదే సమయంలో.. "చంద్రబాబుపై కక్షతో కేసీఆర్– జగన్మోహన్ రెడ్డి ఒక్కటవుతున్నారు. ఇదేమి రాజకీయం?" అంటూ జనసేనాని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు కూడా ప్రజలపై ప్రభావం చూపుతున్నాయి. తెలంగాణ రాజకీయాలలో ఆంధ్రావాడైన చంద్రబాబు వేలు పెట్టడాన్ని తెలంగాణ ప్రజలు తిరస్కరించినట్టుగానే.. ఏపీ రాజకీయాల్లో తెలంగాణ వాడైన కేసీఆర్ వేలు పెట్టడాన్ని ఏపీ ప్రజలు తిరస్కరించి తీరుతారని తెలుగుదేశం నాయకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే, జగన్మోహన్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. తెలంగాణ అయినా, ఆంధ్రా అయినా సెంటిమెంట్‌ను రగిలించడం తెలిసికే! తెలంగాణలో జరిగిన ఎన్నికలలో కేసీఆర్ మళ్లీ సెంటిమెంట్‌ను రగిలించినట్టుగానే, ఏపీలో జరగబోయే ఎన్నికలలో కూడా చంద్రబాబు తనకు అనుకూలంగా సెంటిమెంట్‌ను రగిలించే ప్రయత్నం చేయకుండా ఎందుకు ఉంటారు? ఉద్యమ సమయంలో తమను ఉద్దేశించి కేసీఆర్ అండ్ కో తిట్టిన తిట్లు సీమాంధ్రుల మనసులను అప్పట్లో గాయపరిచాయి. ఇప్పుడు మళ్లీ ఆ తిట్లను గుర్తు చేస్తే ఏపీ ప్రజలలో మళ్లీ కేసీఆర్‌పై వ్యతిరేకత ఏర్పడుతుంది. అదే జరిగితే, జగన్మోహన్ రెడ్డికి రాజకీయంగా నష్టం! జగన్– కేటీఆర్‌ల భేటీ తర్వాత వెలువడిన కొన్ని వ్యాఖ్యలు ఆసక్తికరంగా ఉన్నాయి. ఇందులో ప్రధానమైనది– కాంగ్రెస్ నాయకుడు తులసి రెడ్డి చేసిన వ్యాఖ్య! ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజశేఖర్ రెడ్డి టీఆర్‌ఎస్‌ను అంతమొందించడానికి స్కెచ్ వేశారని, ఆయన జీవించి ఉంటే టీఆర్‌ఎస్ కనుమరుగయ్యేదని, ఆ కోపాన్ని మనసులో పెట్టుకున్న కేసీఆర్ ఇప్పుడు రాజశేఖర్ రెడ్డి కుమారుడైన జగన్మోహన్ రెడ్డిపై ప్రతీకారం తీర్చుకోవడానికై ఆయనను అక్కున చేర్చుకుంటున్నారని తులసిరెడ్డి విశ్లేషించారు. కేసీఆర్ ఉద్దేశం అది కాకపోయినా, చంద్రబాబును దెబ్బ తీయాలన్న ఆయన లక్ష్యం అంతిమంగా బూమరాంగ్ అయి జగన్మోహన్ రెడ్డికి నష్టం చేయవచ్చు. వరంగల్ జిల్లా మానుకోట వద్ద జగన్‌పై అప్పట్లో టీఆర్‌ఎస్ రాళ్ల వర్షం కురిపించింది. ఆ తర్వాత పరకాల ఉప ఎన్నికలలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కొండా సురేఖ గెలిస్తే ఉద్యమం గతి ఏమవుతుందోనని టీఆర్‌ఎస్ శ్రేణులు తీవ్రంగా ఆందోళన చెందాయి. చివరకు, ముక్కీ మూలిగీ అతి స్వల్ప మెజారిటీతో టీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిచారు. ఆ తర్వాత చాలా కాలంపాటు టీఆర్‌ఎస్– వైసీపీ మధ్య మాటల యుద్ధం సాగింది. రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా కొంతకాలం ఇదే పరిస్థితి ఉండింది. బీజేపీ నుంచి తెలుగుదేశం పార్టీ దూరమైన తర్వాత టీఆర్‌ఎస్– వైసీపీల మధ్య స్నేహం చిగురించింది. ప్రధాని మోదీతో తాను విభేదించిన తర్వాత కేసీఆర్ తనపై విషం కక్కుతున్నారని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు కూడా!



> చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలన్న ఆరాటంలో కేసీఆర్ అండ్ కో– జగన్మోహన్ రెడ్డి తొందర పడ్డారన్న అభిప్రాయం బలంగా వినిపిస్తున్నది. తెలుగుదేశం పార్టీ కూడా కేటీఆర్– జగన్‌ల భేటీని ఆయుధంగా మలచుకుని ఏపీ ప్రజలలో సెంటిమెంట్‌ను రగిలించబోతోంది. వివిధ సందర్భాలలో ఆంధ్రా ప్రజలను ఉద్దేశించి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ప్రముఖంగా ప్రచారం చేయాలని ఆ పార్టీ నిర్ణయించుకుంది. అదే సమయంలో.. "చంద్రబాబుపై కక్షతో కేసీఆర్– జగన్మోహన్ రెడ్డి ఒక్కటవుతున్నారు. ఇదేమి రాజకీయం?" అంటూ జనసేనాని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు కూడా ప్రజలపై ప్రభావం చూపుతున్నాయి.

విరుగుడుకు చంద్రబాబు శ్రీకారం

ఏది ఏమైనా, రానున్న ఎన్నికలలో తనను ఓడించడానికై ప్రత్యర్థులందరూ ఏకమవుతున్నారన్న నిశ్చయానికి వచ్చిన చంద్రబాబు నాయుడు విరుగుడు చర్యలపై దృష్టి కేంద్రీకరించారు. అందులో భాగంగా, పెన్షన్‌లను వెయ్యి నుంచి రెండు వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ హామీని ఇచ్చినప్పటికీ.. వచ్చే ఏప్రిల్ నుంచే పెన్షన్‌లను రెండు వేల చొప్పున ఇస్తామని ప్రకటించారు. ఏపీలో అలా కాకుండా జనవరి నుంచే అమలు చేస్తున్నట్టు చంద్రబాబు ప్రకటించారు. ఈ పరిణామంతో వైసీపీ నాయకులు ఆందోళనకు గురవుతున్నారు. తెలంగాణలో కేసీఆర్ అఖండ విజయం సాధించడానికి సంక్షేమ పథకాలే ప్రధాన కారణమన్న అభిప్రాయానికి వచ్చిన చంద్రబాబు.. ఏపీలో మరిన్ని సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడుతున్నారు. పెన్షన్‌లను రెండు వేలకు పెంచుతామని జగన్మోహన్ రెడ్డి కూడా హామీ ఇచ్చినా, ఇప్పటికే అమలు చేస్తున్న చంద్రబాబుకే అడ్వాంటేజ్ ఉంటుంది. ఈ సందర్భంగా, గతంలో జరిగిన ఒక సంఘటనను గుర్తు చేసుకుందాం. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2009 ఎన్నికలకు ముందు కిలో బియ్యం ఐదు రూపాయల వంతున సరఫరా చేసేవారు. ఈ ధరను తగ్గించి మళ్లీ రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టాలని ప్రతిపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీ భావించింది. ఈ వార్త 'ఆంధ్రజ్యోతి'లో రావడంతో, అధికారంలో ఉన్న రాజశేఖర్ రెడ్డి అధికారులను వెంటనే పిలిపించుకుని రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం అమలుకు పూనుకున్నారు. దీంతో, చంద్రబాబుకు నాడు అడ్వాంటేజ్ లభించలేదు. తెలంగాణలో రైతుబంధు పథకం కూడా అధికార పార్టీకి లబ్ధి చేకూర్చినందున.. ఏపీలో కూడా ఇలాంటి పథకాన్ని అమలు చేయడానికి చంద్రబాబు నిర్ణయించుకున్నట్టు వార్తలు వచ్చాయి. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా జాతీయ స్థాయిలో రైతుబంధు తరహా పథకాన్ని అమలు చేయబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇదే నిజమైతే, పెట్టుబడి సాయం పథకాన్ని అమలు చేయడం చంద్రబాబుకు తేలికవుతుంది. డ్వాక్రా మహిళలకు కూడా ఆర్థికంగా లబ్ధి చేకూర్చే పథకానికి చంద్రబాబు శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ విధంగా సంక్షేమ పథకాల జోరు పెంచి కేసీఆర్ ప్రకటించిన రిటర్న్ గిఫ్ట్‌ను తిప్పికొట్టాలని చంద్రబాబు యోచిస్తున్నారు. ఇందుకోసం ఆయన ద్విముఖ వ్యూహాన్ని ఎంచుకున్నారు. ఇందులో మొదటిది.. కేసీఆర్– జగన్‌ల కలయికకు వ్యతిరేకంగా ప్రజలలో సెంటిమెంట్‌ను రగిలించడం. కాగా.. సంక్షేమ పథకాల జోరు పెంచడం రెండవది. ఈ నేపథ్యంలో, కేసీఆర్‌తో జగన్ చేయి కలపడం ఏపీలో ఆయనకు ఏ మేరకు నష్టం చేస్తుందన్నది వేచి చూడాలి. తెలుగుదేశం పార్టీ... కేసీఆర్ పట్ల ఏపీ ప్రజలలో ఏ స్థాయిలో వ్యతిరేకతను పెంచగలుగుతుంది అన్న దాన్నిబట్టి జగన్మోహన్ రెడ్డి పరిస్థితి ఆధారపడి ఉంటుంది.

గోల్ ఎవరిది.. సెల్ఫ్‌గోల్ ఎవరిది!?

జన సేనాని పవన్ కల్యాణ్‌ను జగన్‌తో కలపడానికి అటు బీజేపీ, ఇటు కేసీఆర్ అండ్ కో చేస్తున్న ప్రయత్నాలు ప్రస్తుతానికి ఫలించలేదు. ఇప్పటికి సొంతంగానే పోటీ చేయాలన్న ఆలోచనతో పవన్ కల్యాణ్ ఉన్నారని చెబుతున్నారు. జగన్మోహన్ రెడ్డిని అధికారంలోకి రాకుండా నిలువరించడానికి అవసరమైతే, తెలుగుదేశం పార్టీతో మళ్లీ జత కట్టడానికి పవన్ కల్యాణ్ సుముఖంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. బహుశా, ఈ ఆలోచనతో ఉన్నందునే కాబోలు జగన్–కేసీఆర్ కలయికను పవన్ కల్యాణ్ ఆక్షేపించారు. తెలంగాణ రాజకీయాలతో పోల్చితే, ఏపీ రాజకీయాలు సంక్లిష్టంగా ఉంటాయి. ఏపీలో కులాల ప్రభావం అధికంగా ఉంటుంది. కనుక, అది రాజకీయాలను ప్రభావితం చేస్తూ ఉంటుంది. కులాభిమానం గురించి ఇక్కడ ఒక సంఘటనను చెప్పుకోవాలి. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నియోజక వర్గం పరిధిలోని కొన్ని గ్రామాలలో వెలమ సామాజిక వర్గానికి చెందిన కొన్ని కుటుంబాలు ఉన్నాయి. తెలంగాణలో కేసీఆర్ విజయం సాధించిన తర్వాత వారు తమ గ్రామాలలో కేసీఆర్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీంతో, తెలంగాణ ముఖ్యమంత్రికి అనుకూలంగా మన గ్రామాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం మంచిది కాదని గ్రామ పెద్దలు మందలించి వాటిని తీయించారు. ఈ నేపథ్యంలో, ఏపీ రాజకీయాలలో వేలు మాత్రమే కాదు.. కాలు కూడా పెడతానని కేసీఆర్ నిర్ణయించుకోవడం వల్ల అక్కడి రాజకీయాలు ఏ మలుపు తీసుకుంటాయన్న దానిపై రాజకీయ వర్గాలలో ఆసక్తి నెలకొంది. కేసీఆర్ నిర్ణయాల వల్ల చంద్రబాబు– జగన్మోహన్ రెడ్డిలలో ఎవరికి లబ్ధి చేకూరుతుందో ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. ఈ ఇద్దరిలో ఎవరికి లాభం జరిగినా.. నష్టం జరిగినా కేసీఆర్‌కు ప్రత్యేకంగా పోయేది ఏమీ లేదు. ఎందుకంటే, ఆయన ఇప్పటికే ఇంట గెలిచారు. కాకపోతే, తాను కోరుకుంటున్నట్టు జగన్మోహన్ రెడ్డికి మెజారిటీ ఎంపీ సీట్లు వస్తే జాతీయ రాజకీయాలలో కేసీఆర్ కీలక పాత్ర పోషించడానికి ఉపయోగపడుతుంది. అయితే, కేసీఆర్‌తో చేతులు కలపడం వల్ల ఏపీలో తమకు అసలుకే మోసం జరిగే ప్రమాదం ఉందని వైసీపీ వర్గాలలో ఆందోళన నెలకొంది. ఈ ఆందోళనతో ఉన్న వైసీపీ ముఖ్య నాయకుడొకరు మాట్లాడుతూ, "సెల్ఫ్ గోల్స్ చేసుకోవడంలో మా వాడిని మించినవాడు లేడు" అని వ్యాఖ్యానించారు. ఎవరిది గోల్, ఎవరిది సెల్ఫ్ గోల్ అన్నది తెలియాలంటే ఎన్నికల వరకు వేచి చూడాల్సిందే!

దారి తప్పిన సోషల్ మీడియా

ఇదిలా ఉండగా, సినీ నటుడు ప్రభాస్‌తో తనకు సంబంధం ఉందంటూ సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, దీని వెనుక తెలుగుదేశం పార్టీ ఉందని జగన్మోహన్ రెడ్డి సోదరి షర్మిల ఇటీవల మీడియా వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. షర్మిల ఆవేదనను అర్థం చేసుకోవలసిందే! సోషల్ మీడియా అనేది ఇటీవలి కాలంలో బెడదగా మారింది. ప్రముఖులను, వారి కుటుంబ సభ్యులను టార్గెట్ చేసుకుని అసభ్యకర పోస్టింగులు పెడుతూ పైశాచికానందం పొందుతున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించడానికి వీలుగా చట్టాలను రూపొందించవలసిన అవసరం ఉంది. షర్మిల గత ఎన్నికల సందర్భంగా కూడా ఇటువంటి ఫిర్యాదునే చేశారు. ఆ తర్వాత ఆ అంశాన్ని ఆమె మర్చిపోయారు. ఇప్పుడు మళ్లీ ప్రత్యేకంగా పోలీసులను ఆశ్రయించి, మీడియా ముందు తన ఆవేదనను వెళ్లబోసుకోవడంలోని ఆంతర్యం ఏమిటో తెలియదు. ప్రత్యర్థులే టార్గెట్‌గా సోషల్ మీడియాను వేదికగా చేసుకుని దుష్ప్రచారం చేయడంలో అన్ని పార్టీలూ పోటీ పడ్డాయి. వైసీపీ అభిమానులు, జగన్ అభిమానులు కూడా తమకు గిట్టని వారిపై కుళ్లు రాతలు, జోక్స్ ప్రచారం చేయడం గమనార్హం! ఏదైనా తనదాకా వస్తే అనే పరిస్థితి ఉండకూడదు. సోషల్ మీడియా ఇప్పుడు దారితప్పింది. రాజకీయ పార్టీలు, వాటి అభిమానులు స్వీయ నియంత్రణ పాటించగలిగితే పరిస్థితి కొంత మెరుగుపడుతుంది. ఇప్పుడున్న పరిస్థితులలో అది జరిగే పని కాదు కనుక సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్న వారిని గుర్తించి, ఇతర నేరాల వలే కఠినంగా శిక్షించడం జరగాలి. ఇందుకు అవసరమైన చట్టాలు తీసుకు రావలసిన బాధ్యత రాజకీయ పార్టీలపైనే ఉంటుంది. ఎవరికి వారు తాము టార్గెట్ అయినప్పుడు గగ్గోలు పెట్టే బదులు.. ఎవరినైనా టార్గెట్ చేసుకోవాలంటే భయపడే పరిస్థితి తీసుకురావాలి. ఇందుకోసం రాజకీయ పార్టీలు ముందుకు రానిపక్షంలో సమాజం నుంచే ఒత్తిడి రావాలి. సోషల్ మీడియా బాధితులందరూ షర్మిల వలే బయటకు రాలేకపోవచ్చు. కానీ, మానసికంగా కుంగిపోతుంటారు. ఎవరినో మానసికంగా హింసిస్తే వారికి కలిగే లాభం ఏమిటో తెలియదు. ఒకరిపై ఉన్న గుడ్డి అభిమానంతో ఇతరులను కించపరచడం వల్ల జైళ్లకు వెళుతున్న వారిని చూస్తున్నాం. జగన్‌కు సానుభూతి రావాలన్న ఉద్దేశంతో ఆయనపై కోడి కత్తితో దాడి చేసిన శ్రీనివాసరావు పరిస్థితి ఏమిటి? అతడు జైలుకే పరిమితం అయ్యాడు. ఇలాంటి సందర్భాలలో నష్టపోయేది ఎవరో ఇలాంటి పెడ ధోరణులకు పాల్పడేవారు ఆలోచించుకోవాలి.

> పవన్ కల్యాణ్‌ను జగన్‌తో కలపడానికి అటు బీజేపీ, ఇటు కేసీఆర్ అండ్ కో చేస్తున్న ప్రయత్నాలు ప్రస్తుతానికి ఫలించలేదు. ఇప్పటికి సొంతంగానే పోటీ చేయాలన్న ఆలోచనతో పవన్ ఉన్నారని చెబుతున్నారు. జగన్మోహన్ రెడ్డిని అధికారంలోకి రాకుండా నిలువరించడానికి అవసరమైతే, తెలుగుదేశం పార్టీతో మళ్లీ జత కట్టడానికి పవన్ కల్యాణ్ సుముఖంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. బహుశా, ఈ ఆలోచనతో ఉన్నందునే కాబోలు జగన్–కేసీఆర్ కలయికను పవన్ ఆక్షేపించారు.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం
http://www.youtube.com/abntelugutv

మన మహోన్నత వైజ్ఞానిక వారసత్వం

ఆవు, దూడలు దారివెంట నడుస్తున్నాయి. ఈ రెండు ఎక్కడివి? ఎవరివి? అని దారిన పోయే దానయ్య పక్కనే నడుస్తున్న ఓ పెద్దాయనను అడిగాడు. ఆవు ఎక్కడిదో తెలియదు కానీ దూడ గురించి బాగా తెలుసు అన్నాడు. దానితో ఆగకుండా నాకు ఆవు నచ్చదు కానీ దూడ మాత్రం చాలా ఇష్టం. ఈ దూడ మాత్రం ఆవుదే! అన్నాట్ట. సరిగ్గా మన బుద్ధిజీవుల్లో కూడా ఇలాంటి పక్షపాతపు డైలాగులే రోజుకు పది పుడుతుంటాయి. ఈ దేశం మాదే అంటారు కానీ ఈ దేశంలో పుట్టిన సంస్కృతిని అంగీకరించరు!

ఈ మేధావులు రోజుకు పదిసార్లు పాశ్చాత్యుల గ్లోబలైజేషన్‌ను తిడుతారు కాని వారి వైజ్ఞానిక ఆవిష్కరణలు చూపించి మన దేశ వైజ్ఞానిక పరంపరను నిందిస్తారు. 'అన్ని వేదాల్లోనే ఉన్నాయష' అని వేదాలను, వేదాలను వెక్కిరించే వారు మనకు సంస్కర్తలుగా కొలువుదీరారు. ఈ భావవైరుధ్యం పక్కనపెట్టి నిజంగా ప్రపంచం బట్టలు కట్టని రోజే మన ఆలోచనలు ఎంత గొప్పగా ఉన్నాయో నిశితంగా చూడవచ్చు.

అణుబాంబు విస్ఫోటనం చూసి దాని అంతరార్థాన్ని భగవద్గీతలో (11/12, 11/32) శ్లోకాలలో చెప్పిన రాబర్ట్ జ్యూలియస్ వోపన్ హామర్ గురించి ఎంత మందికి తెలుసు! 16 జూలై 1945లో మాన్‌హట్టన్ ప్రాజెక్ట్ లో ప్రముఖంగా పనిచేసి అణుబాంబు పరీక్షల అనుభవాన్ని గీతాతత్వంతో అన్వయించుకున్న ఈ పాశ్చాత్య శాస్త్రవేత్త భగవద్గీత గొప్పతనాన్ని తన జీవిత చరిత్రలో నమోదు చేసుకొన్నాడు. క్రీ.శ. 1543లో మొదటి సారి సౌరవ్యవస్థకు సూర్యుడు కేంద్రంగా ఉంటే గ్రహాలన్నీ, భూమితో సహా అతని చుట్టూ తిరుగుతున్నాయి' అని కోపర్నికస్ చెప్పకముందే, నవగ్రహాల మధ్యలో సూర్యుణ్ణి పెట్టి ఆరాధించే మన హైందవ దేవాలయ సంస్కృతి మరెంత గొప్పదో చూడండి. ఛార్లెస్ డార్విన్ జీవ పరిణామ వాదాన్ని వివరించాడు. దానికి ఆధునిక కాలంలో విశేష ప్రాచుర్యం ఉందని మనకు తెలుసు. కానీ పంతజలి మహర్షి తన ఆత్మ యోగ సిద్ధాంతం ద్వారా 'మానవ జీవ పరిణామవాదం' అందించాడు. మనిషి ప్రవృత్తులను యోగ విద్య ద్వారా దివ్యంగా మార్చే అపూర్వ సిద్ధాంతాన్ని పునఃస్థాపన చేశాడు. పశువులా జీవించే మనిషిని దివ్య మానవుడిగా ఎదిగించే రహస్యం మనకు అందించాడు. గురుత్వాకర్షణ సిద్ధాంతం – ఆపిల్ – న్యూటన్ కథ వినగానే, భూమ్యాకర్షణ సిద్ధాంతం అని చదివిన మనం యురేకా! అంటూ పరుగులు పెడతాం, కానీ క్రీ.శ. 505లో జీవించిన వరాహమిహిరుడు తన 'పంచసిద్ధాంతి' అనే గ్రంథంలో 'భూతలంలోని ఏ భాగంలో అయినా... అన్ని జ్వాలలు పైకెగుస్తాయి. పైకి వేసిన వస్తువు కిందకు పడుతుంది' అని స్పష్టంగా చెప్పాడు. అలాగే బ్రహ్మగుప్తుడు (క్రీ.శ 591) భాస్కరాచార్యుడు (క్రీ.శ1114) ఇదే విషయాన్ని దృఢపరిచారు. ఇదంతా సైన్సు కాదా?

అలాగే గణితశాస్త్రంలోని అంక గణితం, రేఖాగణితం, బీజ గణితం, భూగోళ శాస్త్రం, ఖగోళ శాస్త్రం కలగలిపి మన ప్రాచీనులు అభివృద్ధి చేశారు. వేదకల్ప సూత్రాల్లోని శుల్బసూత్రాలు, యజ్ఞ వేదికల నిర్మాణాల విషయాలు అత్యంత ప్రాచీనమైనవి. క్రీ.శ. 6వ శతాబ్దానికి చెందిన బ్రహ్మగుప్తుడు చక్రీయ చతుర్భుజ విస్తీర్ణాన్ని, దాని వికర్ణాన్ని కనుగొనడంలో విశేషకృషి చేశాడు. శూన్యాంశం (సున్న) వర్గమూలం (స్క్వేర్ రూట్) ఘనమూలం (క్యూబ్ రూట్)లను భారతీయులే కనుగొని ప్రపంచంలోనే మొదటి గణిత విప్లవం సృష్టించారు. భూమి సూర్యుని చుట్టూ తిరగడానికి 365.2587 రోజులు పడుతుందని తన ఖచ్చితమైన గణితంతో చెప్పిన భాస్కరాచార్యుడు ఎంత గొప్ప గణితవేత్త. 1962లో మురళీ మనోహర్ జోషి ఉత్తరప్రదేశ్ పాఠ్యాంశ నిర్ణాయక కమిటీ ముందు బోధాయనుని ప్రమేయం గురించి చెప్తే, అందరూ వ్యతిరేకించారు. అప్పుడు జోషి, ఎడ్వర్డ్ టెల్లర్‌కు సంబంధించిన 'సింప్లిసిటీ ఎండ్ ద సైన్సు' పుస్తకం ముందు పెట్టి ఆయనే పేర్కొన్న బోధాయన ప్రమేయం మూలాలను చూపించాడు. ఈ ఎడ్వర్డ్ టెల్లర్ హైడ్రోజన్ బాంబు తయారీలో పాత్రధారి. నోబెల్ బహుమతి గెల్చుకొన్న విజేత. పైథాగరస్ పేర్కొన్న ప్రమేయాలకు బోధాయనుడి సూత్రాలే మూలం అన్నాడు. అదే విషయాన్ని తర్కబద్ధంగా వాళ్ల ముందు పెడితే చివరికి దానికి 'పైథాగరస్ బోధాయన ప్రమేయంగా' పేరు పెట్టారట! ఎంత విచిత్రం!!

రసవిద్య మన దేశంలో ఎంతో ప్రాచీనమైంది. నాగార్జునుడిని గొప్ప రసవిద్య తెలిసిన వ్యక్తిగా ప్రాచీన రసాయన గ్రంథాలు పేర్కొన్నాయి. రాగి, సీసం, బంగారం, తుత్తునాగం, వెండి వంటి వాటిని శుద్ధి చేసే విధానం ఈ దేశంలో అత్యంత ప్రాచీన కాలంలోనే ఉందని దాదాపు 50 ప్రాచీన రసగ్రంథాలు తెలియజేస్తున్నాయి. రస విద్య ద్వారా సప్త ధాతువుల్లో ఓజస్సు తగ్గకుండా ఎలా ఉండాలో మనవాళ్లు విశేష పరిశోధన చేశారు. ఆచార్య నాగార్జునుడి మార్గంలోనే ఐజక్ న్యూటన్ పరిశోధనలు చేసి రసవిద్య అంతు చూడాలనుకొన్నాడు. తన సహచర పరిశోధక మిత్రుడు రాబర్ట్ బోయల్‌తో కలిసి భారతీయ రసవిద్య ఆధారంగానే హేమ తారక విద్యను తెలుసుకోవాలనుకొన్నా మిత్రుడు మరణించడం, పెంపుడు కుక్క కొవ్వత్తిని తినడం ఆ ప్రయోగశాల బుగ్గిపాలయిందని చెప్తారు. న్యూటన్ రసవాదంపై చేసిన అంశాలు ఇప్పటికీ డీకోడ్ చేయలేకపోతున్నారని అనేక గ్రంథాలు ఆధారం ఇస్తున్నాయి. వేల యేళ్లనాడే అనేకానేక పరిశోధనలకు నెలవైన భారత రసాయన విద్య ఎందుకు మధ్యలో లుప్తమైందో ఆలోచించాలి!



> అణు విజ్ఞానం, గ్రహణాలు, కృష్ణబిల సిద్ధాంతం, ఖనిజ విజ్ఞానం, పాదరస ఔషధాలు, రాశిచక్రాలు, చెక్కుచెదరని లోహస్తంభ నిర్మాణం, స్ట్రింగ్ థియరీ, బిగ్ బ్యాంగ్ థియరీ, ... ఇలా చెప్పుకుంటూ పోతే భారతీయులు వేలు పెట్టని విద్య లేదు. అత్యంత ప్రాచీన కాలంలోనే భారతీయులు ఈ విషయాలను వాళ్ల కాలానికి తగినట్లుగా ఆచరణలో పెట్టారు. ఇప్పుడు గొప్ప విజ్ఞాన దేశాలుగా చెప్పేవి పుట్టని కాలంలోనే ఇలాంటి తొలి అడుగు వేసిన భారతీయ విజ్ఞాన వేత్తలను గుర్తించేదాకా మనకు పోరాటం తప్పదు.

కాంతి వేగాన్ని క్రీ.శ. 1675లో రోమర్ లెక్కించాడని చెప్తారు. కాని భారతీయ ప్రాచీనమైన ఋగ్వేదానికి సాయణాచార్యులు 14వ శతాబ్దంలోనే భాష్యం రాశారు. వారు కాంతి వేగం గురించి వ్యాఖ్యానిస్తూ 'అర నిమిషానికి 2202 యోజనాల దూరం ప్రయాణించు ఓ కాంతి కిరణమా! నీకు నమస్కారం' అంటారు. ఇదే విషయాన్ని 20వ శతాబ్దానికి చెందిన శాస్త్రవేత్తలు మెకిల్‌సన్స్, మోర్లే కాంతి వేగాన్ని సెకనుకు 1,86,300 మైళ్లు అని పేర్కొన్నారు. సాయణులు చెప్పిన విషయాన్ని క్రీ.శ. 1890లో మాక్స్ ముల్లర్ సంకలనం చేసిన 'ఋగ్వేదం' అనే ఆంగ్ల గ్రంథంలో కూడా ప్రస్తావించారు.

అనంతమైన కాలగణనను అరచేయిలో చెప్పే పంచాంగ, జ్యోతిష విజ్ఞానం వదిలి పెట్టి చిలక శాస్త్రాల జోస్యాలకు అలవాటుపడిన మనకు మన ప్రాచీనుల పరిజ్ఞానం ఎలా అర్థం అవుతుంది? సంస్కృతంలో కాలగణనకు చెప్పే 'హోర' హవర్ గా మారడం ఎలా సాధ్యమయిందో తెలిస్తే మన ప్రాచీనుల కాల చక్రం నేడు గ్రహించగల్గుతాం. మన చుట్టూ నడయాడిన బాలరాజు మహర్షి గొప్పతనాన్ని ఎవరో జర్మన్ వాళ్లు చెప్పాక గాని మనకు తెలిసిరాలేదు. 'ఔషధం కాని మొక్కలేదు. అన్న ఆయన సూత్రం ప్రకారం మన ప్రాచీన వైద్య గ్రంథాలలో 1,50,000 ఔషధ మొక్కల వివరాలున్నాయంటే మనం నమ్మగలమా! ప్రాచీన కాలంలోనే మరుగుజ్జు వృక్షాలను (బోన్సాయ్ మొక్కలు) గురించి చరకుడు తన చరక సంహితలో 'వామన తను వృక్షాది విద్య' ప్రత్యేక ప్రకరణంలో పేర్కొన్నాడు.

ఆచరణలో పెట్టాడు. స్త్రీ అండాన్ని, పురుషుని శుక్రకణాన్ని టెస్ట్ ట్యూబ్‌లో కలుపుతారు. ఫలదీకరణం జరిపి పిండాన్ని స్త్రీ గర్భంలో ప్రవేశపెడతారు. ఇది ఆధునిక కాలంలో జరుగుతున్న ప్రక్రియ. 5 వేల యేళ్ల క్రితమే వ్యాస మహర్షి గాంధారి గర్భంలోని పిండాన్ని నూటొక్క కుండల్లో ప్రవేశపెట్టి కౌరవ సంతానోత్పత్తికి ఆద్యుడయ్యాడు. గర్భ మార్పిడి, వీర్య దానం వంటి విషయాలను పిండోత్పత్తి శాస్త్రంగా ఆనాడు అభివృద్ధి పరిచారు. ఇది ఎందరికి తెలుసు?

లింగమార్పిడి, మంత్ర తంత్రాలు, అంతరిక్ష విహారం, ఆకాశంలో ఎగిరే పుష్పక విమానం, ప్రాచీన అణు విజ్ఞానం, గ్రహణాలు, కృష్ణబిల సిద్ధాంతం, పంచభూతాల పరిజ్ఞానం, నేలలో దాగిన ఖనిజ విజ్ఞానం, పాదరస ఔషధాలు, రాశిచక్రాలు, నవగ్రహ విజ్ఞానం, విజువల్ చలనం, విశ్వ పరిజ్ఞానం, చెక్కుచెదరని లోహస్తంభ నిర్మాణం, భూతద్దాల తయారీ, తాళపత్రాలను గ్రంథాలకు వాడడం, నగర నిర్మాణం, అద్భుతమైన సంస్కృత భాష, సంఖ్యామానం, స్ట్రింగ్ థియరీ, బిగ్ బ్యాంగ్ థియరీ, శబ్దంలోని మర్మం, రూపంలోని రహస్యం, భారద్వాజ వైమానిక శాస్త్రం, నౌకా నిర్మాణం, వ్యవసాయ విజ్ఞానం, క్రీడలు, అవధానం, కవిత్వం, భారతంలోని యుద్ధ నైపుణ్యాలు, స్వరాలతో సంగీత శాస్త్రం, శిల్పం, నృత్యకళ, చిత్రలేఖనం, సాముద్రికం, కామశాస్త్రం, మంత్రం, వాస్తు, ఋషుల శాంతి దృక్పథం, అర్థ, న్యాయశాస్త్రాలు... ఇలా చెప్పుకుంటూ పోతే భారతీయులు వేలు పెట్టని విద్య లేదు. అత్యంత ప్రాచీన కాలంలోనే భారతీయులు ఈ విషయాలను వాళ్ల కాలానికి తగినట్లుగా ఆచరణలో పెట్టారు. ఇప్పుడు గొప్ప విజ్ఞాన దేశాలుగా చెప్పేవి పుట్టని కాలంలోనే ఇలాంటి తొలి అడుగు వేసిన భారతీయ విజ్ఞాన వేత్తలను గుర్తించేదాకా మనకు పోరాటం తప్పదు.

సైన్సు అనగానే తామే దాని టేకేదార్లమని ప్రగల్భాలు పలికే వాళ్లు సైన్సు వల్ల జరిగే అభివృద్ధిని వ్యతిరేకిస్తారు. సైన్సు అంటే బ్యూరెట్టు, పిప్పెట్టు, ప్రయోగశాల అని మాత్రమే భావించి మాట్లాడే అజ్ఞాన వేదికలకు చెప్పలేక పోవచ్చు కాని సమతుల్య మనస్సుతో అధ్యయనం చేసే వాళ్లను ఆహ్వానించవచ్చు. సైన్సు అంటే అధ్యయనానికి, ప్రయోగానికి ఓ ప్రక్రియ. అంతేకాని అదో జడ పదార్థం కాదు. ఏమీ తెలియకుండానే ప్రాచీన భారతీయులు ఇన్ని ప్రక్రియలకు సంబంధించిన ఊహలు చేయగలిగారు. భారతీయులకు ఎన్ని విద్యలు తెలిసినా మనం ఎక్కడి నుండి వచ్చాం? మనం ఎవరం? మనం ఎక్కడికి వెళ్లాం? అన్న మూడు ప్రశ్నల చుట్టే తమ శాస్త్రాలను తిప్పుకొన్నారు. ఉత్తర కొరియా, పాకిస్థాన్‌లలాగా అణుబాంబులను చేతిలో పట్టుకొని బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడలేదు. అలాంటి మహోన్నత భారత వారసత్వాన్ని అనుసరించి డా. ఏ.పి.జే. అబ్దుల్ కలాం కూడా భారతీయ అణు విజ్ఞానం మన రక్షణకే గాని ఇతరులపై ప్రయోగానికి కాదు అన్నాడు. ప్రముఖ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ తన చివరి ముప్పై ఏళ్లలో సాధించిన సాపేక్షతా సిద్ధాంతం ప్రపంచానికి కొత్త వెలుగైనా మానవ జీవన మూల్యాలను చెప్పే భారతీయ తత్వ శాస్త్రాలవైపు మొగ్గు చూపాడు. అందుకే సున్నాను కనుగొన్న భారతీయులకు ప్రపంచం ఋణపడి ఉందన్నాడు ఐన్‌స్టీన్. వాస్తవాలు తెలుసుకోకుండా కుయుక్తులతో కాలం గడిపే బుద్ధిజీవులు సమతుల్యమైన మనస్సుతో అధ్యయనం చేస్తారని ఆశిద్దాం.

■ డా. పి. భాస్కర యోగి



ఆయన పాట...
ఆకాశదేశంలోనూ, అందమైన వెన్నెలలోనూ విహరించగలదు
ముద్దబంతి పూవులో మూగబాసల్ని వినిపించగలదు
కార్యేషు దాసీ కరణేషు మంత్రీ అనగలదు
దేవుడిచ్చిన వీధుల వెంట హరివరాసనాలను ఆలపించగలదు..
ఆనందంగా ఆనకట్టలు దాటి ప్రవహించగలదు...
ఆ స్వరకర్త పేరు ... కట్టశ్శేరి జోసఫ్ ఏసుదాస్. ఆయన మాటల మాధుర్యం 'నవ్య' పాఠకులకు ప్రత్యేకం.

ఈ మధ్య నేను నేర్చుకున్నది అదే!

■ **మీరు ఎప్పుడూ 'నేను నిత్య విద్యార్థిని' అని అంటారుగా... ఇటీవలికాలంలో మీరు నేర్చుకున్న కొత్త అంశం గురించి చెప్పండి?**

రీసెంట్‌గా నేర్చుకున్నదా... (నవ్వులు) దేని గురించి చెప్పమంటారు?

■ **ఏదైనా చెప్పండి. రీసెంట్‌గా నేర్చుకుని ఉంటే చాలు..**

విషయాలన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటాయి. ప్రతిదానికీ ఎక్కడో ఒకచోట ఆరంభం ఉంటుంది. సరైన సంబంధం లేకుండా ఏదీ ఉండదు. ఒకవేళ హఠాత్తుగా ఏదో మన వరకూ వచ్చినా, దానికి విలువ ఉండదు. నా దృష్టిలో భగవంతుడు ఒకడే. శక్తి ఒకటే. రెండు శక్తులు ఉండవు. నేను అన్ని మతాల వారి దగ్గరా దీని గురించి మాట్లాడుతాను. మా నాన్న నాకు ఒక విషయాన్ని నేర్పించారు. 'నువ్వు ఎలాంటి రిలీజియస్ పార్టీలోనూ, పొలిటికల్ పార్టీలోనూ సభ్యత్వం తీసుకోవద్దు, ఏ క్లబ్‌లోనూ మెంబర్ కావద్దు' అని. మా నాన్న నాకు చేసిన అతి పెద్ద ఉపదేశం అదే. ఇవాళ నాకున్న అత్యంత పెద్ద శక్తి కూడా అదే. నాకు అందరూ ఇష్టమే. ఆ ఇష్టాన్ని దాటి ఒకవేళ మీతో బాగా క్లోజ్ అయ్యాననుకుందాం. మీరేమైనా చేస్తే 'అమ్మా అది తప్పు' అని చెప్తాను. అదే తప్పు నేను చేస్తే మీరు కూడా 'అన్నా.. అది తప్పు' అని చెప్పవచ్చు. 'కాదమ్మా. నేను ఫలానా సందర్భంలో ఫలానా విధంగా చేశాను' అని వివరిస్తాను. నేను చెప్పేది నిజమైతే మీరు అర్థం చేసుకుంటారు. ఒకవేళ నేను పైకి నిజం చెబుతున్నట్టు నటించి, అబద్ధం కూడా చెప్పొచ్చు. దాని వల్ల మిమ్మల్ని మోసం చేయవచ్చు. చెప్తున్నది నిజమా? అబద్ధమా? అనేది నాకు మాత్రమే తెలుస్తుంది. మీరు నమ్మేదాన్ని బట్టి ఉంటుంది.... కాబట్టి ఇలా ప్రతిదీ ఒకదానికి ఒకటి కనెక్ట్ అయి ఉంటుంది.

నేను నమ్మే ఇంకో విషయాన్ని చెబుతాను... భగవంతుడిని తెలుగులో 'దేవుడు' అని అంటారు. 'దైవం' అని మలయాళంలో అంటారు. కానీ తమిళ్‌లో 'కడవుళ్' అంటారు. 'వుళ్' అంటే లోపల, 'కడ' అంటే ఉండు.. అని అర్థం. అంటే దేవుడు మనలోనే ఉంటాడు అని అర్థం. ఎక్కడ మంచి ఉంటుందో, అక్కడే గొప్పతనమంతా గూడుకట్టుకుని ఉంటుంది. హంస గురించి నేను చాలా విన్నా. ఎప్పుడూ చూడలేదనుకోండి. గొప్ప విషయాలు అన్నీ మనం చూస్తేనే నమ్మాలనేం లేదుగా. హంసలు కలగలిసి ఉన్న పాలూ, నీళ్లను విడదీస్తాయట. పాలను మాత్రం వేరు చేయడం ఎంత గొప్ప! అలా మనం అందరం మంచిని మాత్రం తీసుకోవడానికి ప్రయత్నించాలి. ఎందరో మహానుభావులు నిత్యం 'భగవంతుడా' అని అనుకుంటూ ఉంటారు. అలాంటివారినే మనం స్మరించుకుంటూ ఉంటాం. అంతేగానీ దుర్మార్గంలో నడిచిన కోటీశ్వరుల గురించి ఎవరైనా ముందు తరాలకు చెప్తారా? చెప్పరు కదా? సత్యమేవజయతే అని నమ్మి బతికిన వారిని, త్యాగమూర్తులను గురించే కదా మనం నిత్యం స్మరించుకునేది. ఇతరులకోసం జీవించిన వారి గురించే కదా గొప్పగా, భక్తిపూర్వకంగా చెప్పుకుంటూ ఉంటాం. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని సన్మార్గంలో నడవాలి. మంచి మాత్రమే కాలానికి నిలుస్తుంది. ఇంకేదీ నిలవదు.

■ **మీరెప్పుడూ ప్రశాంతంగా ఉంటారు. దానికి కారణం ఈ తత్వచింతనేనా?**

నా ఆకృతి అంతే అనుకోండి. (నవ్వుతూ). సరదాకు అన్నాను. అలా కనిపించడానికి కారణం ఉంది. నాలుగేళ్లుగా నేను గడ్డం తీయడం లేదు. జుట్టుకు రంగు వేసుకోవడం లేదు. ప్రకృతి మనకు ఏ వయసులో ఏది ప్రసాదిస్తుందో దాన్ని అంగీకరించగలగాలి. అంతేగానీ, ఏదో ప్రదర్శన కోసం ఇంకో రకంగా ఉండటం నాకు ఇష్టం లేదు. రీసెంట్‌గా ఓ చిన్న పాప చెప్పిన మాటలు నన్ను కదిలించాయి. ఆ పాప బుద్ధుడి గురించి మాట్లాడింది. తను మాట్లాడుతున్నప్పుడు నాలో పెద్ద చలనం ఏమీ లేదు. కానీ రోజులు గడిచే కొద్దీ నాలో ఆలోచనా శక్తిని పెంచిన మాటలవి. బుద్ధుడు రోజూ ఒక చోటుకి స్నానానికి వెళ్లేవాడట. ఆయన స్నానం చేసే ప్రదేశానికి పైన కాస్త ఎత్తునుంచి ఓ పెద్దావిడ రోజూ అతని మీద చెత్తను పడేసేదట. ఆయన ఏరోజూ దాన్ని పట్టించుకునేవాడు కాదట. తనమటుకు తను స్నానం చేసి బయటకు వెళ్లేవాడట. ఇలా కొన్నాళ్ల పాటు జరిగిందట. చివరికి ఒకరోజు ఆమె చెత్త వేయలేదట. అప్పుడు బుద్ధుడు దాన్ని గమనించి 'ఆమెకు ఏమైంది' అని అడిగాడట. ఆలోచించేకొద్దీ నాకు తెలిసింది ఏంటంటే మనం పనికిరాని విషయాలమీద ధ్యాస నిలుపుతున్నాం. ఎవరో ఒకరు ఎక్కడో ఒకచోట నవ్వుతూ ఉంటారు. 'వాడేంటి నన్ను చూసి నవ్వుతున్నాడు' అని ఇవతలివాడు అనుకుంటాడు. కానీ నిజానికి ఏం జరిగి ఉంటుంది. అతను ఎక్కడో చూసి నవ్వుకుంటూ ఉంటాడు. అక్కడ ఇవతలివాడికి కోపం అవసరం లేదు. అయినా కోపాన్ని అక్కడ క్రియేట్ చేసుకుంటున్నాడు. అలాంటి చెత్త పనులను ఎందుకు పట్టించుకోవాలి? అనేది నా ప్రశ్న. వీటన్నిటికీ కారణం చెవులు, కళ్లు. అవి మనకు ఎంత ప్రధానమో...కొన్నిసార్లు అంత విరోధులు. కొన్నిసార్లు అవి మనల్ని బుద్ధుడి లాగా ఉంచగలవు. అప్పుడు ఎవరు ఏం అన్నా.. పట్టించుకోకుండా స్నానానికి వెళ్లి, శుభ్రంగా వచ్చేయొచ్చు. మరికొన్నిసార్లు చెడుగా నడిపించగలవు. ఈ విషయం మనకు అర్థమైతే ప్రపంచమంతా అర్థమైనట్టే. అనవసరమైన వాటికి 'మనస్సాక్షి'ని ముందు నిలపకూడదు. మనసు ప్రవహిస్తూ ఉంటుంది. సాక్షి మాత్రం ఎక్కడికీ కదలదు. మనస్సాక్షి శుభ్రంగా ఉంటే మనం దేనికీ భయపడాల్సిన పనిలేదు. ఇందాక మీరు అడిగారు కదా...'ఇటీవల ఏం నేర్చుకున్నారు' అని.. 'ఇదే' నా సమాధానం. ఈ మధ్య కాలంలో బాహ్య విషయాల గురించి ఏవైనా ఆలోచనలు వచ్చినప్పుడు 'వాటి గురించి ఇప్పుడు ఎందుకమ్మా' అని అనుకుంటున్నా. 'ఎందుకమ్మా' అని నేను అంటున్నది నా భార్యతోనో, ఇంకొకరితోనో కాదు. నా మనస్సుతో. ఎందుకంటే నాలో ఏం తప్పులున్నాయి.. నేనేం సరి చేసుకోవాలి? ఇంకేం నేర్చుకోవాలి అనే విషయాలను ఆలోచిస్తే నాకు మంచిది. క్రీస్తు కూడా ఈ విషయాన్నే చెప్పారు. 'నీ కళ్లల్లో ఇంతింత పెద్ద కర్రలను పెట్టుకుని, ఎదుటివాడి కంటిలో ఆవగింజంత తప్పుని ప్రశ్నిస్తావేం?' అని ఆయన అంటాడు. ప్రతి ఒక్కరూ దాన్ని అర్థం చేసుకోవాలి.



నాన్న నేర్పారు!

నేను ఎంత బాగా పాడినా మా నాన్న నన్ను ఏ రోజూ మెచ్చుకోలేదు. 'కన్న కొడుకును తండ్రి పొగడకూడదేమో' అని అనుకునేవాడిని. మా నాన్న పాటించిన సిద్ధాంతాన్ని నేనూ అవలంబిస్తున్నాను. ' ఈ రోజుల్లో అలాంటివాటిని పట్టించుకోకూడదు. ఎప్పటికప్పుడు పొగుడుతూ ప్రోత్సహిస్తూ ఉండాలి' అని ఎవరైనా చెప్పినా నేను విని, నవ్వి ఊరుకుంటాను. మా అబ్బాయి విజయ్ ఏసుదాస్ అభివృద్ధిని చూసి నేనూ, నా భార్య ప్రభ మనసులోనే సంతోషిస్తాం.

కుమారుడు విజయ్ ఏసుదాస్‌తో...

■ **సంస్కృతం గురించి ఎక్కువగా చెబుతుంటారు?**

నా దృష్టిలో ప్రతి ఒక్కరూ సంస్కృతం తెలుసుకోవాలి. మన దేశంలో ఉన్న అన్ని భాషల్లోనూ సంస్కృత పదాలు మిళితమై ఉంటాయి. ఇన్ని భాషల్లో మిళితమైన సంస్కృతాన్ని మనం తెలుసుకోవడంలో తప్పేముంది? వేదాలు, ఉపనిషత్తులు అన్నీ సంస్కృతంలోనే ఉన్నాయి. వాటిని మనం తెలుసుకోవాలి. చదువుకోవాలి. స్వీడన్‌లో అనుకుంటా... నమక చమకాలను తెల్లవారుజామున పిల్లలు చదువుతున్నారు. వాళ్లు వాటిల్లోని గొప్పతనాన్ని అర్థం చేసుకున్నారు. లండన్‌లో ఎడ్యుకేషన్ విభాగం నిర్వహించిన ఓ పరిశోధనలో సంస్కృత శబ్దాలు, వ్యాకరణాలు తెలుసుకుంటే మెదడు చురుగ్గా పని చేస్తుందని వెల్లడైంది. మన సంపద ప్రాధాన్యాన్ని మనం గ్రహించాలి. వదులుకోకూడదు.

■ **మిమ్మల్ని గురించి మాట్లాడేటప్పుడు గంభీరమైన మెలోడీ పాటలే గుర్తుకొస్తాయి. వాటిని పాడటంలో మీకు ఎప్పుడైనా ఒత్తిడి అనిపించేదా?**

సంస్కృతంలో ఎన్ని అక్షరాలున్నాయో, అన్నీ మలయాళంలోనూ ఉన్నాయి. కాకపోతే యాక్సెంట్ వేరుగా ఉంటుంది. రాగాల్లో గమకాలు డిఫరెంట్‌గా వచ్చినట్టు ఇక్కడ కూడా వేరుగా ఉంటుందంతే. మలయాళీలు ఎక్కడికి వెళ్లినా మిగిలిన భాషలను చాలా బాగా నేర్చుకుంటారు. 'పర్వతం', 'సూర్య'లోని రెండు 'ర'లు కూడా వేరుగా ఉంటాయి మలయాళంలో. ఆ తేడా తెలుసుకుని పాడతాను నేను. తెలుగు వాళ్లు 'అర్థం' అనే పదంలో 'థ'ని పలకరు. 'ధ' అనే అంటారు. రాసేటప్పుడు మాత్రం 'అర్థం' అని రాయడాన్ని గమనించాను. ఇలాంటి విషయాలను నేను జాగ్రత్తగా గమనించి చక్కగా పలికేవాడిని. ఎందుకంటే భావితరాలు మనం దేన్ని ఎలా పలుకుతున్నామో.. వాటిని విని నేర్చుకుంటారు. అలాగే ప్రతి పదాన్ని పూర్తిగా పలకాలనేది నా నియమం. నేను పదాలను మింగను. అలా మింగకూడదనే ప్రతిదీ మలయాళంలో రాసుకునేవాడిని. ఎందుకని ఎవరైనా అడిగితే 'నేను వడ్డించే భోజనం బావుందా? లేదా? అనేది కీలకం. అంతేగానీ నేను ఏ పాత్రలో వండాను? అందులో ఏం వేశాను అనేది చూడొద్ద'ని చాలా మందికి మనవి చేసేవాడిని.

■ **'తెలుగు' అనగానే మీకు గుర్తుకొచ్చే తొలి విషయం?**

'ఓ నిండు చందమామ' అని నేను పాడిన నా తొలి పాట గుర్తుకొస్తుంది. కోదండపాణిగారి మ్యూజిక్ డైరక్షన్‌లో పాడా. ఎస్పీ బాలుగారిని కూడా కోదండపాణిగారే కదా పరిచయం చేసింది. 'తెలుగు' అనగానే నాకు త్యాగయ్య గుర్తుకొస్తారు. ఎందుకంటే అన్ని కృతులు తెలుగులోనే ఉంటాయిగా. తెలుగు, సంస్కృతంలో నేను పాడే కృతులు ఎక్కువగా ఉంటాయి. ఈ రెండు భాషలు సంపూర్ణంగా అర్థం కాకపోయినప్పటికీ నేను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. నా దృష్టిలో క్లాసికల్ మ్యూజిక్ అనగానే తెలుగు, సంస్కృతమే గుర్తుకొస్తుంది. ఈ భాషలకు ఓ గంభీరం ఉంటుంది. ప్రతి భాషకూ ఓ సొగసు ఉంటుంది. కాకపోతే మనం దాన్ని అర్థం చేసుకోవాలి.

■ **మీకు, మోహన్‌బాబుగారికి విడదీయరాని బంధం...**

ఆయన ఫోన్ చేసి 'బ్రదర్.. ఒన్ సాంగ్ ఫర్ మి. ఐ యామ్ కమింగ్' అని అంటారు. ఆయన నాకు చాలా క్లోజ్.

■ **కాంట్రవర్శీలకు దూరంగానే ఉండాలనుకుంటారా?**

బయట ఏం జరుగుతుందో నాకు అనవసరం. కానీ నా లోపల ఏం జరుగుతుందనేది నాకు కీలకం. దాని గురించి మాత్రమే ఆలోచిస్తా. క్రైస్ట్ ట్రూ పర్సన్. మహ్మద్ ట్రూ పర్సన్. విష్ణుమూర్తి ట్రూ పర్సన్. వాళ్లే కాదు.. హై ఫిలాసఫర్స్ అందరూ ట్రూ పీపుల్. దేవుడు అమ్మ కడుపులో పుట్టలేదు. అతను ప్రపంచాన్ని సృష్టించాడు. అతను మతాలకు అతీతుడు. కాంట్రవర్శీలకు అతీతుడు. నేను దాన్ని నమ్ముతాను.

■ **మీ సక్సెస్‌లో సగభాగం మీ భార్యదేనంటారా?**

> నా వయసు 79 ఏళ్లు. ఇప్పటికీ హై పిచ్‌లో పాడగలుగుతున్నానంటే అందుకు కారణం నేను తీసుకునే ఆహారం. నా ఆరోగ్యానికి సరిపడే ఆహారాన్ని తీసుకుంటాను. నేనే కాదు, ఏ వృత్తిలో ఉన్నవారైనా మంచి ఆహారాన్ని తీసుకోవాలి. ఒకవేళ బయట తినాల్సి వచ్చినా మితంగా తినాలి. నేను గత కొన్నేళ్లుగా శాకాహారాన్ని తీసుకుంటున్నాను. నా భార్య చేతివంట బావుంటుంది.



భార్య ప్రభతో..

ప్రభ నా భార్య కావడం నా అదృష్టం. ఎందుకంటే ఆమె సంగీతాన్ని నాకన్నా ఎక్కువగా ఆస్వాదిస్తుంది. అందుకే నేను హ్యాపీగా ఉన్నా. ఎప్పుడూ తమాషాగా ఓ మాట చెబుతుంటాను. నాకు ఇద్దరు భార్యలున్నారు. నా తొలి భార్య సంగీతం.. నా రెండో భార్య ప్రభ అని. ఇక్కడ ఓ విషయాన్ని మీరు గమనిస్తే నా తొలి భార్యను నా రెండో భార్య గౌరవిస్తుంది. నాకన్నా ఎక్కువగా ఆరాధిస్తుంది. అది ఎంత అదృష్టం!

■ **అయితే మీకు కర్ణాటక సంగీతం, సినిమా సంగీతం ఇద్దరు భార్యలని అనుకోవచ్చా?**

లేదు. లేదు. కర్ణాటక సంగీతం నన్ను కన్న తల్లి. నన్ను పెంచి, పోషించిన అమ్మ సినిమా సంగీతం.

■ **మరి పెంచి పోషించిన అమ్మ వైపు కినుక వహించారా? ఈ మధ్య సినిమాల్లో పాడటం తగ్గించేశారేం?**

కుర్రకారు చాలా మంది పాడుతున్నారు కదా. వాళ్లకు వదిలేశాను. అలాగని పాడటం ఆపలేదు. చాలా మంచి పాట అనిపిస్తే మాత్రం తప్పకుండా పాడుతున్నా. నిన్న కూడా ఓ మలయాళ చిత్రానికి పాడా.

■ **ట్రాక్ మిక్సింగ్ వచ్చాక పాడుతున్న 'ఫీల్' మిస్ అవుతోందని చాలా సార్లు చెప్పారు..**

లేటెస్ట్‌గా ఓ మలయాళ పాటను పాడానని అన్నాను కదా. అందులో ఫీమేల్ సింగర్‌ని నేను చూడలేదు. అదే పూర్వం నేను, సుశీలమ్మ ఎన్నో పాటలను ఒకే మైక్‌లో పాడేవాళ్లం. ఆవిడ పాడి పక్కకు జరిగితే నేను వెళ్లి పాడేవాడిని. ఆ 'ఫీల్' పాటలోనూ వినిపించేది. ఇప్పుడు అందరూ రెడీమేడ్ ఫుడ్‌ని ఇష్టపడుతున్నారు.

■ **ఈ పరిస్థితిని ఏమీ చేయలేమా?**

ఇప్పుడు ఎవరూ ఏమీ చేయలేం. నేనన్నట్టు ఫాస్ట్ ఫుడ్ యుగం ఇది. అక్కా, అమ్మా, తాతా, బామ్మా, అందరూ కూర్చుని బియ్యంలో రాళ్లు ఏరి, నీళ్లతో కడిగి శుభ్రం చేసి, నానపెట్టి వండటానికి ఎవరికీ టైమ్ లేదు. అందువల్ల రెడీమేడ్‌గా దొరికిన పిండితో ఇడ్లీ చేసుకుని తినడమే. దానిలో ఏం టేస్ట్ ఉంటుందో నాకు మాత్రం తెలియదు.

ఈ ఫాస్ట్‌ఫుడ్ యుగంలో పిల్లలతో గడుపుతున్నారా?

మా మనవళ్లు, మనవరాళ్లతో ఎక్కువ సమయాన్ని గడుపుతున్నాం. అదే ఇప్పుడు మాకు లైఫ్. మా అబ్బాయ్ విజయ్ మాతోనే ఉంటాడు. తన పిల్లలు మాకు బాగా క్లోజ్. నేను, ప్రభ ఎప్పుడూ ఎక్కడో ఒకచోటికి వెళ్తూనే ఉంటాం. పిల్లలతో ఎక్కువ సమయాన్ని గడపలేకపోతున్నామనే బాధ నా భార్యకి ఎక్కువగా ఉంది. నా ప్రపంచం సంగీతం కాబట్టి నేనేం అంతగా పిల్లల్ని మిస్ కాను.

■ **మీ మూడో జనరేషన్‌లో గాయకులు ఎవరున్నారు?**

అమేయ నా మనవరాలిపేరు. అవ్యాన్ నా మనవడి పేరు. నా మనవడికి నాకన్నా ఎక్కువ మ్యూజిక్ టేస్ట్ ఉంటుందని అనుకుంటున్నా. కాకపోతే తనకి శాస్త్రీయంగా నేర్పించడానికి కూడా నాకు సమయం ఉండటం లేదు.

■ **మీకు ఏకలవ్య శిష్యుల సంఖ్య ఎక్కువే కదా?**

చాలా మంది ఉండొచ్చు. వాళ్లు నేరుగా వస్తేనే ఏకలవ్యం మంచిదా? గురుకులం మంచిదా? అనేది తెలుస్తుంది.

■ **మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్ పెట్టాలని అనిపించలేదా?**

ఇప్పుడు అందరూ షార్ట్ టైమ్‌లో ఫేమస్ కావాలనే అనుకుంటున్నారు. నిజంగా సంగీతాన్ని నేర్చుకోవడానికి ఎంత మంది ఉంటారో తెలియదు. నేను అలా కాదు. నిన్న కూడా ప్రాక్టీస్ చేశాను. ఈ వయసులోనూ వణకకుండా పాడాలన్నదే నా ధ్యేయం.

■ **ఎక్సర్‌సైజ్‌లు వంటివి చేస్తుంటారా?**

పాట అనేది నాడికి సంబంధించింది. ప్రాణవాయువు బావుంటే అంతా బావుంటుంది. ఎక్కువ మాట్లాడకూడదు. ఇదిగో మీరు ఇంత మాట్లాడిస్తున్నారు కదా. అంత మాట్లాడకూడదన్నమాట. నాడి శుభ్రత ఉంటే ఏ వ్యాధీ రాదు. పూర్వీకులు ఎన్నో చెప్పారు. కాకపోతే వాటిని పాటించాలనే జ్ఞానం మనకు ఉండాలి.

• **డా. చల్లా భాగ్యలక్ష్మి**
ఫొటోలు: **రామినేని రాజ్‌కుమార్**

హెల్త్‌కేర్

చలికాలం తినాల్సిన పళ్ల జాబితాలో సపోటా ఒకటి. ఈ పండును కేవలం రుచికోసమే కాకుండా శరీరానికి అవసరమైన పోషకాలు, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం తప్పకుండా తినాల్సిందే. దీనిలోని విటమిన్ సి పేగులను ఆరోగ్యంగా ఉంచుతుంది. హానికారక బ్యాక్టీరియాను చంపేస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.



పోషకాల సపోటా..

జీర్ణక్రియ మెరుగ్గా: సపోటాలో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. ఇది ఆహారం చక్కగా జీర్ణమయ్యేలా చేస్తుంది. కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. పెద్దపేగుకు ఇన్‌ఫెక్షన్లు సోకకుండా కాపాడుతుంది.

ఇన్‌ఫ్లమేటరీ ఏజంట్: దీనిలో ఎక్కువ మోతాదులో ఉండే టానిన్స్ యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ వాహకాలుగా పనిచేస్తాయి. అంతే కాదు జీర్ణాశయ సంబంధ పలు వ్యాధులను నివారిస్తాయి కూడా. వాపు, నొప్పిని తగ్గిస్తాయి.

జలుబు, దగ్గు: సపోటలోని పోషకాలు తీవ్రమైన దగ్గు నుంచి ఉపశమనం ఇస్తాయి. ముక్కులో, శ్వాసనాళంలో పేరుకుపోయిన శ్లేష్మం, దుమ్మూ, ధూళిని బయటకు పంపిస్తాయి. దీనివల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులుండవు. చలికాలంలో తరచూ వేధించే జలుబు కూడా పోతుంది.

దృఢమైన ఎముకలు: సపోటలోని మినరల్స్, క్యాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్ వంటివి ఎముకలను పటిష్ఠం చేస్తాయి. దీనిలోని కాపర్ ఎముకల కణజాల ఉత్పత్తిని పెంచి, ఆస్టియోపోరోసిస్, కండరాల బలహీనత, ఎముకలు విరిగిపోవడం, కీళ్లు బలహీనంగా మారడం వంటి సమస్యల నుంచి కాపాడుతుంది. చలికాలం కీళ్లనొప్పులతో బాధపడేవారు సపోటాలను తింటే ఉపశమనం లభిస్తుంది.

యాంటీ ఆక్సిడెంట్: సపోటాలో ఎ, ఇ, సి విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంతో పాటు తేమను అందిస్తాయి.

కేశాలకు బలం: ఈ పళ్లలోని పాలిఫినాల్స్, ఫ్లావనాయిడ్స్ వంటివి చర్మం ముడతలు పడకుండా చూస్తాయి. సపోట గింజల నూనె కేశాలకు తేమను అందిస్తుంది, వెంట్రుకల్ని సుతిమెత్తగా చేస్తుంది. అంతేగాక జుట్టు రాలడాన్ని నివారిస్తుంది.

బ్యూటీ

చలికాలం చర్మం పదిలం!

చలికాలంలో చర్మ సంబంధమైన సమస్యలు బాగా వేధిస్తాయి. ముఖ్యంగా పాదాలు, పెదవులు, అరికాళ్లు చలికాలంలో పగులుతుంటాయి. ఈ సీజన్‌లో చర్మం మృదువుగా ఉండేందుకు కొన్ని టిప్స్ ఉన్నాయి. అవేమిటంటే...



- చలికాలం పగిలిన పెదాలపై నెయ్యి లేదా వెన్న రాసుకుంటే మంచిది. ఇవి పెదాలకు కావాల్సిన తేమను అందిస్తాయి. పైగా పెదవులు మెరుస్తూ ఎంతో మృదువుగా తయారవుతాయి.
- చలికి పాదాల అంచులు పగులుతుంటాయి. పెళుసుగా మారి బాధిస్తాయి. ఈ పగుళ్లపై నెయ్యి రాస్తే చర్మం మృదువుగా తయారవుతుంది.
- యాక్నే నివారణకు పసుపు ఎంతో శక్తివంతంగా పనిచేస్తుంది. పసుపులో కొద్దిగా నిమ్మరసం కలిపి చర్మంపై రాసుకుంటే చర్మంపై పేరుకున్న మురికి పోతుంది. అలాగే ముఖంపై అవాంఛనీయ రోమాలు పెరగకుండా ఉండేందుకు స్నానానికి ముందు చర్మానికి పసుపు రాసుకోవాలి. ఇలా నిత్యం చేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది.
- మజ్జిగ, చెరకురసం కలిపిన పసుపు పేస్టును కళ్లకింద రాసుకుంటే నల్లటి వలయాలు పోతాయి. కళ్ల కింద ఉన్న చర్మం ముడతలు పడదు కూడా.
- శీతాకాలంలో ముఖ్యంగా పొడి చర్మం ఉన్న వారికి కావలసినంత మాయిశ్చరైజింగ్‌ని తేనె అందిస్తుంది. దీన్ని నిత్యం రాసుకోవడం వల్ల చర్మం మృదువుగా, పట్టులా తయారయి బాగా మెరుస్తుంది. ఇందులో యాంటీ-ఏజింగ్ సుగుణాలు కూడా బాగా ఉన్నాయి.
- వేడి నీళ్లల్లో రెండు టేబుల్‌స్పూన్ల కొబ్బరినూనె పోసి స్నానం చేస్తే చలికాలంలో చర్మంపై తలెత్తే దురద, పొడిబారడం వంటి సమస్యలు తగ్గి చర్మానికి కావలసినంత తేమ అందుతుంది. ఇలా నిత్యం చేస్తే మంచి ఫలితాలుంటాయి.

డిజిటల్ షో






స్వేచ్ఛ నిజమేనా?



షరతులు వర్తిస్తాయి!



డైలీ సుడోకు - 430

సుడోకు - 429 సమాధానం



ఆ పుస్తకమే ఆధారం

భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ దగ్గర 'యు.పి.ఏ-1' పాలనా కాలంలో 2004 నుంచి 2008 దాకా మీడియా సలహాదారుగా పనిచేశారు... ప్రసిద్ధ జర్నలిస్టు, రచయిత సంజయ్ బారూ. ఆ పదవీ కాలంలోని ఆయన జ్ఞాపకాల రచన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'. మన్మోహన్ సింగ్‌తో కలసి ప్రధాన మంత్రి కార్యాలయం (పి.ఎం.ఓ)లో సాగించిన ప్రయాణంలో తాను చూసిన మనుషులు, ఎదురైన మనస్తత్వాలు, జరిగిన సంగతులు, కలిగిన తీపి-చేదు అనుభవాలను గుదిగుచ్చుతూ సంజయ్ రాసిన ఆ పుస్తకం అయిదేళ్ళ క్రితం 2014 ఎన్నికల ముందు విడుదలైంది. గాంధీ కుటుంబం చేతిలో మన్మోహన్ ఓ కీలు బొమ్మ అని ప్రచారం చేయడానికి అప్పట్లో బి.జె.పి. ఈ పుస్తకాన్ని ఓ ఆయుధంగా చేసుకొంది. జీవితంలో రెండు, మూడు పుస్తకాలు కూడా చదవని సునీల్ బోహ్రా ('గ్యాంగ్స్ ఆఫ్ వాసేపూర్' చిత్ర సహనిర్మాత) ఓ విమానాశ్రయంలో ఈ పుస్తకం ముఖచిత్రం చూసి, కొని చదివారు. ఇదో మంచి సినిమా స్క్రిప్టుగా పనికొస్తుందని భావించారు. అందుకే, ఆ పుస్తకం హక్కులు కొనుక్కొని మరీ ఈ సినిమా నిర్మించారు. యువకుడైన విజయ్ రత్నాకర్ గుట్టే ఈ చిత్రంతో దర్శకుడయ్యారు. బి.జె.పికీ, నరేంద్ర మోదీకి బాహాటంగా భక్తుడైన అనుపమ్ ఖేర్ తెరపై మన్మోహన్ సింగ్‌గా, అక్షయ్ ఖన్నా ఏమో సంజయ్ బారూగా, జర్మనీలో పుట్టిన నటి సుజానే బెర్నెర్ట్ అచ్చం సోనియా గాంధీగా, ఆహనా కుమ్రా ఏమో ప్రియాంకగా ప్రాణప్రతిష్ఠ చేశారు. హిందీతో పాటు ఇంగ్లీషు, తెలుగు, తమిళ భాషల్లో రిలీజైన ఈ చిత్ర ఇతివృత్తం, చిత్రీకరణ విధానం కొద్దిరోజులుగా తీవ్ర వివాదాస్పదమయ్యాయి.

నిజజీవిత చరిత్రను జరిగింది జరిగినట్లు చూపించడం ఎంత కష్టం?
జనరంజక సినీ సృజన కోసం నాటకీకరిస్తే... ఎంత నష్టం?
బయోపిక్‌ల సీజన్‌లో సినిమాటిక్ లిబర్టీ తీసుకోకపోవడం సాధ్యమేనా?
తెరపై చూస్తున్న చరిత్రలో నిజమెంత? నాటకమెంత?
అన్నీ అలా జరిగాయా? లేక అలా తెరపై తీశారా? చరిత్రకారులకు ఆసక్తిగా ఉంటుందనే ఉద్దేశంతో... అపూర్వ బయోపిక్స్ ప్రయత్నాలు 'యన్.టి.ఆర్ కథానాయకుడు', 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'లపై చరిత్ర కోణంలో ఓ చిన్న లుక్...

• డాక్టర్ రెంటాల జయదేవ

సమష్టి యజ్ఞం

ఎన్టీఆర్‌పై వచ్చిన రచనలు, పెద్దల నుంచి సేకరించిన జ్ఞాపకాలు 'యన్.టి.ఆర్' బయోపిక్‌కు ముడిసరుకులు. సుదీర్ఘజీవితాన్ని రెండున్నర గంటల్లో కుదించలేక, రెండు భాగాలుగా అందిస్తోంది యన్.టి.ఆర్. చిత్ర బృందం. ఎన్టీఆర్ వేసిన పౌరాణిక గెటప్పులకు బాలకృష్ణ చేసిన పునఃసృష్టి, ఈనాటి తన తగిన వయసుతో పెద్ద వయసు ఎన్టీఆర్‌గా చేసిన పరకాయ ప్రవేశం ఈ బయోపిక్‌కు క్రేజును పెంచిన హైలైట్స్. విద్యాబాలన్ సహా పలువురు పాత్రధారుల అభినయ వైదుష్యానికి తోడు సాయిమాధవ్ ప్రాణం పెట్టి రాసిన డైలాగ్స్, దర్శకుడు క్రిష్, ఛాయాగ్రాహకుడు జ్ఞానశేఖర్ల పనితనం, కీరవాణి నేపథ్య సంగీతం పెట్టనికోటలు. ఉత్కంఠభరితమైన ఫెయిల్యూర్ స్టోరీని కాక సాఫీగా సాగే సక్సెస్ స్టోరీని చెప్పడం ఎప్పుడూ కష్టమే. ఎన్టీఆర్ బయోపిక్ ఫస్ట్‌పార్టులో ఫస్టాఫ్ అంతా జనం విన్నవీ, చెప్పుకున్నవీ ఎక్కువ. ఆ దృశ్యాలన్నీ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. సెకండాఫ్ అంతా సామాజిక దృక్కోణం, జనం కోసం మనం ఏం చేయాలి? లాంటి ఎన్టీఆర్ అంతర్మథనం సీన్లు వస్తాయి. పదికాలాలు గుర్తుండిపోతాయి. అయితే, అటు ఇంటర్వెల్ కానీ, ఇటు క్లైమాక్స్ కానీ హడావిడిగా వచ్చి, అప్పుడే అయిపోయిందా అనిపిస్తాయి. నాటకీకరించే ప్రయత్నంలో వెండితెర ఉలుల మధ్య చిక్కుకుపోయి, చరిత్ర కొంత చెక్కుకుపోయింది. తప్పొప్పులు చేసి, అసామాన్యుడిగా ఎదిగిన సామాన్యుడి కథను ఆద్యంతం అనితర సాధ్యుడిగా చిత్రించడం దానికి తోడైంది.

ఇలా జరిగిందా? తీశారా?

యదు. ఆ సంగతి ఈ సినిమాకు ఆధారమైన పుస్తకం ముందుమాటలో బారూ స్పష్టంగా పేర్కొన్నారు కూడా! అయినా సరే, సినిమాలో ఆ సంఘటన మొత్తాన్నీ పూర్తిగా నాటకీయంగా చిత్రీకరించారు. మన్మోహన్ అనుమతితోనే బారూ తన అనుభవాలను అక్షరబద్ధం చేశారను భావన ...









పండిన మరో ఘట్టం... ఎమర్జెన్సీ టైములో 'అన్నదమ్ముల అనుబంధం' ప్రింట్లను ఎన్టీఆర్ పంపే సన్నివేశం! వాస్తవానికి 'అన్నదమ్ముల అనుబంధం' రిలీజు, ప్రింట్లు పంపే వ్యవహారానికీ, దేశంలో అప్పట్లో విధించిన ఎమర్జెన్సీకి సంబంధమే లేదు. ఇందిరా గాంధీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీని విధించింది ...













నేర ప్రపంచం నేపథ్యంలో...


మహేశ్‌బాబు

మహేశ్‌బాబు కోసం 'అర్జున్‌రెడ్డి' దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా నేర ప్రపంచం నేపథ్యంలో ఓ కథ సిద్ధం చేశారట! కొంతకాలంగా మహేశ్, సందీప్ మధ్య చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. 'అర్జున్‌రెడ్డి' విడుదలైన తర్వాత దర్శకుణ్ణి తన ఇంటికి పిలిచిన మహేశ్ ప్రత్యేకంగా అభినందించారు. తర్వాత వీరిద్దరూ కలిసి ఓ సినిమా చేయాలనుకున్నారు. తాజా సమాచారం ఏంటంటే... వీరిద్దరూ కలిసి చేయబోయే సినిమా కథ కూడా సిద్ధమైంది. సందీప్‌రెడ్డి వంగా చెప్పిన క్రైమ్ డ్రామాకు మహేశ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని విశ్వసనీయ వర్గాల భోగట్టా. అందులో ఆయన పాత్ర, పాత్ర చిత్రణ నవ్యరీతిలో ఉంటాయట! ప్రస్తుతం వంశీ పైడిపల్లి దర్శకత్వంలో 'మహర్షి' చేస్తున్నారు మహేశ్. ఈ సినిమా తర్వాత సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించే సినిమా చేస్తారు. ఆ తర్వాత సందీప్‌రెడ్డి సినిమా ఉంటుంది.

తమ్ముడు అఖిల్‌లో ఆ దమ్ముంది!

- ఎన్టీఆర్


అఖిల్, నాగార్జున, ఎన్టీఆర్, నాగచైతన్య

"నేను ఆయన్ని (నాగార్జున) 'బాబాయ్' అంటాను. ఆయన నన్ను 'అబ్బాయ్' అంటారు. నేను ఇక్కడికి ఓ అతిథిగా కాకుండా కుటుంబ సభ్యుడిలా వచ్చాను. ఓ నటుడికి ఆత్మవిమర్శ చాలా ముఖ్యం. ఆత్మవిమర్శ చేసుకోవాలంటే దమ్ముండాలి. నా తమ్ముడు అఖిల్‌లో ఆ గొప్ప లక్షణముంది. తన కంటే ఎవరూ గొప్పగా ఆత్మవిమర్శ చేసుకోలేరు. ఆత్మవిమర్శతో తనని తాను మార్చుకుంటూ, తన పంథాని మార్చుకుంటూ ఈ మజిలీకి చేరాడు. రాసి పెట్టుకోండి... అఖిల్ ఏదో ఒక రోజు అత్యుత్తమ నటుడు అవుతాడు. ఆ రోజు ఎంతో దూరంలో లేదు. దగ్గరలోనే ఉంది. 'మిస్టర్ మజ్ను'తో మన ముందుకు వస్తుంది" అని చిన్న ఎన్టీఆర్ అన్నారు. అఖిల్ అక్కినేని హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన సినిమా 'మిస్టర్ మజ్ను'. నిధీ అగర్వాల్ హీరోయిన్. ఎస్.ఎస్. తమన్ స్వరకర్త. ఈ నెల 25న విడుదల కానున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ఎన్టీఆర్ మాట్లాడుతూ "సంపాదించిన ప్రతి రూపాయిని మళ్లీ చిత్రసీమకు అందించే గొప్ప నిర్మాత ప్రసాద్‌గారు. నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో నాకున్న తక్కువ మంది స్నేహితుల్లో వెంకీ అట్లూరి ఒకడు. తను నాకొక నటుడిగా పరిచయం. తర్వాత రచయితగా, దర్శకుడిగా పరిచయమయ్యాడు. 'తొలిప్రేమ' చూశాక తన గురించి గర్వంగా ఫీలయ్యా. కమర్షియల్ సినిమాల కంటే కథాబలంతో, నటీనటుల బలంతో సినిమా తీయడం చాలా కష్టం. ఈ విధంగా నాకు కావలసిన వాళ్లు చాలామంది చేసిన ఈ సినిమా తప్పకుండా విజయం సాధించాలని కోరుకుంటున్నా" అన్నారు. అక్కినేని నాగార్జున మాట్లాడుతూ "మా పెద్దబ్బాయి తారక్ (ఎన్టీఆర్). తను ఆప్యాయంగా 'బాబాయ్.. బాబాయ్' అని పిలుస్తుంటే చాలా సంతోషంగా ఉంటుంది. తారక్ దగ్గర్నుంచి అఖిల్ నేర్చుకోవలసింది యాక్టింగ్ అండ్ మాస్. ఈ 'మజ్ను' టైటిల్ నాన్నగారిది. తర్వాత నా దగ్గరకు వచ్చింది. ఆ రెండు సినిమాలు ఎంత పెద్ద హిట్టయ్యాయో... ఈ సినిమా అంత హిట్టవ్వాలని కోరుకుంటున్నా. ఏడిపించడం, నవ్వించడం, ప్రేమించడం... ప్రేమకథకు కావాలని వెంకీకి బాగా తెలుసు" అన్నారు. నాగచైతన్య మాట్లాడుతూ "అఖిల్‌ని ఎప్పటినుంచో పూర్తిస్థాయి ప్రేమకథలో చూడాలనుంది. ఈ సినిమాతో అది నెరవేరబోతోంది. తను ఫైట్స్, డ్యాన్స్ బాగా చేస్తాడని మనందరికీ తెలుసు. కానీ, ఎందుకో తన బాడీ లాంగ్వేజ్‌కి ప్రేమకథలు బాగా సూటవుతాయని అనిపించేది" అన్నారు. అఖిల్ మాట్లాడుతూ "నా ప్రతి చిత్రానికీ నాన్నగారు ఇచ్చే మద్దతు, సలహాలు, తీసుకునే నిర్ణయాలు ఎంతో హెల్ప్ అవుతున్నాయి. ప్రతి నిమిషం ఆయన మాకోసం కష్టపడ్డారు. నాకు వెంకీ పదేళ్లుగా తెలుసు. ముందుగా తను నా ఫ్రెండ్. మూడేళ్ల కిత్రం ఈ కథ చెప్పాడు. 'నా మూడో సినిమాకు ఈ కథ కరెక్ట్ అనిపిస్తుంది. వెయిట్ చేస్తావా?' అని అడిగా. నిజంగా వెయిట్ చేశాడు. నిజంగా గుండెల్లో నాగార్జునను నింపుకున్న అభిమాని అతను. మా తాతగారితో సినిమా నిర్మించిన బీవీఎస్ఎన్ ప్రసాద్‌గారు నాతో సినిమా నిర్మించడం గర్వంగా ఉంది. రెడ్డి అనే అక్కినేని అభిమాని మరో ఇద్దరితో కలిసి విజయవాడ నుంచి తిరుపతి వరకూ 450 కిలోమీటర్లు నడిచారని తెలిసింది. అప్పుడు నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అభిమానులు ఇలాంటి పనులు చేయవద్దని కోరుతున్నా" అన్నారు. వెంకీ అట్లూరి మాట్లాడుతూ "నేను అక్కినేని అభిమానిని. తొలిసారి థియేటర్‌లో నేను చూసిన సినిమా 'శివ'. తర్వాత రోజుల్లో 'ప్రేమ్ నగర్' చూసినప్పుడు అటువంటి క్యారెక్టరైజేషన్‌తో ఒక సినిమా చేయాలని మనసులో బలమైన కోరిక ఉండేది. అందుకునే, ఆ సినిమాలో 'ఎక్స్‌క్యూజ్‌మి మిస్' డైలాగ్ తీసుకుని మా సినిమాలో హీరోకి పెట్టాను. 'తొలిప్రేమ'కు పని చేసిన సేమ్ టీమ్ ఈ సినిమాకూ కష్టపడి పని చేశాం" అన్నారు. తమన్ మాట్లాడుతూ "వెంకీ అట్లూరి నన్ను చాలా నమ్మాడు. ఆ నమ్మకమే నాకు భయం తెప్పించి మంచి పాటలు ఇచ్చేలా చేసింది. శ్రీమణి అన్ని పాటలకూ అద్భుతమైన సాహిత్యాన్నిచ్చాడు" అన్నారు.

పదేళ్ల తర్వాత హైదరాబాద్‌లో మళ్లీ...

- కె.జె. ఏసుదాసు



శ్రీనాథ్, కె.జె. ఏసుదాసు

దాదాపు పదేళ్ల తర్వాత హైదరాబాద్‌లో లైవ్ మ్యూజిక్ చేస్తున్నట్లు ప్రముఖ నేపథ్య గాయకుడు కె.జె. ఏసుదాసు చెప్పారు. 'మధ్యలో కొన్ని క్లాసికల్ కాన్సర్ట్స్ చేసినప్పటికీ లైవ్ మ్యూజిక్ మాత్రం చేయలేదు. నా బ్రదర్ , 'అలేఖ్య హోమ్స్' శ్రీనాథ్ లైవ్ మ్యూజిక్ చెయ్యమని చెప్పారు. ఆయన మాట పాటించే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉంది' అన్నారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ఏసుదాసు సంగీత విభావరి జరుగనుంది. ఇందులో ఆయనతో పాటు విజయ్ ఏసుదాసు, కల్పన కూడా పాల్గొంటారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసుదాసు మాట్లాడారు. 'ఈ సంగీత విభావరిలో ప్రధానంగా తెలుగు పాటలు పాడతాం. అలాగే కొన్ని తమిళ, హిందీ, మలయాళ పాటలు ఉంటాయి' అని ఆయన చెప్పారు. 'నేను ప్రతిరోజూ కర్నాటక సంగీతం నేర్చుకుంటూనే ఉంటాను. అంతకుముందు చేసిన పొరపాట్లను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటాను. ముందు రోజు చేసిన తప్పుల్ని తెలుసుకొని వాటిని సరిదిద్దుకోగలిగితే ఎంతైనా సాధించవచ్చు. ఇది సంగీతానికే కాదు ఏ రంగానికైనా వర్తిస్తుంది' అని ఏసుదాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్ ఏసుదాసు, శ్రీనాథ్ కూడా పాల్గొన్నారు.

'అర్జున్‌రెడ్డి' ప్రేయసి!


కియారా అడ్వాణీ

ఫొటోలో అమ్మాయిని చూశారా? పేరు ప్రీతి. 'అర్జున్‌రెడ్డి' ప్రేయసి! చిన్న ట్విస్ట్ ఏంటంటే... ఈ అమ్మాయి హిందీ 'అర్జున్‌రెడ్డి' ప్రేయసి! అదేంటి? ఈ అమ్మాయి కియారా అడ్వాణీ అనుకుంటున్నారా? నిజమే... కియారానే! 'అర్జున్‌రెడ్డి' హిందీ రీమేక్ 'కబీర్ సింగ్'లో ఆమె లుక్ ఇది! తెలుగులో విజయ్ దేవరకొండ, షాలినీ పాండే జంటగా నటిస్తే... హిందీలో షాహిద్ కపూర్, కియారా అడ్వాణీ జంటగా నటిస్తున్నారు. ప్రీతిగా కియారా డీ-గ్లామర్ అవతార్‌లో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఢిల్లీలో జరుగుతోంది. సోమవారంతో ఢిల్లీ షెడ్యూల్ పూర్తిచేసి, ఆ తర్వాత డెహ్రాడూన్, ముస్సోరిలో రొమాంటిక్ పాటను చిత్రీకరించనున్నారు. తెలుగు చిత్రానికి దర్శకత్వం వహించిన సందీప్‌రెడ్డి వంగా, హిందీ చిత్రానికీ దర్శకత్వం వహిస్తున్నారు.

నేనెప్పుడూ పదవుల్ని ఆశించలేదు!

- వీకే నరేశ్



"నటులకు జయాపజయాలు సహజమే. ఎవరి నట ప్రయాణమైనా పలు మలుపులు తిరుగుతుంది. ఐదారేళ్ల క్రితం మంచి విజయం వస్తే బావుంటుందని నేను కోరుకున్న రోజులున్నాయి. నాలుగైదేళ్లుగా... ఎస్వీ రంగారావుగారి స్ఫూర్తితో మంచి చిత్రాలకు, పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చి చేసుకుంటూ వస్తున్నా. 'దృశ్యం' నుంచి నా సక్సెస్ రేట్ పెరుగుతూ వస్తోంది. గతేడాది మరింత పెరిగింది. సుమారు పది భారీ విజయాలొస్తే... ఎనిమిది విజయవంతమైన చిత్రాల్లో నేను మంచి పాత్రలు చేయడం నా అదృష్టం" అని నటుడు వీకే నరేశ్ అన్నారు. ఆదివారం ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించిన నరేశ్ క్యారెక్టర్ ఆర్టిస్టుగా తను లభిస్తున్న పాత్రల పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇంకా మాట్లాడుతూ "ఎటువంటి పాత్రలోనైనా నరేశ్ నటించగలడని దర్శక, రచయితలు నమ్మి నాకోసం ప్రత్యేకంగా పాత్రలు రాస్తుండటం సంతోషంగా ఉంది. గత ఏడాది 'రంగస్థలం', 'అరవింద సమేత వీరరాఘవ', 'మహానటి', 'ఛలో', 'శతమానం భవతి', 'తొలిప్రేమ', 'సమ్మోహనం' చిత్రాల్లో మంచి పాత్రలు పడ్డాయి. ఇలాగే వైవిధ్యమైన చిత్రాల్లో నటించాలని, మూస ధోరణి పాత్రలకు దూరంగా ఉండాలని ప్రయత్నిస్తున్నా. పారితోషికం ఎంతనేది పట్టించుకోకుండా.. మంచి పాత్రలు వస్తే లో బడ్జెట్‌లో రూపొందే చిత్రాలకు అందుబాటులో ఉండాలనుకుంటున్నా. వెబ్ సిరీస్‌లో నటించమని చాలామంది అడుగుతున్నారు. ఈ ఏడాది ఓ వెబ్ సిరీస్ చేస్తా. ఓ సినిమాలో విలన్‌గా చేస్తున్నా" అన్నారు. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా)లో వివాదం గురించి నరేశ్ మాట్లాడుతూ "నేనెప్పుడూ పదవుల్ని ఆశించలేదు. 'మా' ప్రధాన కార్యదర్శిగా సంక్షేమ పథకాలు అమలు జరిగేలా, నా బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నా. మా కుటుంబం తరపున రూ. 30 లక్షల వరకూ విరాళాన్ని అందించాం. అయితే.. ఈ ఏడాది 'మా'లో కొన్ని వివాదాలు చోటు చేసుకున్నారు. ఇకపై వివాదాలకు తావు లేకుండా 'మా' సంక్షేమం కోసం వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి నేను సిద్ధమే" అన్నారు.

తెలుగులో తొలిసారి


అశ్వని, ధ్రువ

ధ్రువ, అశ్వని జంటగా జైరామ్ వర్మ దర్శకత్వంలో విశ్వనాథ్ తన్నీరు నిర్మించిన 'యమ్ 6' చిత్రం సెన్సార్ పూర్తయింది. ఫిబ్రవరి మొదటి వారంలో సినిమాను విడుదల చేయనున్నట్లు నిర్మాత తెలిపారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా నిర్మించినట్లు ఆయన చెప్పారు. 'ప్రేక్షకులకు థ్రిల్ కలిగించే ఓ పాయింట్‌తో సినిమాను మా దర్శకుడు చక్కగా రూపొందించారు' అని విశ్వనాథ్ చెప్పారు. 'గతంలో ఇలాంటి చిత్రాలు తమిళ, మలయాళ, కన్నడం రంగాల్లో వచ్చేవి. తెలుగు ప్రేక్షకులు కూడా వాటిని ఆదరించేవారు. అందుకే ఒకరకమైన ప్రయోగంగా భావించి ఈ సినిమా తీశాం. చూసిన ప్రతి ఒక్కరూ థ్రిల్ ఫీలవుతారు. కామెడీని కూడా బాగా ఎంజాయ్ చేస్తారు' అని దర్శకుడు జైరామ్ వర్మ చెప్పారు.

కూచిపూడి వారి వీధి


శ్రీకాంత్ అడ్డాల

సినిమాలకు అచ్చ తెలుగు పేర్లను టైటిల్స్‌గా పెట్టే దర్శకుల్లో శ్రీకాంత్ అడ్డాల ఒకరు. దర్శకుడిగా తొలి సినిమా 'కొత్త బంగారు లోకం' నుంచి 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు', 'ముకుంద', 'బ్రహ్మోత్సవం' వరకూ తన ప్రతి సినిమాకూ అచ్చ తెలుగు టైటిల్ పెట్టారు. త్వరలో తెరకెక్కించబోయే చిత్రానికి 'కూచిపూడి వారి వీధి' అనే టైటిల్ ఖరారు చేసినట్టు శ్రీకాంత్ అడ్డాల వెల్లడించారు. ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ నిర్మించనుందని సమాచారం.

కేసీఆర్‌కు జగన్ లేఖ

▸▸ అంతర్ రాష్ట్ర బదిలీలపై స్పందించాలని వినతి

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఏపీ విపక్ష నేత, వైసీపీ అధ్యక్షుడు జగన్ శనివారం లేఖ రాశారు. అంతర్ రాష్ట్ర ఉద్యోగుల బదిలీలను సత్వరమే పూర్తి చేయాలని కోరారు. ఈ విషయంలో మానవతా దృక్పథంతో స్పందించాలని విన్నవించారు. "పరస్పర బదిలీలపై కమిటీ ఉత్తర్వులు విడుదల చేయాలి. ఆ వెంటనే ఉద్యోగుల బదిలీలు చేపట్టాలి" అని కేసీఆర్‌ను జగన్ కోరారు. ఫెడరల్ ఫ్రంట్ చర్చల్లో భాగంగా జగన్‌ను టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల కలిసిన సంగతి తెలిసిందే. ఆ వెంటనే ఉద్యోగుల బదిలీలపై కేసీఆర్‌కు జగన్ లేఖ రాయడం విశేషం. అలాగే... పోలవరం ప్రాజెక్టుకు సహకరించాలని, ఏపీకి విద్యుత్తు బకాయిలు చెల్లించాలని, ఉమ్మడి సంస్థల ఆస్తుల విభజన చేపట్టాలని కూడా కేసీఆర్‌ను జగన్ కోరతారా అని టీడీపీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

ఏపీఎన్‌జీఓ హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ల ఎన్నిక

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ హౌసింగ్ (ఏపీఎన్‌జీఓ) సొసైటీకి శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఎం.సత్యనారాయణగౌడ్ ప్యానెల్ ఈ ఎన్నికల్లో విజయం సాధించింది. ఎం.సత్యనారాయణగౌడ్, పి.బలరాం, ఎస్.ప్రభాకర్‌రెడ్డి, ఎ.శ్రీనివాస్, డి.పద్మారెడ్డి, జె.అమర్‌జ్యోతి, అబ్దుల్ సాదిక్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, డి.శ్రీధర్‌రెడ్డి, కేశియా, వెంకటపతి, ఎం.శ్రీనివాసరావు, జి.మల్లారెడ్డి, రషీదా బేగం డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు.

ఫిబ్రవరిలో టీడీపీలోకి ఆదిశేషగిరిరావు

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు ఘట్టమనేని కృష్ణ సోదరుడు ఆదిశేషగిరిరావు తెలుగుదేశం పార్టీలో చేరడం ఖరారైంది. ఫిబ్రవరి 7, 8తేదీల్లో ఆయన ఆ పార్టీలో చేరనున్నారని సమాచారం. వైసీపీలో క్రియాశీల సభ్యుడిగా ఉన్న ఆయన ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు. కృష్ణ అభిమాన సంఘాలతో సన్నిహిత సంబంధాలున్న ఆయన వారితో సంప్రదించిన తర్వాత టీడీపీలో చేరాలని నిర్ణయం తీసుకొన్నారు.

ఐదుగురికి 100 పర్సంటైల్!

▸▸ జేఈఈ మెయిన్‌లో మెరిసిన తెలుగు విద్యార్థులు

▸▸ ఏపీ నుంచి ఒకరికి.. దేశవ్యాప్తంగా 15 మందికి..

▸▸ ఏప్రిల్ పరీక్ష తర్వాత ర్యాంకుల ప్రకటన



సాయికిరణ్ | జయంత్ ఫణిసాయి | కార్తికేయ | విశ్వనాథ్ | చేతన్‌రెడ్డి

హైదరాబాద్/న్యూఢిల్లీ/అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్ తొలిదశ పరీక్షలో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) శనివారం విడుదల చేసిన ఫలితాల్లో దేశవ్యాప్తంగా 15మంది 100 పర్సంటైల్ సాధించారు. వారిలో ఐదుగురు తెలుగు రాష్ట్రాల విద్యార్థులే కావడం విశేషం. వీరిలో నలుగురు తెలంగాణ విద్యార్థులు కాగా, ఒకరు ఏపీ విద్యార్థి ఉన్నారు. తెలంగాణ విద్యార్థులు అదెల్లి సాయికిరణ్, ఇందుకూరి జయంత్ ఫణిసాయి, బట్టెపాటి కార్తికేయ, కె.విశ్వనాథ్; ఏపీకి చెందిన బొజ్జా చేతన్‌రెడ్డి 100 పర్సంటైల్ సాధించారు. ఈనెల 9నుంచి 12వరకు నిర్వహించిన పేపర్-1 పరీక్షకు దేశవ్యాప్తంగా 9,29,198మంది దరఖాస్తు చేసుకోగా 8,74,469 మంది పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షను మొత్తం 360మార్కులకు నిర్వహించగా 100 పర్సంటైల్ వచ్చిన విద్యార్థులు సగటున 346మార్కులు సాధించారు. 100 పర్సంటైల్ సాధించిన వారిలో తెలంగాణ విద్యార్థులు వరసగా 3, 7, 8, 12 స్థానాల్లో నిలిచారు. ఏపీ విద్యార్థి నాలుగో స్థానంలో నిలిచాడు. ఇక 100 పర్సంటైల్ సాధించిన వారిలో మహారాష్ట్ర నుంచి ముగ్గురు; యూపీ, రాజస్థాన్ నుంచి ఇద్దరు చొప్పున; మధ్యప్రదేశ్, పంజాబ్, కర్ణాటక నుంచి ఒకరు చొప్పున ఉన్నారు. తెలుగు రాష్ట్రాల విద్యార్థుల్లో సుమారు 30వేల మంది 90 పర్సంటైల్‌కి పైగా సాధించినట్లు అంచనా. సుమారు 700 నుంచి 1000 మంది 99 పర్సంటైల్ సాధించినట్లు అంచనా వేస్తున్నారు. రెండో పరీక్షలోనూ ఇదే పర్సంటైల్ సాధిస్తే తుది ర్యాంకుల్లో అగ్రస్థానంలో నిలిచే అవకాశం ఉంటుంది.

ఏప్రిల్‌లో ర్యాంకులు..

జేఈఈ మెయిన్ తొలిదశ ఫలితాలను ఎన్టీఏ పర్సంటైల్ రూపంలో విడుదల చేసింది. సీట్ల కేటాయింపునకు ప్రామాణికమైన ర్యాంకులను ఏప్రిల్‌లో విడుదల చేయనుంది. రెండోదశ పరీక్షను ఏప్రిల్ 6-20 మధ్యలో నిర్వహించాలని నిర్ణయించింది. విద్యార్థులు ఎక్కువ పర్సంటైల్ సాధించిన పరీక్ష ఆధారంగా ఏప్రిల్ 30న ర్యాంకులను ప్రకటిస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించాలంటే మెయిన్‌లో మంచి మార్కులు తెచ్చుకోవాల్సిందే. ఈ నేపథ్యంలో విద్యార్థుల మధ్య తీవ్రమైన పోటీ ఉంటుంది. రెండు పరీక్షల్లోనూ 99.99 పర్సంటైల్ సాధిస్తే ఆ విద్యార్థికి 100లోపు ర్యాంకు దక్కే అవకాశం ఉంటుందని ఐఐటీ నిపుణుడు ఉమాశంకర్ తెలిపారు. 99.95పర్సంటైల్ సాధించినవారు వెయ్యిలోపు ర్యాంకులు దక్కించుకునే అవకాశం ఉంటుందన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించాలంటే జనరల్ విద్యార్థులు మొదటిదశ పరీక్షలో 75పర్సంటైల్ పైగా సాధించాలి. ఓబీసీ విద్యార్థులు 70కి పైగా, ఎస్సీ విద్యార్థులు 60కి పైగా, ఎస్టీ విద్యార్థులు 55 పర్సంటైల్‌కు పైగా సాధించాలి. రెండు పరీక్షల్లో పర్సంటైల్‌లో భారీతేడా ఉంటే ర్యాంకులు తారుమారవుతాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్ ట్విటర్ ద్వారా అభినందనలు తెలిపారు.

రోజుకు 13 గంటలు చదువే!

'జేఈఈ మెయిన్స్ ప్రథమస్థానం రావడం సంతోషంగా ఉంది. రోజూ 5-13గంటలు చదువుతా. నేనీస్థాయిలో ఉండటానికి అధ్యాపకులే కారణం. 5 నుంచి ఇంటర్ వరకు విజయవాడ శ్రీచైతన్య విద్యాసంస్థల్లో చదివా. 2017లో నా సోదరి కూడా ఇదే విద్యాసంస్థల్లో చదివి మెడిసిన్‌లో ఆలిండియా టాపర్‌గా నిలిచింది. మా తండ్రి బొజ్జా రమేశ్‌రెడ్డి మైలవరం లక్కిరెడ్డి బాలిరెడ్డి కళాశాలలో ఈసీఈ ప్రొఫెసర్. - చేతన్‌రెడ్డి

27 శాతం తగ్గిన సౌత్ ఇండియన్ బ్యాంక్ లాభం

న్యూఢిల్లీ: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో ప్రైవేటు రంగంలోని సౌత్ ఇండియన్ బ్యాంక్ నికర లాభం 27 శాతం తగ్గి రూ.83.85 కోట్లకు చేరుకుంది. అంతకు ముందు ఏడాది ఇదే త్రైమాసికంలో నికర లాభం రూ.115 కోట్లుగా ఉంది. సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం రూ.1,735.77 కోట్ల నుంచి రూ.1,921.93 కోట్లకు చేరుకుంది. స్థూల ఎన్‌పీఏలు 3.40 శాతం నుంచి 4.88 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు కూడా 2.35 శాతం నుంచి 3.54 శాతానికి ఎగబాకాయి.

ప్రభుత్వ బ్యాంకులకు మంచి రోజులు!



షేర్లపై మళ్లీ మదుపర్ల దృష్టి .. భారీగా నిధులు

మొండి బకాయిల వసూలుకు ప్రత్యేక చర్యలు

హైదరాబాద్, ఆంధ్రజ్యోతి బిజినెస్

ఎస్సార్ స్టీల్‌కు ఇచ్చిన రుణాలను రాబట్టుకునేందుకు ఆ కంపెనీకి ఇచ్చిన రూ.15,000 కోట్లకు పైగా రుణాలను అసెట్ రీకనస్ట్రక్షన్ కంపెనీలు (ఏఆర్‌సీ), ఎన్‌బీఎఫ్‌సీలు, విదేశీ మదుపర్లకు విక్రయించడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లను ఆహ్వానించింది. రూ.15,432 కోట్ల మొండి బకాయిలను కనీసం రూ.9,588 కోట్లకు విక్రయించడానికి ముందుకు వచ్చింది.

సిండికేట్ బ్యాంకు మొండి బకాయిల (ఎన్‌పీఏ)ను వసూలు చేయడానికి 1,500 మంది ఉద్యోగులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఎన్‌పీఏల రికవరీకి ప్రత్యేక శాఖలను కూడా నిర్వహిస్తోంది. ఈ శాఖల్లో పని చేసే వారు నేరుగా మొండి బకాయిల వసూలుపై ప్రధాన కార్యాలయంతోనే సంప్రదించి నిర్ణయాలు తీసుకునే వీలు కల్పించింది.

ఇలా ప్రభుత్వ రంగంలోని బ్యాంకులు మొండి బకాయిల వసూలుకు ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు ఇన్‌సాల్వెన్సీ బ్యాంక్‌రప్టసీ కోడ్ (ఐబీఐ) ఇచ్చిన మద్దతు, ప్రభుత్వం చేపట్టిన విధానపరమైన సంస్కరణలు, చర్యలు మొండి బకాయిలను తగ్గించుకోవడానికి ఊతమిస్తున్నాయి. దీంతో గత ఏడాది ఒక దశలో గరిష్ఠ స్థాయికి చేరిన ప్రభుత్వ బ్యాంకుల మొండి బకాయిలు తగ్గుముఖం పడుతున్నాయి. బ్యాంకులను బలోపేతం చేయడానికి ప్రభుత్వం భారీగా మూలధనాన్ని సమకూరుస్తోంది. మరో వైపు బ్యాంకులు ఉద్యోగులకు షేర్లను కేటాయించడం, మార్కెట్ల నుంచి నిధులను సమీకరించడం ద్వారా బ్యాంకులు నిధులు సవకూర్చుకుంటున్నాయి. ఇటువంటి సానుకూల పరిణామాలు ప్రభుత్వ బ్యాంకులకు మళ్లీ కళ తీసుకురానున్నాయని, ప్రస్తుత ఏడాది ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లకు ఆశావహంగా ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. స్టాక్ మార్కెట్‌లో గత రెండు, మూడేళ్లుగా ప్రభుత్వ బ్యాంకుల షేర్లను పట్టించుకోని మదుపర్లను ప్రభుత్వ బ్యాంకుల షేర్లు ఆకర్షిస్తున్నాయని చెబుతున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి కొన్ని బ్యాంకుల షేర్లపై బ్రోకింగ్ కంపెనీలు సానుకూల దృక్పథంతో ఉన్నాయి. గత మూడేళ్లుగా బ్యాంకు షేర్లపై సెంటిమెంట్ ప్రతికూలంగా ఉంది. ఇప్పుడిప్పుడే అది మారుతోందని మార్కెట్‌వర్గాలు చెబుతున్నాయి.

1 భారీగా మూలధనం

ప్రభుత్వ రంగ బ్యాంకులను గాడిలోకి తెచ్చే చర్యల్లో భాగంగా పీఎస్‌బీలకు ప్రభుత్వం భారీగా మూలధన నిధులను అందిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ బ్యాంకులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదనంగా రూ.41,000 కోట్ల మూలధన నిధులు (రీక్యాపిటలైజేషన్) సమకూర్చే ప్రతిపాదనను పార్లమెంట్ ముందు ప్రభుత్వం ఉంచింది. గతంలో 2018-19లో బ్యాంకులకు రూ.65,000 కోట్ల మూలధన నిధులను సమకూర్చాలని ప్రతిపాదించింది. తాజా ప్రతిపాదనతో ఇది రూ.1.06 లక్షల కోట్లకు చేరుతుంది. అనుకున్న దానిలో ఇప్పటి వరకూ సమకూర్చిన నిధులు పోగా.. రూ.83,000 కోట్ల నిధులు బ్యాంకులకు అందనున్నాయి. వచ్చే కొద్ది నెలల్లో అందే ఈ నిధుల వల్ల బ్యాంకుల కనీస మూలధన నిష్పత్తి పెరగడంతో పాటు నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి తగ్గుతుంది. బాండ్లు ఇతర మార్గాల ద్వారా కూడా బ్యాంకులు భారీగా నిధులు సమీకరిస్తున్నాయి.

2 పీసీఏ నిబంధనలు

సత్వర దిద్దుబాటు చర్యల (ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్-పీసీఏ) నిబంధనల పరిధిలోకి వచ్చిన బ్యాంకులను ఆ పరిధి నుంచి బయటపడేసి పరిశ్రలకు రుణాలు ఇచ్చే విధంగా చేయడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. 2018 నవంబరు 19న జరిగిన సమావేశంలో రిజర్వు బ్యాంకు బోర్డు పీసీఏ అంశాన్ని బోర్డు ఫర్ ఫైనాన్షియల్ సూపర్‌విజన్ (బీఎఫ్ఎస్)కు సమర్పించింది. దీనిపై బీఎఫ్ఎస్ సానుకూల నిర్ణయాలు తీసుకునే వీలుంది. వరుసగా నాలుగేళ్లు ఎన్‌పీఏలు 12 శాతం మించడం, ఆస్తులపై ప్రతికూల ప్రతిఫలాలు చవిచూస్తున్నప్పుడు ఆయా బ్యాంకులను పీసీఏ పరిధిలోకి తీసుకువస్తారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఈ బ్యాంకులు శాఖలను విస్తరించడానికి ఉండదు. నిర్దేశించిన రంగాలకు ఇచ్చే రుణాలపై పరిమితి ఉంటుంది. ఆయా బ్యాంకుల్లో ప్రత్యేక ఆడిట్లు నిర్వహిస్తారు. కార్యకలాపాలను పునర్‌వ్యవస్థీకరిస్తారు. కొన్ని సందర్భాల్లో బ్యాంకుల బోర్డులను రద్దు చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం 11 ప్రభుత్వ బ్యాంకులు పీసీఏ పరిధిలో ఉన్నాయి. పీసీఏ నిబంధనలను సరళీకరిస్తే.. కొన్ని బ్యాంకులు ఊపిరి పీల్చుకునే వీలుంది. బ్యాంకింగ్ వ్యవస్థ ఇచ్చిన రుణాల్లో పీసీఏ పరిధిలో ఉన్న ప్రభుత్వబ్యాంకుల వాటా దాదాపు 18 శాతం ఉంది. 2018 సెప్టెంబరు చివరి నాటికి మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ స్థూల నిరర్థక ఆస్తుల్లో ఈ బ్యాంకుల నిరర్థక ఆస్తులు 35 శాతానికి చేరాయి. ప్రభుత్వ బ్యాంకులు ఇచ్చిన రుణాల్లో పీఎస్‌ఏ పరిధిలోకి వచ్చిన బ్యాంకుల రుణాల వాటా 2014 డిసెంబరు నాటికి 34 శాతం ఉండగా.. 2018, సెప్టెంబరు చివరకు 27 శాతానికి తగ్గింది. డిపాజిట్ల వాటా 34 శాతం నుంచి 29 శాతానికి పరిమితమైంది.

3 తగ్గుతున్న నిరర్థక ఆస్తులు



బ్యాంకులు, ప్రభుత్వం చేపట్టిన చర్యలు, ఇన్‌సాల్వెన్సీ బ్యాంక్‌రప్టసీ కోడ్ (ఐబీసీ)తో ఊపందుకున్న మొండి బకాయిల వసూళ్లు తదితర అంశాలు ప్రభుత్వ బ్యాంకుల నిరర్థక ఆస్తులు తగ్గడానికి దోహదం చేస్తున్నాయి. 2019, మార్చితో ముగిసే ఏడాది ప్రథమార్థంలో పీఎస్‌బీల నిరర్థక ఆస్తులు రూ.23,860 కోట్ల మేరకు తగ్గాయి. ఇదే కాలంలో ఈ బ్యాంకులు రూ.60,713 కోట్ల రుణాలను రికవరీ చేశాయి. గత ఏడాది ఇదే కాలంలో రికవరీ చేసిన రూ.29,302 కోట్లతో పోలిస్తే ఇది రెట్టింపుకన్నా ఎక్కువ.

కోలుకుంటున్న ఎస్‌బీఐ

వరుసగా మూడు త్రైమాసికాలు నష్టాలు ప్రకటించిన ఎస్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి రూ.940 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంత క్రితం ఏడాదితో పోలిస్తే 2018, సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికానికి దేశీయ వ్యాపారంలో బ్యాంకు నికర వడ్డీ మార్జిన్ (నిమ్) 0.29 శాతం పెరిగి 2.88 శాతానికి చేరింది. ఏడాది క్రితంతో పోలిస్తే సెప్టెంబరు త్రైమాసికానికి బ్యాంకు డిపాజిట్లు 7 శాతం వృద్ధితో రూ.28.07 లక్షల కోట్లకు చేరాయి. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 12.5 శాతం వృద్ధితో రూ.20,906 కోట్లకు పెరిగింది. అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 0.74 శాతం తగ్గి 9.95 శాతానికి చేరాయి. భవిష్యత్తులో కూడా నిరర్థక ఆస్తులు తగ్గే అవకాశాలున్నాయి. రెండో త్రైమాసికంలో రిటైల్ క్రెడిట్ వృద్ధి ఏడాది క్రితంతో పోలిస్తే 14.3 శాతం పెరిగింది. గృహ రుణాలు 14.26 శాతం పెరిగాయి.

విదేశీ మార్కెట్ నుంచి ఎస్‌బీఐ 125 కోట్ల డాలర్ల సమీకరణ

అంతర్జాతీయ మార్కెట్లో బాండ్ల జారీ ద్వారా ఎస్‌బీఐ 125 కోట్ల డాలర్లు సేకరించింది. అన్ని దేశాల వారు తమ బాండ్లలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబర్చారని శనివారం విడుదల చేసిన ప్రకటనలో బ్యాంక్ పేర్కొంది. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో ఏర్పాటైన ఇండియా ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్‌లో ఈ బాండ్లు లిస్ట్ అయ్యాయి.



ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పెట్టుబడులు పెట్టడానికి ఇది తగిన సమయంగా కనిపిస్తోంది. బ్యాంకుల నిరర్థక ఆస్తులు 2018 మార్చి నాటికి 11.5 శాతం ఉండగా.. 2019 మార్చి నాటికి 10.3 శాతానికి తగ్గే వీలుంది. బ్యాంకుల పనితీరును అంచనా వేయడానికి మొండి బకాయిలు కీలకమైన ప్రమాణం. మొండి బకాయిలు తగ్గుముఖం పట్టడంతోపాటు ప్రభుత్వం మూలధన నిధులను అందించడం వల్ల బ్యాంకులు ప్రయోజనం పొందనున్నాయి. దీంతో పాటు బ్యాంకుల విలీనం జరుగుతోంది.

- రాజీవ్ సింగ్, సీఈఓ, కార్వీ బ్రోకింగ్

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి ప్రభుత్వ బ్యాంకుల నిరర్థక ఆస్తులు వరుసగా రెండు త్రైమాసికాలు తగ్గాయి.
- 2018 సెప్టెంబరుతో ముగిసిన మూడు నెలలకు పీఎస్‌బీల రుణాల వృద్ధిరేటు 5.8 శాతానికి చేరింది. ఇది గత 11 త్రైమాసికాల్లోనే అత్యధిక వృద్ధి రేటు.
- బాండ్ల మార్కెట్‌లో వస్తున్న మార్పు బ్యాంకులకు అనుకూలంగా మారనుంది. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో 10 ఏళ్ల కాలపరిమితి కలిగిన ప్రభుత్వ సెక్యూరిటీలపై ప్రతిఫలం అర శాతం తగ్గింది. ఇది బ్యాంకుల ట్రెజరీ ఆదాయాలను పెంచే వీలుంది.
- 2018 మార్చితో ముగిసిన ఏడాదితో కలిపి మొత్తం గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వ బ్యాంకులు రూ.1,07,543 కోట్ల మూలధన నిధులను ప్రభుత్వం అందించింది.
- గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో నిరర్థక ఆస్తులకు ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.4,05,456 కోట్లు కేటాయించాయి. దీంతో రూ.81,009 కోట్ల నష్టాలను చవిచూశాయి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభంలో 20 % వృద్ధి

న్యూఢిల్లీ: ప్రైవేటు రంగంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి రూ.5,585.9 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.4,642.6 కోట్లు)తో పోల్చితే లాభంలో వృద్ధి 20.3 శాతంగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ. 24,450.44 కోట్ల నుంచి రూ.30,811.27 కోట్లకు పెరిగింది. ఇదేకాలంలో నికర వడ్డీ ఆదాయం 21.9 శాతం పెరిగి రూ.10,314.3 కోట్ల నుంచి రూ.12,576.8 కోట్లకు చేరుకుంది. మొత్తం రుణాల్లో స్థూల మొండి పద్దులు (ఎన్‌పీఏ) 1.29 శాతం నుంచి 1.38 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు మాత్రం 0.44 శాతం నుంచి 0.42 శాతానికి తగ్గాయి. కానీ బ్యాంక్ కేటాయింపులు, కాంటిన్జెన్సీలు రూ.1,351.44 కోట్ల నుంచి రూ.2,211.53 కోట్లకు పెరిగాయి. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ ఇతర ఆదాయాలు రూ.3,869.17 కోట్ల నుంచి రూ.4,921 కోట్లకు పెరగడం విశేషం.

రూ.20,000 మించిన లావాదేవీలపై ఐటీ కన్ను!

త్వరలో నోటీసులు.. ప్రస్తుతం ఢిల్లీకే పరిమితం

ఆ తర్వాత దేశవ్యాప్తంగా అమల్లోకి ?



న్యూఢిల్లీ: ఆస్తుల కొనుగోలులో రూ.20,000 కంటే మించిన నగదు లావాదేవీలకు నోటీసులు జారీ చేసేందుకు ఆదాయ పన్ను శాఖ రెడీ అవుతోంది. ప్రస్తుతం ఇది దేశ రాజధాని ఢిల్లీకి పరిమితమైనప్పటికీ అనంతర కాలంలో దీన్ని దేశమంతటికి వర్తింపజేసే అవకాశాలు లేకపోలేదు. ఆస్తుల కొనుగోలు సమయంలో రూ.20,000 అంతకుపైబడిన నగదు లావాదేవీలకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించేందుకు ఆదాయ పన్ను శాఖ సిద్ధమవుతోందని పేరు వెల్లడించటానికి ఇష్టపడని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఇప్పటికే ఆదాయ పన్ను శాఖ, ఢిల్లీ డివిజన్ ఆస్తుల కొనుగోలులో రూ.20 వేలకు పైబడిన నగదు చెల్లింపులను షార్ట్‌లిస్ట్ చేసిందని పేర్కొన్నారు. మరోవైపు ఆదాయ పన్ను శాఖ ఢిల్లీలోని 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2015, జూన్ 1 నుంచి 2018 డిసెంబరు వరకు జరిగిన అన్ని రిజిస్ట్రేషన్లను క్షుణ్ణంగా పరిశీలిస్తోందని ఆయన తెలిపారు. వచ్చే నెల నుంచి కొనుగోలుదారులు, విక్రయదారులకు ఆదాయ పన్ను శాఖ అసెస్‌మెంట్ అధికారి ఈ నోటీసులు పంపించనున్నారని చెప్పారు. ఒకవేళ విక్రయదారుడు జరిమానాను చెల్లించేందుకు సిద్ధపడితే అంగీకరిస్తామని, అయితే ఇదే సమయంలో కొనుగోలుదారుడిని మాత్రం సొమ్ము ఎక్కడి నుంచి వచ్చిందో వివరాలు వెల్లడించాలని కోరనున్నట్లు ఆ అధికారి పేర్కొన్నారు. స్థిరాస్తుల లావాదేవీల్లో అత్యధికంగా నల్లధనం చలామణి అవుతున్న సంగతి విదితమే. నల్లధన లావాదేవీలకు అడ్డుకట్ట వేసేందుకే ఆదాయ పన్ను శాఖ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కాగా ఈ తరహా లావాదేవీలను పరిశీలించేందుకు 2015లోనే రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 269ఎస్ఎస్‌లో కొన్ని మార్పులు చేశారని ఆ అధికారి తెలిపారు. వ్యవసాయ భూమి సహా రియల్ ఎస్టేట్‌లో రూ.20,000కు అంతకుపైబడిన ప్రతి లావాదేవీని అకౌంట్ పేయీ చెక్ లేదా ఆర్‌టీజీఎస్, ఎలక్ట్రానిక్ విధానంలో చేపట్టాలని 2015, జూన్ 1 నుంచి కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చింది.

భవిష్యత్తు ఫుడ్ ప్రాసెసింగ్‌దే

మైక్రోసాఫ్ట్ యూఎస్ డైరెక్టర్ శివకుమార్

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి): రానున్నది ఫుడ్ ప్రాసెసింగ్ శకమని మైక్రోసాఫ్ట్ యూఎస్ డైరెక్టర్ శివకుమార్ కొండూరి తెలిపారు. వ్యవసాయంలో డిజిటల్ టెక్నాలజీ వినియోగంపై వ్యవసాయ విద్యార్థులకు జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో శనివారం అవగాహన కల్పించారు. ఇందులో పాల్గొన్న ఆయన.. డిజిటల్ టెక్నాలజీ, వ్యవసాయంలో కృత్రిమ మేధ, బిగ్ డేటా అనాలసిస్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వినియోగంపై ప్రజంటేషన్ ఇచ్చారు. 2050కి పెరగనున్న జనాభాకు అనుగుణంగా 70 శాతం అదనంగా ఆహారధాన్యాల ఉత్పత్తి జరగాల్సిన అవసరం ఉందని శివకుమార్ తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వర్సిటీలు కొత్త కోర్సులు ప్రారంభించాలన్నారు. నాలెడ్జ్ ఆధారిత వ్యవసాయానిదే భవిష్యత్ అని జయశంకర్ వర్సిటీ వీసీ వి ప్రవీణ్‌రావు అన్నారు.

స్టీల్ కంపెనీ 'డొల్ల' వ్యాపారం

▸▸ రూ. 40 కోట్ల నకిలీ ఇన్వాయిస్‌లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): నకిలీ ఇన్వాయిస్‌లతో రూ.4 కోట్ల మేర వస్తుసేవల పన్నును ఎగ్గొట్టిన ఓ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ 'డొల్ల' వ్యాపారం గుట్టును జీఎస్‌టీ హైదరాబాద్ కమిషనరేట్ అధికారులు రట్టు చేశారు. నాచారం, శంకరంపేటల్లోని ఈ కంపెనీ యూనిట్లలో వార్షిక టర్నోవర్ రూ.500 కోట్లుగా ఉంది. అయితే.. ఈ కంపెనీ సృష్టించిన డొల్ల కంపెనీల (షెల్ కంపెనీల) ద్వారా రూ. 40 కోట్ల మేర నకిలీ ఇన్వాయిస్‌లను జారీ చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో.. శనివారం ఆ కంపెనీ యజమాని ఇంట్లో, యూనిట్లలో తనిఖీలు చేపట్టారు. రూ.4 కోట్ల మేర జీఎస్‌టీని ఎగ్గొట్టినట్లు లెక్క తేల్చారు.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	33,380	32,900	33,330	32,850	32,380
క్రితం ముగింపు	33,490	---	33,330	32,870	32,400
22 క్యారెట్లు	30,900	30,050	30,660	30,410	30,910
క్రితం ముగింపు	31,010	---	30,660	30,420	30,930
వెండి (కిలో)	40,200	40,300	40,100	40,200	42,100
క్రితం ముగింపు	40,300	---	40,100	40,400	42,500

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.65 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	405	చిత్తూరు	433
వరంగల్	407	చెన్నై	440
విజయవాడ	425	నమక్కల్	425
గోదావరి	425	బెంగళూరు	435
విశాఖపట్నం	425	ముంబై	460

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	77	విజయవాడ	81
కరీంనగర్	78	గుంటూరు	82
వరంగల్	77	ఒంగోలు	83
మహబూబ్‌నగర్	77	చిత్తూరు	91
కర్నూలు	77	నెల్లూరు	91
విశాఖపట్నం	75	అనంతపురం	86
గోదావరి	76		

భారత్ రుణం రూ.82 లక్షల కోట్లు

మోదీ హయాంలో 50 శాతం పెరుగుదల



న్యూఢిల్లీ: భారత్ అప్పులు భారీ స్థాయిలో పెరిగిపోతున్నాయి. కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి దేశ రుణం మరింత ఎక్కువైంది. గత నాలుగున్నరేళ్లకాలంలో ప్రభుత్వ అప్పు ఏకంగా 49 శాతం పెరిగి రూ.82,03,253 లక్షల కోట్ల (2018 సెప్టెంబరునాటికి)కు చేరింది. 2014 జూన్‌నాటికి ఈ అప్పు రూ.54,90,763 కోట్లుగా ఉంది. మొత్తం అప్పులో పబ్లిక్ డెట్ (విదేశీ+దేశీయ అప్పు) వాటాయే రూ.73 లక్షల కోట్లుగా ఉంది. నాలుగున్నరేళ్ల క్రితం ఇది రూ.48 లక్షల కోట్లుగా ఉంది. ఇదే కాలంలో దేశీయ అప్పు 54 శాతం మేర పెరిగి రూ.68 లక్షల కోట్లకు చేరుకుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ద్వారా వెల్లడైంది. సమీక్షా కాలంలో మార్కెట్ ద్వారా రుణాలు 47.5 శాతం పెరిగి రూ.52 లక్షల కోట్లు దాటాయి. ఇదిలా ఉంటే.. 2014 జూన్ చివరినాటికి బంగారం బాండ్ల ద్వారా ప్రభుత్వం సమీకరించిన అప్పు ఏమీ లేదు. అయితే ఇప్పుడు మాత్రం బంగారం నగదీకరణ పథకం కింద ప్రభుత్వం సమీకరించిన మొత్తం రూ.9,089 కోట్లుగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తన స్థాయి పత్రంలో అప్పులకు సంబంధించిన సంపూర్ణ వివరాలను తెలియజేసింది. 2010-11 సంవత్సరం నుంచి వార్షిక స్థాయి పత్రాన్ని విడుదల చేస్తున్నట్టు ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ద్రవ్యలోటును పూడ్చుకునేందుకు మార్కెట్‌తో అనుసంధానమైన రుణాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపింది. ఇదిలా ఉంటే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నవంబరుతో ముగిసిన ఎనిమిది నెలల కాలానికి ద్రవ్యలోటు రూ.7.17 లక్షల కోట్లుగా ఉంది. పూర్తి సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యం రూ.6.24 లక్షల కోట్లలో ఇది 114.8 శాతంగా ఉంది.

2035 కల్లా 10 లక్షల కోట్ల డాలర్లు

▸▸ 7-8 ఏళ్లలో 5 లక్షల కోట్ల డాలర్లకు..

▸▸ జీడీపీపై కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు



గాంధీనగర్: వచ్చే 7-8 ఏళ్లలో జీడీపీ 5 లక్షల కోట్ల డాలర్లకు, 2035కల్లా 10 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకోగల సత్తా భారత్‌కు ఉందని కేంద్ర వాణిజ్య, పౌర విమానయాన శాఖల మంత్రి సురేశ్ ప్రభు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ లక్ష్య సాధన కోసం వస్తు తయారీ, సేవలు, వ్యవసాయ రంగాలపై ప్రధానంగా దృష్టిసారిస్తూ తన మంత్రిత్వ శాఖ ఇప్పటికే రోడ్‌మ్యాప్ రూపొందించిందన్నారు. వైబ్రంట్ గుజరాత్ సదస్సు రెండో రోజున ఎగుమతులపై జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "దేశంలో వస్తు తయారీ.. ఎగుమతులకు దారితీయాలి. తద్వారా వస్తు ఉత్పత్తిలో నాణ్యత, సంస్థల పోటీ సామర్థ్యం పెరుగుతుంది. ప్రస్తుతం మన దేశ ఎగుమతులు దాదాపు 50 వేల కోట్ల డాలర్ల స్థాయిలో ఉన్నాయి. దాన్ని రెట్టింపు చేయడమే మన ముందున్న సవాల"ని ఆయన పేర్కొన్నారు. ఎగుమతుల వృద్ధికి మన ముందు భారీగా అవకాశాలున్నాయని, ఆఫ్రికా, లాటిన్ అమెరికా మార్కెట్లకు ఎగుమతులు పెంచుకోవచ్చన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో అగ్ర రాజ్యాలైన అమెరికా, చైనా మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధాన్ని అవకాశంగా మల్చుకోవాలని సురేశ్ ప్రభు సూచించారు.

మరో 100 విమానాశ్రయాలు

దేశంలో విమానయాన సేవలను విస్తృతం చేసేందుకు వీలుగా సమీప భవిష్యత్‌లో 6,500 కోట్ల డాలర్ల పెట్టుబడులతో కొత్తగా 100 ఎయిర్‌పోర్టులను నిర్మించనున్నట్లు మంత్రి చెప్పారు. గుజరాత్‌లోని ధోలెరా, అంక్లేశ్వర్‌లలో హరిత విమానాశ్రయాలను ఏర్పాటు చేసేందుకు శనివారం నాడు ఈ సదస్సులో రెండు అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదిరాయి. మంత్రి సురేశ్ ప్రభు, గుజరాత్ సీఎం విజయ్ రూపానీ సమక్షంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఈ ఒప్పందాలను కుదుర్చుకున్నాయి.

విజయవాడలో 'లలితా జువెలరీ'

▸▸ 21న షోరూమ్ ప్రారంభం.. రూ.300 కోట్ల పెట్టుబడి

▸▸ త్వరలో రాజమండ్రిలో షోరూమ్

▸▸ సంస్థ ఎండీ కిరణ్ కుమార్ వెల్లడి



విజయవాడ (ఆంధ్రజ్యోతి): చెన్నై కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న లలితా జువెలరీ.. విజయవాడలోకి అడుగు పెడుతోంది. శనివారం నాడిక్కడ లలితా జువెలరీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో తమకు ఇది నాలుగో షోరూమ్ అని తెలిపారు. ఈ నెల 21న (సోమవారం) విజయవాడ షోరూమ్‌ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. రూ.300 కోట్ల పెట్టుబడితో ఈ షోరూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం లలితా జువెలరీ తెలంగాణలోని హైదరాబాద్‌లో ఒక షోరూమ్‌ను నిర్వహిస్తుండగా ఏపీలో తిరుపతి, విశాఖపట్నంల్లో ఒక్కో షోరూమ్‌ను నిర్వహిస్తోందని కిరణ్ వెల్లడించారు. ఏపీలో మరో షోరూమ్‌ను తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రిలో త్వరలోనే ప్రారభించనున్నట్లు ఆయన చెప్పారు. చెన్నైకి సమీపంలో ఆంధ్రప్రదేశ్ ఉండటంతో ఇక్కడ కార్యకలాపాల విస్తరణపై దృష్టి పెట్టినట్లు ఆయన తెలిపారు.

పిడబ్ల్యూసీ అవార్డుకు అయ్యన్న ఇన్‌ఫ్రా నామినేషన్

హైదరాబాద్: ప్రతిష్ఠాత్మకమైన ఏషియా వన్, ప్రైస్‌వాటర్ హౌజ్ కూపర్స్ (పిడబ్ల్యూసీ) అవార్డుకు దరఖాస్తు చేసినట్లు హైదరాబాద్‌కు చెందిన అయ్యన్న ఇన్‌ఫ్రా వెల్లడించింది. 2018 సంవత్సరానికి గాను ఫాసెస్ట్ గ్రోయింగ్ కంపెనీ విభాగంలో అయ్యన్న ఇన్‌ఫ్రా ఈ దరఖాస్తు చేసిందని సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి శ్రీధర్ తెలిపారు. ఈ నెల 21న సింగపూర్‌లో ఆసియా గ్రేటెస్ట్ బ్రాండ్స్ అండ్ లీడర్స్ అవార్డుల కార్యక్రమంలో భారత్‌కు సంబంధించిన అవార్డులను ప్రదానం చేయనున్నారని, ఇందులో తమకంపెనీకి అవార్డు లభిస్తుందని ఆశాభావంతో ఉన్నట్లు ఆయన చెప్పారు.




హిజ్రాలకు ఎల్ఎల్ఆర్‌లు అందజేస్తున్న జిల్లా జడ్జి, కలెక్టర్, ఎస్పీ

హిజ్రాలకు లెర్నింగ్ లైసెన్స్

దేశంలోనే తొలిసారిగా కడప జిల్లాలో జారీ

ప్రొద్దుటూరు క్రైం, జనవరి 19 : దేశ చరిత్రలోనే తొలిసారిగా ట్రాన్స్‌జెండర్ (హిజ్రా)లకు ఎల్ఎల్ఆర్‌లు జారీచేసి కడప జిల్లా రవాణాశాఖ రికార్డు సాధించింది. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గం చాపాడు మండలం పల్లవోలులోని చైతన్యభారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శనివారం జరిగిన న్యాయసేవ శిబిరంలో 32 మంది హిజ్రాలకు జిల్లా జడ్జి జి.శ్రీనివాస్, కలెక్టర్ హరికిరణ్, ఎస్పీ అభిషేక్ మహంతి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బసిరెడ్డి లెర్నింగ్ లైసెన్స్‌లను అందజేశారు. అంతకు ముందు సమావేశంలో డీటీసీ బసిరెడ్డి మాట్లాడుతూ తమ శాఖ ద్వారా హిజ్రాలు డ్రైవింగ్ లైసెన్స్ పొందటానికి ఆన్‌లైన్‌లో ప్రయత్నించగా, అందులో వారికి సంబంధించిన ఆప్షన్ లేకపోవడంతో వారు సంక్రాంతి పండుగకు ముందు జిల్లా జడ్జి శ్రీనివాస్‌ను కలిసి తమకు డ్రైవింగ్ లైసెన్స్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారని తెలిపారు. దీంతో జిల్లా జడ్జి హిజ్రాలకు డ్రైవింగ్ లైసెన్స్ జారీకి చర్యలు తీసుకోవాలని తమ శాఖను కోరారన్నారు. ఈ విషయమై కలెక్టర్ హరికిరణ్ రవాణాశాఖ కార్యదర్శి బాలసుబ్రమణ్యంతో మాట్లాడి డ్రైవింగ్ లైసెన్స్ ఆన్‌లైన్ దరఖాస్తులో మేల్, ఫిమేల్‌తో పాటు ట్రాన్స్‌జెండర్ కాలమ్ ఏర్పాటు చేయాలని కోరారని, ఈ మేరకు ఏర్పాటు చేయడంతో పాటు లెర్నింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న 32 మంది హిజ్రాలకు లెర్నింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియలో శిక్షణ ఇచ్చి, ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించామని డీటీసీ తెలిపారు.



కార్యక్రమంలో బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వెంకయ్య

దివ్యాంగుల్లో సంతోషం నింపేందుకు కృషిచేయాలి

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

మాదాపూర్/హైదరాబాద్, జనవరి19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందించడమే కాకుండా వారిలో సంతోషం నింపేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో భగవాన్ మహావీర్ వికలాంగ సహాయ సమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివ్యాంగులను ప్రోత్సహించేందుకు ఇంత గొప్ప కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ సినీనటి, నృత్యకారిణి సుధాచంద్రన్ ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్నపట్టికీ ఆత్మస్థైర్యం, తపనతో వైకల్యాన్ని లెక్క చేయకుండా దేశ, విదేశాల్లో అద్భుతమైన ప్రదర్శనలతో ఎంతో మంది దివ్యాంగులకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని దివ్యాంగులు ముందుకు సాగాలని తెలిపారు. జైపూర్‌ఫుట్ వికలాంగులకు ఎంతో అండగా ఉంటుందని, వికలాంగుల కొరకు నూతన సాంకేతికతతో సౌకర్యవంతంగా రూపొందించేందుకు చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగుల జీవితాల్లో సంతోషాన్ని నింపేందుకు జైన్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో అభినందనీయమన్నారు. అతి త్వరలోనే కేంద్ర ప్రభుత్వ సహకారంతో నెల్లూరులో దివ్యాంగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

'కృష్ణారావు కథనాలతో జనం జాగృతం'

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తరువాత కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల విడుదలలో జాప్యంపై 'ఆంధ్రజ్యోతి' అసోసియేట్ ఎడిటర్ ఎ.కృష్ణారావు ఎన్నో కథనాలు రాసి ప్రజలను జాగృతం చేశారని తెలుగుదేశం పార్టీ మానవ వనరుల అభివృద్ధి కమిటీ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శనివారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో జరిగిన లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో కృష్ణారావును ఆయన సత్కరించారు. కేంద్రం కక్ష సాధింపులో భాగంగానే రాష్ట్రానికి నిధులను విడుదల చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఇదే విషయాన్ని ఢిల్లీలోని ఉంటున్న కృష్ణారావు వరుస కథనాలతో రాష్ట్ర ప్రజలను తెలియజేస్తున్నారన్నారు. లోటు బడ్జెట్ నిధులు, పోలవరం, అమరావతి నిర్మాణానికి నిధులు ఇవ్వకపోవడం వంటి ఎన్నో అంశాలపై లోతైన విశ్లేషణలతో, సమగ్రమైన సమాచారంతో ఆయన రాసిన వ్యాసాల వల్ల రాష్ట్రంలోని కోట్లమంది ప్రజలకు కేంద్రం చేస్తున్న అన్యాయం తెలిసిందన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో 'ఇండియా గేట్' పేరుతో ఆయన రాసే వ్యాసాలు ప్రజలను మేల్కొలుపుతున్నాయని చెప్పారు.

వీఆర్‌ఏ లైంగిక వేధింపులు

- కలెక్టర్‌కు అటెండర్ ఫిర్యాదు
- బాధ్యులపై సత్వర చర్యలకు ఆదేశాలు
- ఏకార్లపల్లె వీఆర్‌ఏ సస్పెన్షన్

కుప్పం, జనవరి 19 : వీఆర్‌ఏ తనను లైంగికంగా వేధిస్తున్నారంటూ కుప్పం తహసీల్దారు కార్యాలయ అటెండర్ కలెక్టర్ పీఎస్.ప్రద్యుమ్నకు శనివారం ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపించిన సబ్ కలెక్టర్ కీర్తి వీఆర్‌ఏని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే... భవ్యశ్రీ కుప్పం తహసీల్దారు కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. తనను ఏకార్లపల్లె విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ ఆనందుడు లైంగికంగా వేధిస్తున్నారంటూ తహసీల్దారుకు గతంలో ఆమె ఫిర్యాదు చేశారు. తన మొబైల్‌ను చోరీ చేసి, అందులోని తన ఫొటోలు కొన్నింటిని సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసి, అవమానాల పాలు చేస్తున్నారంటూ 20 రోజుల క్రితం కుప్పం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఈనేపథ్యంలో శుక్రవారం ఉదయం తహసీల్దారు కార్యాలయంలో ఆనందుడు ఉండగా భవ్యశ్రీ వచ్చి తనను లైంగికంగా వేధిస్తున్నావంటూ విరుచుకుపడ్డారు. తనను సబ్ కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ ప్రయత్నాలు కూడా మీ పనేనంటూ ఆరోపించారు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి దాడులు చేసుకున్నారు. అసభ్యకరంగా మాట్లాడుతూ వీఆర్‌ఏ వేధిస్తున్నాడని భవ్యశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేయగా అకారణంగా తనపై దాడి చేసిందంటూ భవ్యశ్రీపై వీఆర్‌ఏ ఎదురు ఫిర్యాదు చేశారు. కాగా, శనివారం భవ్యశ్రీ నేరుగా కలెక్టర్ ప్రద్యుమ్న వద్దకు వెళ్లి వీఆర్‌ఏపై ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే విచారించి నివేదిక సమర్పించాల్సిందిగా మదనపల్లె సబ్ కలెక్టర్ కీర్తిని కలెక్టర్ ఆదేశించారు. కుప్పం తహసీల్దారు నజీర్‌అహ్మద్ ఇరువర్గాలనూ విచారించి నివేదికను శనివారం సాయంత్రానికి సబ్ కలెక్టర్‌కు పంపారు. ఈ నివేదిక ఆధారంగా వీఆర్‌ఏ ఆనందుడిని సస్పెండు చేస్తూ సబ్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం

వీఆర్‌ఏ ఆనందుడు వేధిస్తున్నాడంటూ భవ్యశ్రీ చేసిన ఫిర్యాదుపై తీవ్రంగా స్పందించిన సీఎం చంద్రబాబు వెంటనే విచారించి దోషులుగా తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రద్యుమ్నను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే సబ్ కలెక్టర్ విచారణ, అనంతరం వీఆర్‌ఏ సస్పెన్షన్ వెంటవెంటనే జరిగిపోయాయి.

సమాజ సేవ అందరి బాధ్యత

త్యాగాలు చేసి సేవ చేయనవసరంలేదు.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు

- ప్రజలకు ఉపయోగపడే పనిచేసేవారే సెలబ్రిటీలు
- మంచిచేయాలనే భావించే వారి సంఖ్య తగ్గిపోతోంది
- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్
- భాష అంతరిస్తే సంస్కృతి అంతరిస్తుంది: జస్టిస్ శేషాద్రినాయుడు
- అంపశయ్య నవీన్‌కు లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారం ప్రదానం



పురస్కార గ్రహీతలతో జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ జాస్తి చలమేశ్వర్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవను బాధ్యతగా భావించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. లోక్‌నాయక్ ఫౌండేషన్ 15వ వార్షిక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం సాయంత్రం విశాఖలోని కళాభారతిలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడంలో లభించే సంతోషం మరెందులోనూ దొరకదన్నారు. త్యాగాలు చేసి సేవ చేయాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరూ తమకు తోచిన రీతిలో ఎంతో కొంత సమాజానికి తిరిగి ఇవ్వాలన్నారు. తమ తమ రంగాల్లో సమాజానికి విశేష సేవలందిస్తున్న ముగ్గురికి పురస్కారాలను అందించడం ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి సన్మానాల వల్ల సమాజంలో ఎంతోకొంత మార్పు వస్తే యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సంతోషిస్తారన్నారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ సమాజానికి మంచి చేయాలన్న భావన కలిగిన వారి సంఖ్య కొన్నేళ్లుగా తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. సమాజానికి ఉపయోగపడే పనులు చేసేవారే నిజమైన సెలబ్రిటీలని పేర్కొన్నారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దామా శేషాద్రినాయుడు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రకటించిన అంతరించేపోయే భాషల జాబితాలో తెలుగు ఉందని, మన భాష అంతరిస్తే సంస్కృతి కూడా అంతరించిపోతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. కేరళ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఆంథోనీ థామ్‌నిక్ మాట్లాడుతూ ముగ్గురు గొప్పవాళ్లకు అవార్డులను అందించడం గొప్ప విషయమని, గతంలో అవార్డులు అందుకున్నవారి వివరాలు తెలిసిన తరువాత దీని విలువ తనకు అర్థమైందన్నారు. లోక్‌నాయక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ స్వర్గీయ ఎన్‌టీఆర్, హరివంశరాయ్‌బచ్చన్‌ల జ్ఞాపకార్థం ఈ పురస్కారాలను గత 15 ఏళ్లుగా ప్రదానం చేస్తున్నామన్నారు. సాహిత్యం ద్వారా సమాజానికి సేవ చేసిన ముగ్గురికి ఈ ఏడాది పురస్కారాలను అందజేయడం ఆనందంగా ఉందన్నారు. 'ఆంధ్రజ్యోతి' అసోసియేట్ ఎడిటర్ ఎ.కృష్ణారావు పురస్కార గ్రహీతలను సభకు పరిచయం చేశారు. లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాన్ని అంపశయ్య నవీన్‌కు అందించారు. పురస్కారంతోపాటు రూ.1.5 లక్షల నగదు, ప్రశంసాపత్రాలను అందించారు. అదేవిధంగా బాలల వికాసానికి చేసిన కృషికి గుర్తింపుగా గుంటూరుకు చెందిన ఎన్.మంగాదేవికి, దివ్యాంగులు, కళా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో చేసిన సేవలకుగాను హైదరాబాద్‌కు చెందిన వంశీ రామరాజుకు జీవన సాఫల్య పురస్కారాలను, రూ.50 వేల నగదును ముఖ్య అతిథుల చేతులు మీదుగా అందించి సన్మానించారు.

సమాజానికి సాహిత్యం ఎంతో అవసరం

పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్ మాట్లాడుతూ సమాజానికి సాహిత్యం ఎంతో అవసరమన్నారు. సమాజాన్ని సంస్కరించడంలో, నాగరికత వైపు నడిపించడంలో సాహిత్యానికి మించిన సాధనం లేదని తెలిపారు. తెలుగు సాహిత్యాన్ని తమ రచనలతో సుసంపన్నం చేసిన ఎంతోమంది రచయితలు పుట్టిన గడ్డపై పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. జీవన సాఫల్య పురస్కారాలు పొందిన మంగాదేవి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యతోనే ఉత్తమ పౌరులను అందించేందుకు అవకాశముంటుందన్నారు. మరో పురస్కార గ్రహీత వంశీ రామరాజు మాట్లాడుతూ దివ్యాంగుల సేవకుగాను తనను ఈ అవార్డుకు ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు.

సీఎం ప్రచార రథం సిద్ధం

- రెండు వైపులా ఎల్ఈడీ స్క్రీన్లు
- పథకాలు.. అభివృద్ధిని తెలిపే చిత్రాలు
- వెలుగులు విరజిమ్మే ఫ్లడ్‌లైట్లు
- అదిరిపోయే సౌండ్ సిస్టమ్
- లోకేశ్ కోసం మరో వాహనం సిద్ధం





సీఎం కోసం సిద్ధం చేసిన వాహనం, బిగించిన ఫ్లడ్ లైట్లు, సీసీ కెమెరాలు

గుంటూరు నల్లచెరువు: సార్వత్రిక ఎన్నికల సమరం దగ్గర పడుతోంది. ఎన్నికల ప్రచార పర్వంలో దూసుకుపోయేందుకు నేతలంతా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా ప్రచారానికి ఉపయోగించే వాహనాల తయారీలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎన్నికల ప్రచార రథాలను తయారు చేయడంలో ఇరవై ఏళ్ల అనుభవం ఉన్న గుంటూరులోని జయలక్ష్మీ మోటార్స్ ఈ పనుల్లోనే నిమగ్నమైంది. సీఎం చంద్రబాబు, నారా లోకేశ్‌తోపాటు మరో 25 మంది ఎంపీ అభ్యర్థులు వాహనాల తయారీ కోసం ఈ సంస్థకు ఆర్డర్లు ఇచ్చారు. జయలక్ష్మీ డిజైనర్స్ అధినేత నారయ్య చౌదరి ఆధ్వర్యంలో డిజైనర్ అట్లూరి ప్రసాద్ ఈ వాహనాల తయారీలో బిజీగా ఉన్నారు. సీఎం చంద్రబాబు కోసం భారీ ఐషర్ వాహనాన్ని ప్రచార రథంగా సిద్ధం చేస్తుండగా.. టీడీపీ ప్రకాశం జిల్లా నాయకుడు గొట్టిపాటి రవికుమార్ కోసం పూర్తి ఎలక్ట్రానిక్ ఎల్ఈడీ ప్రచార రథాన్ని తొలిసారి సిద్ధం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు సూచనల మేరకు జయలక్ష్మీ మోటార్స్ ప్రత్యేక ప్రచార రథాన్ని సిద్ధం చేసింది. ఐషర్ కంపెనీకి చెందిన వాహనం బాడీని తీసుకుని దాన్ని 15 రోజుల్లో ప్రచార రథంగా సిద్ధం చేసినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. మరో రెండు రోజుల్లో సీఎంకు అందజేయనున్న ఈ వాహనంలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి.

ఇవీ ప్రత్యేకతలు..

- ఇప్పటి వరకు చిన్న చిన్న వాహనాలనే ప్రచార రథాలుగా సిద్ధం చేస్తున్న జయలక్ష్మీ డిజైనర్స్ తొలిసారిగా భారీ ఐషర్ వాహనాన్ని ప్రచార రథంగా సిద్ధం చేసింది.
- ఈ వాహనానికి ఇరువైపులా నాలుగు అడుగుల వెడల్పు, మూడు అడుగుల ఎత్తు కలిగిన ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వీడియోలను ప్రసారం చేయొచ్చు.
- వాహనానికి నాలుగు వైపులా అత్యాధునిక సౌండ్ సిస్టమ్స్ ఉంటాయి.
- వాహనం చుట్టూ ఈ నాలుగున్నర ఏళ్లలో చంద్రబాబు చేసిన అభివృద్ధి కార్యక్రమాల, సంక్షేమ పథకాల చిత్రాలను ముద్రించారు.
- వాహనం మీద ఉన్న వారికి కింద ఉన్నవారు రాత్రి వేళ సైతం స్పష్టంగా కనిపించేలా భారీ ఎల్ఈడీ ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు.
- ఎల్ఈడీ స్క్రీన్లకు, ఫ్లడ్ లైట్లకు విద్యుత్ అందించేందుకు అత్యంత సామర్థ్యం కలిగిన జనరేటర్ ఉంటుంది.
- వాహనంపైకి తేలిగ్గా ఎక్కేందుకు రెండు అంచెలుగా మెట్లు ఏర్పాటు చేశారు. వాహనంపై ఒకేసారి 25-30 మంది నిలబడేలా స్థలం ఉంటుంది.

మోదీది దురహంకార పాలన

- ఎస్సీ వర్గీకరణ పక్కనపెట్టి ఓసీ రిజర్వేషనా?
- అప్పుడు మద్దతిచ్చి ఇప్పుడు జగన్ ఎందుకు పెదవి విప్పటంలేదు!
- ఫిబ్రవరిలో మరోసారి మాదిగ విశ్వరూప మహాసభ
- మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర సభలో మందకృష్ణ



మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర సభలో చేతులు కలిపిన మందకృష్ణ తదితరులు

తెనాలి, జనవరి 19, (ఆంధ్రజ్యోతి): రెండున్నర దశాబ్దాలుగా పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పక్కనపెట్టి, ఏ కమిషన్ వేయకుండానే ఓసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదింపచేసిన ప్రధాని నరేంద్ర మోదీది దురహంకార పాలనే అవుతుందని, రాష్ట్రంలోని ప్రతిపక్ష నేత జగన్ కూడా ఈ విషయంలో దోషిగా మిగిలిపోతున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. గుంటూరు జిల్లా తెనాలిలో శనివారం రాత్రి మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి సమావేశం పి.జె.రత్నాకర్ మాదిగ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మందకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అపహాస్యం అయ్యేలా మోదీ పాలన ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో అనేక కమిషన్‌లు వర్గీకరణ చెయ్యాలని సిఫార్సులు చేస్తే వాటిని బుట్టదాఖలు చేసి...ఏ కమిషన్ కానీ, ఏ కమిటీ కానీ, చివరకు రాజకీయ పార్టీ అభిప్రాయం కానీ తీసుకోకుండా, ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఓసీ వర్గీకరణ చేయటం మోదీకే సాధ్యమయిందన్నారు. ఓసీ రిజర్వేషన్‌లకు తాము వ్యతిరేకం కాదని, అయితే ఎస్సీ వర్గీకరణ పక్కనపడేసి ఎన్నికల కోసం మోదీ చేస్తున్న అప్రజాస్వామిక చర్యలను మాత్రమే వ్యతిరేకిస్తున్నామన్నారు. గతంలో వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వర్గీకరణపై అసెంబ్లీలో ఆమోదించి పార్లమెంటుకు పంపితే, అప్పుడు ఎంపీగా ఉన్న జగన్‌మోహనరెడ్డి మద్దతిచ్చారని, ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ వర్గీకరణపై ఎందుకు పెదవి విప్పటంలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. పైగా వర్గీకరణ సాధ్యంకాదని ఆయనే చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో మాదిగల విశ్వరూప మహాసభ రాష్ట్రంలో పెడితే అడ్డుకున్న చంద్రబాబుకు మాదిగలపై చిత్తశుద్ధి ఉందోలేదో నిరూపించుకోవాలని, ఫిబ్రవరి 19న మాదిగల ఉనికిని తెలియచెప్పేందుకు అమరావతిలో మరోసారి విశ్వరూప మహాసభను పెడుతున్నామన్నారు. మహాసభ తర్వాత అన్ని రాజకీయ పార్టీల నేతలతో కలసి మద్దతు కూడగడతామని వెల్లడించారు.

ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్ నుంచి రేడియో ధార్మిక పదార్థం మాయం

- అది గాలిలో కలిస్తే ప్రాణాంతకమే...
- రంగంలోకి పోలీసులు, విపత్తుల నిర్వహణ శాఖ

రాజమహేంద్రవరం క్రైం, జనవరి 19: ఆ పదార్థం వాతావరణంలో కలిస్తే మూగజీవాలతోపాటు, మనుషులకూ ప్రమాదమే. ప్రాణాంతకమే. అత్యంత వేగంగా గాలిలో కలిసిపోయి, ఆలస్యంగా తన విష ప్రభావాన్ని ప్రాణులపై చూపించే ఆ తెల్లటి పదార్థాన్ని అత్యంత జాగ్రత్తగా, భద్రత నడుమ ప్రత్యేక అవసరాల కోసం వినియోగిస్తారు. అంతటి ప్రమాదకర క్షార లోహాన్ని నిల్వ ఉంచిన కంటైనర్ మాయమయ్యింది. రాజమహేంద్రవరంలోని ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్ నుంచి మాయమైన ఆ రేడియో ధార్మిక పదార్థం కోసం పోలీసులు జల్లెడపడుతున్నారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అధికారులూ రంగంలోకి దిగారు.

ఆ పదార్థం ఏమిటి?

యురేనియం... అణుబాంబుల్లో ఉపయోగించే ఒకానొక ప్రమాదకర రేడియోధార్మిక పదార్థం. చెర్నోబిల్ అణురియాక్టర్ ప్రమాదం సమయంలో, హిరోషిమా, నాగసాకిపై ఆటంబాంబులు వేసినప్పుడు యురేనియం అణువిచ్ఛితి జరిగి పెను విస్ఫోటం ఏర్పడింది. అప్పుడు వెలువడిన అనేకానేక రేడియోధార్మిక మూలకాల్లో సీజీఎం 134, 137లు కొన్ని మాత్రమే. కొన్ని తరాల వరకూ వాటి దుష్ప్రభావం ఎలాగుంటుందో మనమంతా చూశాం. అంతటి ప్రమాదకరమైన సీజీఎం 137ను నిల్వ ఉంచిన కంటైనర్ ఓఎన్‌జీసీ బేస్ క్యాంపు నుంచి మాయమయ్యింది.

దేనికి ఉపయోగిస్తారు?

అణ్వస్త్రాల తయారీలోనూ, పారిశ్రామిక రంగంలోనూ దీనిని ఉపయోగిస్తారు. కొన్ని వేల అడుగుల కింద ఉండే చమురు, సహజవాయు నిక్షేపాలను కనుకునేందుకు సీజీఎం 137 ఉపయోగపడుతుంది. దీనిని అత్యంత జాగ్రత్తగా భూమి లోపలికి పంపించినప్పుడు.. దాని నుంచి వెలువడే గామా కిరణాలు నిక్షేపాల ఉనికిని కనుక్కోవడానికి, డ్రిల్లింగ్ దిశ మారకుండా మార్గనిర్దేశన చేయడానికి ఉపయోగపడుతుంది. ఈ నెల 12న దీనిని కృష్ణా జిల్లాలోని మల్లేశ్వరం డ్రిల్లింగ్ సైట్‌కు తీసుకుని వెళ్లారు. అక్కడ ఉపయోగించకపోవడంతో తిరిగి 14న రాజమహేంద్రవరం బేస్ కాంప్లెక్స్‌కు తెచ్చారు. రెండు రోజుల పాటు దానిని స్టోర్ రూంలో భద్రపరచకుండా ఒదిలేశారు. 16వ తేదీని సిబ్బంది సీజీయం 137ను నిల్వ ఉంచన కంటైనర్ మిస్ అయినట్లు గుర్తించారు. దీనితో బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైంది అత్యంత ప్రమాదకరమైన రేడియో ధార్మిక పదార్థ కావడంతో ఎస్పీ షెమోషీ బాజ్‌పాయ్ స్వయంగా రంగంలోకి దిగారు.

తిరుమలేశుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల, జనవరి 19: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌ప్రసాద్ శనివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన న్యాయమూర్తికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఏపీ పోలీసు అసోసియేషన్ రద్దు

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర పోలీసు అధికారుల సంఘాన్ని డీజీపీ ఆర్పీ ఠాకూర్ శనివారం రద్దు చేశారు. పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైన ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తే... 2014లో రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి ఏర్పాటైన కమిటీ కాల పరిమితి 2017తో పూర్తి అయింది. నాలుగున్నరేళ్లు గడిచినా ఇప్పటికీ అదే కమిటీ అధికారికంగా వ్యవహరిస్తోంది. మరోవైపు పోలీసు అధికారుల సంఘం ఎన్నికల నిర్వహణపై పలు జిల్లాల నుంచి పోలీసులు డీజీపీ ఆర్పీ ఠాకూర్‌కు విన్నవించారు. ఈ క్రమంలో ఇటీవల జిల్లాల వారీగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్నికయ్యారు. వీరందరూ కలిసి రాష్ట్ర అధ్యక్షుడు, ఇతర గవర్నింగ్ బాడీని ఎన్నుకోవాల్సి ఉండగా, అనంతపురం జిల్లాకు చెందిన ఓ పోలీసు కోర్టును ఆశ్రయించారు. పోలీసు అధికారుల రాష్ట్ర సంఘం ఎన్నికలు బైలా ప్రకారం జరగలేదని, దీనిపై స్టే ఇవ్వాలని కోరడంతో న్యాయస్థానం తాత్కాలిక స్టే ఇచ్చింది. ఇదే సమయంలో తాము రాష్ట్ర కమిటీ అంటూ నాలుగున్నరేళ్లుగా కొనసాగిన కమిటీ సభ్యులు పోలీసులకు వాట్సాప్ సందేశాలు పంపడం ప్రారంభించారు. దీనిపై పలు జిల్లాల నుంచి డీజీపీకి ఫిర్యాదులందాయి. దీంతో పాత కమిటీని రద్దుతోపాటు, పోలీసు సంక్షేమ నిధులు వినియోగించరాదని డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

రేపటి నుంచి 'ఎస్ఐ' దేహదారుఢ్య పరీక్షలు

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగార్థుల దేహదారుఢ్య పరీక్షలు సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు రాష్ట్రస్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ కుమార్ విశ్వజీత్ తెలిపారు. గత ఏడాది నవంబరు 1న విడుదల చేసిన ఎస్ఐ నోటిఫికేషన్‌లో భాగంగా ప్రాథమిక ప్రవేశ పరీక్షలో 51,926 మంది అర్హత సాధించారని చెప్పారు. వీరిలో.. 12,703 మంది ఉత్తరాంధ్ర ప్రాంత అభ్యర్థులకు ఈ నెల 21 నుంచి ఫిబ్రవరి 4వరకు విశాఖపట్నంలో, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన 12,868 మందికి ఏలూరులో ఫిబ్రవరి 5వరకు, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన 9,434 మందికి ఫిబ్రవరి 1వరకు, రాయలసీమ అభ్యర్థులు 16,921 మందికి కర్నూలులో ఫిబ్రవరి 9వరకు ఫిట్‌నెస్, మెడికల్ పరీక్షలు నిర్వహిస్తామని విశ్వజీత్ వివరించారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి: యూటీఎఫ్

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి.బాబురెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని కేడర్ల ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. విజయవాడలో శనివారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ .. విద్యా రంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. 35 శాతం ఐఆర్, మున్సిపల్ టీచర్లకు పీఎఫ్ ఖాతాలు, నియోజక వర్గానికి ఒక డీవైఈఓ పోస్టు, 500 మంది పిల్లలు దాటిన ఉన్నత పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ వంటివి ప్రారంభించాలని కార్యవర్గం తీర్మానించింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఐ.వెంకటేశ్వరరావు, కె.ఎస్.లక్ష్మణరావులను గెలిపించాలని విజ్ఞప్తి చేసింది.

కొత్త వాహనాలకే థర్డ్‌పార్టీ బీమా: కేంద్రం

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు థర్డ్ పార్టీ బీమా కల్పించే విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్రాలకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ మంత్రిత్వశాఖ లేఖలు రాసింది. సుప్రీం ఆదేశాల నేపథ్యంలో.. కొన్ని రాష్ట్రాలు, కొత్తవాటితో పాటు పాత వాహనాలకు కూడా బలవంతంగా మూడేళ్ల పాటు కొనసాగే థర్డ్‌పార్టీ బీమాను అమలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో సుప్రీం తీర్పులోని అంశాలపై మరింత స్పష్టతనిస్తూ కేంద్ర రోడ్డు రవాణా డిప్యూటీ కార్యదర్శి రమణ్‌దీప్ చౌదరి రాష్ట్రాలకు లేఖలు రాశారు. 'కొన్ని రాష్ట్రాలు పాత బస్సులు, ట్రక్కులు, నిర్మాణ రంగంలో ఉపయోగించే వాహనాలకు మూడేళ్ల థర్డ్‌పార్టీ బీమాను తప్పనిసరి చేశాయని తెలిసింది. కానీ సుప్రీం కోర్టు కొత్త కార్లకు మూడేళ్లు, కొత్త ద్విచక్ర వాహనాలకు ఐదేళ్ల థర్డ్‌పార్టీ బీమా ఉండాలని ఆదేశించింది. ఇది రవాణాతోపాటు రవాణేతర వాహనాలకు కూడా వర్తిస్తుందని ఇంతకు ముందే స్పష్టంచేశాం. కనుక ట్రక్కులు, బస్సులు, నిర్మాణ రంగ వాహనాలు, ఇతర రవాణా వాహనాలు ఆ జాబితాలో చేర్చలేదు' అని లేఖలో స్పష్టం చేశారు.

ఈబీసీ రిజర్వేషన్‌పై సుప్రీంకోర్టుకు: కేసన

గుంటూరు, జనవరి 19: రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్ కల్పించటంపై బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వచ్చే వారంలో సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. గుంటూరులో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయకుండా అనర్హులైన అగ్రవర్ణ పేదలకు ఎలా రిజర్వేషన్‌లు కల్పిస్తారని ప్రశ్నించారు. శతాబ్దాలుగా సామాజిక అన్యాయానికి గురవుతోన్న బీసీ కులాలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించకుండా, విద్య, ఉద్యోగ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం 52 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు.

సీమాంధ్ర ద్వేషుల పంచన జగన్!

- ఆంధ్రులపై కేసీఆర్ దుర్భాషలు.. వైసీపీది ధన రాజకీయం
- 25 ఎంపీ.. 150 అసెంబ్లీ సీట్లు గెలవాలి
- పార్టీ శ్రేణులకు చంద్రబాబు పిలుపు

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని కాలరాసిన వ్యక్తులు, పార్టీల పంచన చేరి జగన్ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారని తెలుగుదేశం అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. వరంగల్‌లో (మహబూబాబాద్) తనపై రాళ్లేసిన వారితో జగన్ లాలూచీ పడ్డారని... కేసుల కోసం మోదీతో, అక్రమాస్తులు కాపాడుకునేందుకు కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని విమర్శించారు. శనివారం ఉదయం ఆయన కోల్‌కతా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. "కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవిత తదితర టీఆర్ఎస్ నేతలు ఆంధ్ర ప్రాంత ప్రజలపై తీవ్రమైన ద్వేషం ప్రదర్శించారు. నోటికి వచ్చినట్లుగా మాట్లాడి సీమాంధ్రుల మనసులను గాయపరిచారు. అవన్నీ ప్రజలకు గుర్తు చేయండి. వారు వాడిన మాటలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లండి. ఇప్పుడు వారితో అంట కాగుతున్న జగన్ వైఖరిని కూడా ప్రజల్లో ఎండగట్టండి" అని పార్టీ శ్రేణులకు సూచించారు. వైసీపీ డబ్బులు ఖర్చుపెట్టే అభ్యర్థుల కోసం వెతుకుతోందని చంద్రబాబు చెప్పారు. "వైసీపీ అభ్యర్థులు ప్రజల్లో ఉండరు. డబ్బులో ఉంటారు. డబ్బులతోనే జగన్ రాజకీయం. గతంలో జలయజ్ఞాన్ని ధన యజ్ఞంగా చేసినట్లే ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా చేస్తున్నారు" అని విమర్శించారు.

ఏమరుపాటు వద్దు...

ఒక చారిత్రాత్మక మలుపులో ఉన్నామని, ఈ సమయంలో ఏమరుపాటు పనికిరాదని పార్టీ నేతలను చంద్రబాబు అప్రమత్తం చేశారు. "బాగా ఆదాయం ఉన్న తెలంగాణ రాష్ట్రంలో పల్లెలు ఎలా ఉన్నాయి? పట్టణాల్లో అభివృద్ధి ఏం జరిగింది? ఆదాయం లేకున్నా ఆంధ్రప్రదేశ్‌లో పల్లెలు, పట్టణాల్లో ఎలా వసతులు పెంచాం... ఇవన్నీ గమనించండి. ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి భారీగా నిధులు ఇచ్చాం. ముస్లిం సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చాం. ప్రతి కార్యకర్త ఒక ప్రచార మాధ్యమంలా మారి ఈ విషయాలు ప్రజలకు వివరించాలి. వచ్చే ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం అందుకోవాలి. పాతిక ఎంపీ సీట్లు, 150 అసెంబ్లీ సీట్లు గెలుచుకోవాలి" అని సూచించారు.

మొండి చెయ్యే స్పెషల్ ట్రీట్‌మెంటా?: ఆంధ్రప్రదేశ్‌కు స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇచ్చామని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన ప్రకటనపై చంద్రబాబు మండిపడ్డారు. "29సార్లు ఢిల్లీ వెళ్తే మొండి చెయ్యి చూపడమే స్పెషల్ ట్రీట్‌మెంటా? గాయాలపై కారం చల్లడమే స్పెషల్ ట్రీట్‌మెంటా?" అని నిలదీశారు. బీజేపీ వెంట ఉన్నందునే కోల్‌కతా ర్యాలీకి కేసీఆర్, జగన్ రాలేదని చంద్రబాబు తెలిపారు. "ఫెడరల్ ఫ్రంట్ అనేది అసలు లేదు. అదొక శూన్యం. మోదీకి మద్దతు కోసమే సృష్టిస్తున్నారు. అది బీజేపీకి మిత్ర పక్షం" అని అన్నారు.

'అసెంబ్లీ' వల్లే మమత ర్యాలీకి దూరం

- ఇకపై జాతీయ రాజకీయాల్లో చురుకుగా కేసీఆర్: కవిత

హైదరాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల వల్లే పశ్చిమబెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కోల్‌కతాలో నిర్వహించిన ర్యాలీకి దూరంగా ఉన్నామని టీఆర్ఎస్ ఎంపీ కల్వకుంట్ల కవిత తెలిపారు. రెండోసారి టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక శాసనసభ సమావేశాలు తొలిసారి జరుగుతుండటం, స్పీకర్ ఎన్నికతోపాటు పలు కార్యక్రమాల నేపథ్యంలో సభా నాయకుడిగా కేసీఆర్ ఇక్కడ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దీంతో తమ పార్టీ నుంచి ఎవరూ ఆ ర్యాలీకి హాజరు కాలేదన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బీజేపీయేతర, కాంగ్రెసేతర ప్రత్యామ్నాయం భారతదేశానికి అవసరమని సీఎం కేసీఆర్ చెప్పారని ఆమె గుర్తు చేశారు. దేశ ప్రజలిచ్చిన అవకాశాలను ఆ రెండు పార్టీలు దుర్వినియోగం చేశాయన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో తమ పార్టీ జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్రను పోషించబోతోందని చెప్పారు. కేసీఆర్ కూడా జాతీయ రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటారని, ఆయన ప్రతిపాదించిన ఫెడరల్ ఫ్రంట్ మంచి రూపాన్ని సంతరించుకుంటోందన్నారు. ఎన్నికలకు ముందు, తర్వాత జాతీయ రాజకీయాల్లో చాలా మార్పులుంటాయని కవిత అన్నారు. ప్రజల జీవితాలను మార్చే అజెండాను ఫెడరల్ ఫ్రంట్‌లో తాము ప్రతిపాదిస్తున్నామన్నారు. రిజర్వేషన్లు లేకపోవడం వల్ల రాజకీయాల్లోకి వచ్చే మహిళలకు అడ్డంకులు వస్తున్నాయని, అవి పోవాలని ఆమె అన్నారు.

లూటీదార్ల ఆర్తనాదాలవి

దోపిడీదారులంతా జత కట్టారు.. లూటీని అడ్డుకున్నందుకే నాపై కక్ష.. అది ప్రజా వ్యతిరేక మహా'కూటమి'

- నేను అందరి మేలు కోసం పనిచేస్తున్నా
- విపక్షాల ర్యాలీపై మోదీ విమర్శలు

సిల్వాస, జనవరి 19: మహాకూటమి తనకు మాత్రమే వ్యతిరేకం కాదని.. దేశానికే వ్యతిరేకమని ప్రధాని మోదీ ఆరోపించారు. "వాళ్లు సాయం కోసం ఏడుస్తున్నారు. కోల్‌కతా నుంచి 'కాపాడండి.. కాపాడండి..' అని ఆర్తనాదాలు చేస్తున్నారు. వారంతా కోల్‌కతాలో ఎందుకు కలిశారో తెలుసా..? అవినీతిపై నా చర్యలు కొందరికి ఇబ్బందికరంగా మారాయి. ప్రజాధనాన్ని లూటీ చేయకుండా అడ్డుకుంటున్నానని నాపై వాళ్ల ఆగ్రహం" అని మోదీ శనివారం సిల్వాసలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ధ్వజమెత్తారు. కేంద్ర పాలిత ప్రాంతం దాద్రానగర్ హవేలీలో వైద్య కళాశాలకు శంకుస్థాపన చేయడంతో పాటు ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన భారీగా హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అసలు ఇప్పటి వరకు కూటమే పూర్తిగా ఏర్పడలేదని, భాగస్వామ్య పక్షాల నేతలంతా తమలో ఎవరికి ఏం దక్కుతుందనే విషయంలో బేరసారాలు మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. 'సేవ్ ఇండియా, సేవ్ డెమోక్రసీ' అన్న మమత నినాదాన్ని ప్రస్తావిస్తూ.. తన సొంత రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసిన వారే ఇప్పుడు ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి బోధించడం విడ్డూరంగా ఉందని.. బెంగాల్‌లో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలే అందుకు నిదర్శనమని మోదీ పేర్కొన్నారు. తాను 'అందరితో కలిసి.. అందరి మేలు కోసం (సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్)' పనిచేస్తుండగా.. ప్రతిపక్షాలు మాత్రం తమను తాము కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని ప్రధాని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వాల విధానాలన్నీ ఒక్క కుటుంబం ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అమలు చేసినవేనని ఆరోపించారు. తమ ప్రభుత్వం ప్రారంభించిన పథకాలు మాత్రం దేశ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించినవని చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో మమత నేతృత్వంలోని తృణమూల్ సర్కారు కేవలం ఒకే ఒక్క బీజేపీ ఎమ్మెల్యే వల్ల నిద్ర లేని రాత్రులు గడపాల్సి వస్తోందని.. బీజేపీ సత్తా అంటే అదేనన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 25 లక్షల ఇళ్లు మాత్రమే నిర్మించగా.. గడిచిన ఐదేళ్లలో తాము 1.25 కోట్ల ఇళ్లు నిర్మించామని వెల్లడించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ పథకం ఆయుష్మాన్ భారత్‌ను ప్రారంభించామని, దీన్నే 'మోదీ కేర్' అంటున్నారని చెప్పారు.



ముంబైలోని 'నేషనల్ మ్యూజియం ఆఫ్ ఇండియన్ సినిమా'లో గాంధీ విగ్రహం వద్ద ప్రధాని మోదీ

పదిలక్షల సమస్యలకు.. వందకోట్ల పరిష్కారాలు

ప్రధాని మోదీ ముంబైలో శనివారం 'నేషనల్ మ్యూజియం ఆఫ్ ఇండియన్ సినిమా'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినిమా, సమాజం ఒకదానికొకటి ప్రతిరూపాలన్నారు. సినిమాలాగానే ప్రస్తుతం భారత్ కూడా కాలంతో పాటు మారుతోందని చెప్పారు. "దేశం మారుతోంది. అదే సమయంలో తన సొంత పరిష్కారాలను కూడా గుర్తిస్తోంది. పది లక్షల సమస్యలు ఉంటే.. వంద కోట్ల పరిష్కారాలు కూడా ఉంటాయి" అని మోదీ చెప్పారు.

మీ నేత ఎవరో చెప్పగలరా?: రూడీ

న్యూఢిల్లీ, జనవరి 19: టీఎంసీ ఆధ్వర్యంలో శనివారం కోల్‌కతాలో జరిగిన విపక్షాల ఐక్య ర్యాలీని ఓ స్వార్థ శక్తుల సమ్మేళనంగా.. సిద్ధాంతాల పరంగా వైరుధ్యాలున్న పార్టీల కలయికగా బీజేపీ అభివర్ణించింది. వచ్చే ఎన్నికల్లోనూ తామే గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేసింది. యునైటెడ్ ఇండియా పేరుతో నిర్వహించిన సభలో నాయకత్వలేమి స్పష్టమైందని విమర్శించింది. ఇలాంటి సభల ద్వారా వచ్చే ఎన్నికల్లో బీజేపీకి నష్టం జరుగుతుందనే అంచనాలను ఆ పార్టీ అధికార ప్రతినిధి రాజీవ్ ప్రతాప్ రూడీ కొట్టిపారేశారు. ప్రధాని మోదీని వ్యతిరేకించే ప్రయత్నాల్లో భాగంగానే విపక్షాలు ఈ సభను నిర్వహించాయని.. ఆయన పనితనాన్ని ప్రజలు చూశారని వచ్చే ఎన్నికల్లోనూ బీజేపీ పూర్తి మెజారిటీతో అధికారంలోకి రావడం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 'ఫ్రంట్ అంటున్నారు కదా.. మరి, ములాయం, అఖిలేశ్, మమతల్లో మీ నేత ఎవరు?' అని ఆయన ప్రశ్నించారు. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కొత్త ఫ్రంట్ గురించి మాట్లాడుతున్నారని.. ఇది రెండో ఫ్రంటో, మూడో ఫ్రంటో కావచ్చునేమో తనకైతే తెలియదని ఎద్దేవా చేశారు. కాగా విపక్షాల ర్యాలీలోని నేతల పరిస్థితి చూస్తుంటే మల్లయుద్ధంలో ఓడి.. తీవ్రంగా అలసిపోయిన రెజ్లర్లు మళ్లీ అదృష్టం కోసం అఖాడాలోకి దిగినట్లు ఉందని కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ ఎద్దేవా చేశారు.

కొనసాగుతున్న 'కర్ణాటకం'

- రిసార్టులోనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

బెంగళూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో రాజకీయ హైడ్రామా కొనసాగుతోంది. విపక్షం బీజేపీ వారం రోజుల రిసార్టు రాజకీయానికి స్వస్తి పలకాలని భావిస్తుండగా.. కాంగ్రెస్ మాత్రం రెండో రోజూ ఎమ్మెల్యేలను రిసార్టులోనే ఉంచి బుజ్జగింపుల పర్వాన్ని కొనసాగిస్తోంది. ప్రస్తుతం గురుగ్రాంలో ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలందరూ బెంగళూరుకు వచ్చే వరకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రిసార్టులోనే ఉంచాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇక, కాంగ్రెస్ సీఎల్పీ తొలిరోజున గైర్హాజరైన ఎమ్మెల్యేలు మహేశ్ కుమటహళ్లి, ఉమేశ్‌జాదవ్, నాగేంద్ర, రమేశ్ జార్కిహొళిలు ముంబైలో ఉన్నట్లు తెలుస్తోంది. రమేశ్ జార్కిహొళి కాంగ్రెస్ లోకి వాపసు వచ్చేందుకు కొత్త మెలిక పెట్టారు. తనను మంత్రి పదవి నుంచి తొలగించారని అదే రీతిన డీకే శివకుమార్‌ను కూడా మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఇక, ఈ నలుగురు ఎమ్మెల్యేలు సోమవారం రాజీనామా చేసే అవకాశం ఉందని ప్రచారం సాగుతుండగా ఈ అంశం తన దృష్టికి రాలేదని స్పీకర్ వెల్లడించారు. మరోపక్క, 'ఆపరేషన్ కమల' సద్దుమణిగిందని హైదరాబాద్ వెళ్లిన పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ వేణుగోపాల్ చెప్పారు. ఎమ్మెల్యేలతో బుజ్జగింపులు సాధ్యంకాని పక్షంలో హెచ్చరికలకు వెనుకాడకూడదనే రీతిలోనూ వేణుగోపాల్ ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలో సిద్దరామయ్య ప్రమేయం ఉందని కేంద్రమంత్రి సదానందగౌడ ఆరోపించారు.

ఈవీఎంలపై విపక్ష కమిటీ

- త్వరలో సిఫారసులు: మమత

కోల్‌కతా, జనవరి 19: ఎన్నికల సంస్కరణలపై ప్రతిపక్షాలకు చెందిన నలుగురు సభ్యులతో ఒక కమిటీ ఏర్పాటైంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం) ద్వారా బీజేపీ అక్రమాలకు పాల్పడుతున్నట్లుగా ఆరోపించిన ప్రతిపక్షాలు ఈ మేరకు ఒక కమిటీని ఏర్పాటు చేశాయి. పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ శనివారం ఇక్కడ ఈ విషయం ప్రకటించారు. ఈవీఎంల పనితీరును అంచనావేయడంతోపాటు, అక్రమాలకు అడ్డుకట్ట వేయడంపై ఈ కమిటీ పనిచేస్తుందని ఆమె చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోగా తీసుకురావాల్సిన ఎన్నికల సంస్కరణలను ఈ కమిటీ ఎన్నికల సంఘాని(ఈసీ)కి నివేదిస్తుందని ఆమె తెలిపారు. ప్రతిపక్షాల ఐక్య ర్యాలీకి హాజరైన 14 విపక్షాల అగ్రనాయకులకు తేనీటి విందు ఇచ్చిన తర్వాత మమత ఈ విషయం చెప్పారు. అభిషేక్ మను సింఘ్వీ(కాంగ్రెస్), అఖిలేశ్ యాదవ్(ఎస్పీ), సతీశ్ మిశ్రా(బీఎస్పీ), అరవింద్ కేజ్రీవాల్(ఆప్)లతో కూడిన ఈ కమిటీ ఈసీకి తన సిఫారసులు చేస్తుంది. వీవీప్యాట్‌లను మరింత విస్తృతంగా వినియోగించాలని కోరుతామన్నారు.



66 మంది సజీవదహనం

మెక్సికోలో పేలిన ఇంధన పైప్‌లైను

ట్లాహ్యాలిల్పా, జనవరి 19: మెక్సికోలో ఇంధన పైపులైన్ లీకేజీతో సంభవించిన పేలుడులో 66 మంది దుర్మరణం పాలయ్యారు. హిదాల్గో రాష్ట్రం ట్లాహ్యాలిల్పా పట్టణంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మెక్సికో ప్రభుత్వ రంగ చమురు సంస్థ 'పెమెక్స్'కు చెందిన గ్యాసోలిన్ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. ఆ ఇంధనాన్ని పట్టుకునేందుకు స్థానికులు ఉరుకులు పరుగుల మీద అక్కడికి చేరుకున్నారు. గ్యాసోలిన్‌ను క్యాన్లలో నింపుతుండగా పేలుడు సంభవించింది. ఆ పరిసరాలను ఒక్కసారిగా భీతావహ పరిస్థితి అలుముకుంది. పేలుడు ధాటికి 21 మంది అక్కడికక్కడే మృతిచెందారు. మరో 45 మంది ఆస్పత్రుల్లో చికిత్సపొందుతూ కన్నుమూశారు. స్థానికంగా ఉన్న వివిధ ఆస్పత్రుల్లో మరో 76 మంది చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలాన్ని మెక్సికో అధ్యక్షుడు ఆండ్రెజ్ మాన్యుయెల్ లోపెజ్ ఆబ్రడార్ పరిశీలించి, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు వోల్ఫ్-బ్లడ్-సూపర్‌మూన్

- అమెరికా, బ్రిటన్, నార్వే, ఫ్రాన్స్ దేశాల్లో కనువిందు

కేప్ కానవెరల్, జనవరి 18: ఆకాశంలో మరో మారు అరుదైన దృశ్యం కనువిందు చేయనుంది. సుదీర్ఘ సంపూర్ణ చంద్రగ్రహణం.. వోల్ఫ్-బ్లడ్-సూపర్ మూన్‌గా ఆకట్టుకోనుంది. ఆయా దేశాలను బట్టి ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు గ్రహణం కొనసాగనుంది. భూమికి బాగా దగ్గరగా వస్తున్నందున చంద్రుడు ఎప్పటి కంటే కొంచెం పెద్దగా, ప్రకాశవంతంగా కనిపిస్తాడు. అందుకే దీన్ని సూపర్‌మూన్ అంటారు. సుమారు గంటకుపైగా సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనుంది. సంపూర్ణ చంద్రగ్రహణం సమయంలో సూర్యకిరణాలు భూవాతావరణం మీదుగా చంద్రుడిపైకి పరావర్తనం చెందడం వల్ల చంద్రుడు ఎర్రగా కూడా కనిపిస్తాడు. అందుకే దీన్ని బ్లడ్ మూన్ అని కూడా పిలుస్తారు. అలాగే జనవరిలో పౌర్ణమి చంద్రుడిని వోల్ఫ్ మూన్ అని పిలుస్తారు. అందువల్ల ఈ చంద్రగ్రహణాన్ని మొత్తంగా వోల్ఫ్, బ్లడ్, సూపర్‌మూన్ అని పిలుస్తున్నారు. ఉత్తర, దక్షిణ అమెరికా, గ్రీన్‌ల్యాండ్, ఐస్‌ల్యాండ్, ఐర్లాండ్, గ్రేట్ బ్రిటన్, నార్వే, స్వీడన్, పోర్చుగల్, ఫ్రాన్స్, స్పెయిన్ తీరాల్లో సంపూర్ణ చంద్రగ్రహణం కనిపించనుందని అమెరికాలోని రైస్ యూనివర్సిటీ ఖగోళ భౌతికశాస్త్రవేత్త పాట్రిక్ హార్టిగన్ తెలిపారు. యూరప్‌లోని మిగిలిన దేశాలు, ఆఫ్రికా దేశాల్లో మాత్రం పాక్షిక గ్రహణం కనిపిస్తుందని చెప్పారు. భారత్‌లో ఇది కనిపించే అవకాశం లేదు.

చైనా దూసుకొస్తోంది.. జాగ్రత్త!

కృత్రిమ మేధలో, ఆధునిక యుద్ధ పరిజ్ఞానంలో ప్రావీణ్యం.. అమెరికాకే చెమటలు పట్టిస్తోంది

- ఇది మనకు హెచ్చరిక
- రహస్య సాంకేతికత అభివృద్ధి కావాలి
- ప్రతికూల పరిస్థితుల్లో పనిచేసే టెక్నాలజీ రావాలి
- సైనిక దళాల ఉపాధ్యక్షుడు హసాన్‌బిస్

హైదరాబాద్, జనవరి 19: కృత్రిమ మేధ, సైబర్ యుద్ధతంత్రాలు- టెక్నాలజీల్లో చైనా దూసుకొస్తోందనీ, అమెరికాకే ముచ్చెమటలు పోయిస్తోందని, ఇది భారత్‌కు హెచ్చరిక కావాలని దేశ సైన్య ఉన్నతాధికారులు భావిస్తున్నారు. "సైబర్ దాడులు అత్యాధునిక దేశాలైన అమెరికా, ఫ్రాన్స్.. మొదలైన చోట్లే సర్వ సాధారణమయ్యాయి. మనం సైబర్ భద్రతలో ఇంకా ముందడుగు వేయాలి. ఇపుడు ఆర్మీకి కావాల్సినది కేవలం సాయుధ సంపత్తి మాత్రమే కాదు. శత్రువు కంటబడని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం. దీన్ని అభివృద్ధి చేసే దిశగా పరిశోధనలు జరగాలి" అని సైనికదళాల ఉపాధ్యక్షుడు లెఫ్టినెంట్ జనరల్ ఎస్ఎస్ హసాన్‌బిస్ పిలుపునిచ్చారు. రక్షణరంగంలో స్వావలంబన అనే అంశంపై శనివారం ప్రారంభమైన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. "సైన్యానికి సాంకేతిక తోడ్పాటు కావాలి. సరిహద్దుకు ఆవల ఏం జరుగుతోందో ఈవైపు నుంచి చూడగలిగే టెక్నాలజీ కావాలి. అది ఉపగ్రహాల ద్వారా కావొచ్చు లేదా డ్రోన్ల ద్వారా కావొచ్చు. ఇవి మాకు అత్యంత కీలకం. లక్ష్యాల్ని సుస్పష్టంగా నిర్దేశించుకోగలగాలి. అంటే దూరశ్రేణి లక్ష్యాలను ఛేదించేటపుడు కావాల్సిన నిర్దుష్టత, సూక్ష్మత అభివృద్ధి కావాలి" అని ఆయన సూచించారు. "ఇన్నేళ్లూ మనం ఆయుధాల సేకరణ అంటే విదేశాల నుంచి కొనుక్కోవడం మీదే ఆధారపడ్డాం. ఇపుడు దేశీయంగా అభివృద్ధి చేయాలి" అన్నారాయన. "అత్యున్నత పర్వత సానువుల్లో, మంచు శిఖరాల్లో మనం యుద్ధం చేయాలి. ఇలాంటి పరిస్థితి ప్రపంచంలో మరే దేశానికీ లేదు. ఈయుద్ధం చేయాలంటే ముందు మనం అక్కడకు చేరుకోగలగాలి. అంటే ఇపుడు కావాల్సినదల్లా ప్రతికూల పరిస్థితుల్లో పనిచేయగల ఉపకరణాలు, ఆయుధ సామగ్రి. పర్వత ప్రాంతాల్లో చేరికకు, వ్యూహరచనకు రోబోటిక్స్ ఉపయోగపడుతుంది" అని హసాన్‌బిస్ అభిప్రాయపడ్డారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ సతీశ్‌రెడ్డి

"మన ధైర్య సాహసాలు చైనాకి తెలుసు. భౌతికంగా మనపై దాడి చేసినా ఫలితం ఉండదు. అందుకే వారు సైబర్ యుద్ధ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధిపర్చుకుంటున్నారు. ఇది మనకొక సవాల్" అని ఆయన పేర్కొన్నారు. ఇదే మాటను ప్రధాని కార్యాలయంలో జాతీయ సైబర్ సెక్యూరిటీ ముఖ్యాధికారిగా పనిచేస్తున్న గుల్షన్ రాయ్ కూడా పరోక్షంగా అన్నారు. "ఒక దేశ పవర్ ప్రాజెక్టులోకి సైతం మరో దేశం చొచ్చుకుపోతోంది. డోక్లాం సమయంలో దీన్ని చూశాం. ఇది కనిపించని శత్రువు. సైబర్ దాడి జరిగినపుడు దాన్ని ఎదుర్కొనే దశలో కొత్త పరిజ్ఞానాన్ని ఆవిష్కరించడం జరుగుతోంది" అన్నారాయన. 'చైనా తన ఆర్మీని ఆధునికీకరిస్తూనే సమాంతరంగా తన పౌరవ్యవస్థలో సైతం సైబర్ టెక్నాలజీపై అవగాహన పెంచింది. ఈ వ్యూహాన్ని మనం కూడా అమలు పర్చాలి' అని జాతీయ భద్రతా మండలి మాజీ సైనిక సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ వీజీ ఖండారే అన్నారు. కొత్త ఆయుధాల తయారీకి రూపకల్పన జరగాలని, దీనికి నవీన సాంకేతిక పరిజ్ఞానం, కొత్త ఆలోచనలు కావాలని రక్షణ పరిశోధన అభివృద్ధి శాఖ డైరెక్టర్ జనరల్, రక్షణ మంత్రి సలహాదారు డాక్టర్ సతీశ్ రెడ్డి పిలుపునిచ్చారు.



కుంభమేళా అంటేనే అతి పెద్ద మత సమ్మేళనం. మరి దీనికి తరలివచ్చే భక్తులకూ అదే స్థాయిలో ఏర్పాట్లు ఉండాలిగా..! ప్రయాగ్‌రాజ్‌లో వారికి ఆహారం వండేందుకు భారీ సైజు కడాయిని శుభ్రం చేస్తున్న దృశ్యం.

1 నుంచి ఉద్యోగాల్లోనూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు

- సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ ఉత్తర్వులు

న్యూఢిల్లీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగాల్లో ఆర్థిక బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్ల అమలులో మరో ముందడుగు పడింది. ఫిబ్రవరి 1 నుంచి ఉద్యోగాల్లోనూ 10% రిజర్వేషన్లు అమలు కానున్నాయి. ఈ మేరకు కేంద్ర సామాజిక న్యాయశాఖ జారీచేసిన ఆఫీస్ మెమోరాండానికి అనుగుణంగా ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి 1 నుంచి ఉద్యోగాల భర్తీ కోసం జారీ అయ్యే నోటిఫికేషన్లకు రిజర్వేషన్లు అమలవుతాయని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ పోస్టులు, సర్వీసుల్లో రిజర్వేషన్లు వర్తిస్తాయని స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీల్లో రిజర్వేషన్లు లేని వారికి ఈ రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపింది.

కేసీఆర్ చేతిలో జగన్ బకరా

- నరేంద్రుని డైరెక్షన్‌లో కేసీఆర్
- టీఆర్ఎస్ అధినేత కనుసన్నల్లో జగన్: రామకృష్ణ

ఒంగోలు, జనవరి 19: "ప్రధాని మోదీ కోసమే తెలంగాణ సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేశారు. మోదీకి ఉపయోగపడేలా వున్న ఫెడరల్ ఫ్రంట్‌ని వెంటనే రద్దు చేయాలి. మోదీ డైరెక్షన్‌లో కేసీఆర్... కేసీఆర్ డైరెక్షన్‌లో జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారు" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ధ్వజమెత్తారు. ఒంగోలులోని సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్ని పార్టీలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైంది. దేశంలో ఫెడరల్ ఫ్రంట్‌తో కలిసేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. కేసీఆర్‌కు, జగన్ ఒక బకారా లాగా దొరికాడు. రాష్ట్రాల్లోని వివిధ పార్టీలు ఎలా ఉన్నా దేశ భవిష్యత్ కోసం కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది. ప్రత్యేక హోదాపై టీఆర్ఎస్ నేతలు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. రాజధాని భూములపై బాండ్ల రూపంలో రూ.2వేల కోట్లు అప్పు తెచ్చుకున్న చంద్రబాబు ఇప్పుడు రాజధాని భూములను తాకట్టు పెట్టి రూ.10వేల కోట్లు అప్పు తెచ్చేందుకు కుట్ర పన్నాడు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వాన్ని ఓడించకపోతే రాష్ట్రం ప్రమాదంలో పడుతుంది. ఈ నెల 25న విశాఖపట్నంలో జనసేన, సీపీఐ, సీపీఎం ఉమ్మడి సమావేశం జరుగుతుంది. దీనిలో భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తాం" అని రామకృష్ణ తెలిపారు.

బీజేపీ, వైసీపీ ఒక్కటే

- జగన్, టీఆర్ఎస్ కలిసినా టీడీపీకి నష్టం లేదు
- తెలంగాణ పోలీసులతో ఏపీలో రహస్య సర్వే
- కమలం, ఫ్యానులపై మండిపడ్డ 'దేశం' నేతలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): "వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎవరితో కలిసినా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని ఎదుర్కోలేరు. జగన్, టీఆర్ఎస్ కలిస్తే ఏమవుతుంది? రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఉండరు... మిత్రులుండరు. వాళ్లవాళ్ల పరిస్థితులకు అనుగుణంగా ముందుకు పోతుంటారు. జగన్, టీఆర్ఎస్‌తో కలిస్తే తెలుగుదేశం పార్టీకొచ్చే నష్టమేమీ లేదు" అని ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం అనంతపురంలో మీడియాతో మాట్లాడారు. "రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబును, తెలుగుదేశం పార్టీని ఎదుర్కొనే వారే లేరు. జగన్, బీజేపీ ఒకటేనని సామాన్యుడిని అడిగినా చెబుతారు. టీఆర్ఎస్ నాయకులు జగన్‌ను కలవడంలో కొత్తేముంది. ఇందులో ఆశ్చర్యపోవాల్సిన అవసరమేమీ లేదు. టీఆర్ఎస్ నాయకుడికి ఎన్ని భుజకీర్తులున్నాయో తెలియదుగానీ... ఆయన ఏదో అంటున్నాడు. టీఆర్ఎస్ నాయకులు మమ్మల్నేమీ చేయలేరు. ఇలాంటి పార్టీలు టీమ్‌లుగా ఏర్పడిన సందర్భాలు ఎన్నో చూశాం" అని జేసీ వ్యాఖ్యానించారు. తణుకులో మంత్రి నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ, "కేంద్ర ప్రభుత్వంపై ప్రజల్లో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. కోల్‌కతా ర్యాలీలో 20 పార్టీలు పాల్గొనడమే దానికి నిదర్శనం. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌కు ఆదరణ లేదు. జగన్ ముఖ్యమంత్రి కావాలని పాదయాత్ర చేశాడే తప్ప ప్రజా సమస్యల గురించి అవగాహన లేదు" అని అన్నారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలిలో సమన్వయ సమావేశంలో మాట్లాడారు. "వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కలిసి ఏర్పాటు చేస్తున్నది ఫెడరల్ ఫ్రంట్ కానే కాదు. దానికి మోదీ ఫ్రంట్ అని పేరు పెట్టాలి. ప్రధాని మోదీ నిరంకుశత్వానికి చెక్ చెప్పేందుకు కోల్‌కతా ర్యాలీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంపై మోదీ, కేసీఆర్, జగన్ కుట్రపన్నుతున్నారు. మోదీ నాటకంలో కేసీఆర్, జగన్ పాత్రధారులుగా వ్యవహరిస్తున్నారు" అని మంత్రి అన్నారు. పార్లమెంట్ సభ్యుడు కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ, "వచ్చే ఎన్నికల్లో మోదీ ఓటమి ఖాయం. ఆయన ఓటమికి సీఎం చంద్రబాబే కారణమవుతారు. తెలంగాణ సీఎం కేసీఆర్ టీడీపీ స్కూల్‌లోనే పాఠాలు నేర్చుకున్నారు. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది తెలుగుదేశం పార్టీయేనని గుర్తెరగాలి. అటువంటి వ్యక్తి సీఎం చంద్రబాబును విమర్శించడం శోచనీయం" అని అన్నారు. మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు విజయనగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "వైసీపీ అధినేత జగన్, టీఆర్ఎస్ అధినేత కుమారుడు కేటీఆర్ కలసి ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు సిద్ధమవ్వడం వెనుక శత శాతం బీజేపీ హస్తముంది. తన కేసుల మాఫీ కోసం బీజేపీతో జగన్ రహస్య ఒప్పందం చేసుకున్నారు. టీఆర్ఎస్‌తో బహిరంగ ఒప్పందానికి సంసిద్ధమవుతున్నాడు" అని సుజయకృష్ణ అన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ కాకినాడలో మాట్లాడుతూ, "జగన్‌ను ఆంధ్ర ప్రజలు నమ్మరు. ఆయనకు ఎన్నికల భయం పట్టుకుంది. వచ్చే ఎన్నికల్లో వైసీపీ పరిస్థితిని తెలుసుకునేందుకు తెలంగాణ పోలీసులతో ఆంధ్రప్రదేశ్‌లో రహస్యంగా సర్వే చేయిస్తున్నారు. దీనిని బట్టి జగన్, కేసీఆర్‌కు మధ్య బంధం ఏమిటో తెలుస్తోంది" అని శివాజీ అన్నారు. "గోద్రా అల్లర్లలో మోదీకి వ్యతిరేకంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు కాబట్టే కేంద్రం ఆయనపై కోపంగా ఉంది" అని మంత్రి కేఈ కృష్ణమూర్తి నరసరావుపేటలో అన్నారు. అన్నదమ్ముల్లా విడిపోయిన మనపై కేసీఆర్ ఇష్టానుసారం మాట్లాడటం సరికాదని మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నారు.

ఇచ్చిన వాగ్దానాలు మరిచిన మోదీ!

"మోదీ ఏపీకి అనేక వాగ్దానాలు చేసి మోసం చేశారు. టీడీపీని దెబ్బతీయడానికి కుట్రలు చేయిస్తున్నారు. హోదా అడిగితే ఐటీ, ఈడీలతో దాడులు చేయిస్తున్నారు" అని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్ విజయవాడలో అన్నారు. ముందుగా చెన్నై, తరువాత గుజరాత్ వెళ్లామని... అక్కడ నేతలు లంచాలు అడగటంతో ఆంధ్రాకు వచ్చామని కియా కంపెనీ ప్రతినిధులు చెప్పారన్నారు. విలువలు లేని బీజేపీని కచ్చితంగా గద్దె దించి తీరుతామని స్పష్టం చేశారు.

సూపర్ ఎమర్జెన్సీ: మమత

కోల్‌కతా, జనవరి 19: ఢిల్లీలోని ప్రభుత్వాన్ని మార్చేద్దామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. "మోదీ సర్కారు 'ఎక్స్‌పైరీ డేట్'ను దాటేసింది. కేంద్రంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటు తర్వాత మనం మళ్లీ ఇదే మైదానంలో కలుసుకుందాం. అందుకు, నాయకులందరినీ నేను ముందే ఆహ్వానిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రస్తుత పరిస్థితి 'సూపర్ ఎమర్జెన్సీ'ని తలపిస్తోందని, ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ కంటే దారుణంగా ఉందని మండిపడ్డారు. 'మారుద్దాం.. మారుద్దాం.. ఢిల్లీలో సర్కారును మారుద్దాం' అని పిలుపునిచ్చారు. ఇతర ప్రతిపక్షాలతో కలిసి పని చేస్తానని స్పష్టం చేశారు. ప్రధాని అభ్యర్థి ఎవరనే అంశాన్ని ఎన్నికల తర్వాత తేల్చుకుందామన్నారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్ మైదానంలో శనివారం జరిగిన భారీ ర్యాలీలో ఆమె ప్రసంగించారు. మోదీ తన హయాంలో బ్యాంకులు, సీబీఐ, ఆర్బీఐ, ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్య వ్యవస్థలను సర్వనాశనం చేశారని, వాటికి మరమ్మతు చేయలేని స్థాయిలో నష్టం జరిగిందని విమర్శించారు. "ఎన్‌పీఏ, రాఫెల్, బీమా అతి పెద్ద కుంభకోణాలు. మోదీ ప్రభుత్వ హయాంలో ఎన్నో కుంభకోణాలు జరిగాయి. అయినా, తామే అధికారంలో ఉండాలని వాళ్లు అనుకుంటున్నారు" అని ఎద్దేవా చేశారు. గజదొంగకు నోరు పెద్దదన్న బెంగాలీ సామెతను ఈ సందర్భంగా ఉటంకించారు. "రాజకీయాల్లో మంచి, మర్యాద ఉంటుంది. కానీ, బీజేపీ దానిని పాటించదు. బీజేపీతో లేని వాళ్లు అందరినీ దొంగలుగా అభివర్ణిస్తుంది" అని తప్పుబట్టారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడిన ప్రతిపక్ష నాయకులందరినీ మోదీ ప్రభుత్వం టార్గెట్ చేసిందని చెప్పారు. ప్రతిపక్ష ఫ్రంట్‌కు ఎంతోమంది నాయకులు ఉన్నారని, వారిలో ప్రధాని ఎవరంటూ బీజేపీ దుర్భిణి వేసుకుని వెతకాల్సిన అవసరం లేదని ఠాగూర్ కవితను ఉటంకిస్తూ చెప్పారు. "మీ పార్టీకి నాయకుల్లేరు. అందుకే, ఒక్కరే ప్రధాని, ఒక్కరే పార్టీ అధ్యక్షుడు ఉన్నారు. కానీ, మాకు బోల్డంతమంది నాయకులున్నారు. ప్రధాని ఎవరో తర్వాత తేల్చుకుంటాం" అని వ్యాఖ్యానించారు. లాలూ ప్రసాద్‌ను మోదీ సర్కారు జైలుకు పంపిందన్న మమత.. కేంద్రంలో ప్రభుత్వం మారిన తర్వాత 'ఎవరు ఎక్కడికి వెళతారో ఎవరు చెప్పగలరు' అని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. దేశంలోని 23 పార్టీలు ఈ సభలో పాల్గొన్నాయన్న మమత.. 'బీజేపీ హటావో, దేశ్ బచావో' అని నినదించారు.





ర్యాలీలో ప్రసంగిస్తున్న మమతా బెనర్జీ

● పార్టీలన్నీ విభేదాలను పక్కనపెట్టాలి



బీజేపీని కలిసి ఎదుర్కొనేందుకు పార్టీలన్నీ విభేదాలను పక్కనపెట్టాలి. మంచి పాలన ఎలా అందిస్తామో చెప్పేందుకు అన్ని పార్టీల్లోని సీనియర్ నేతలు ఒక బృందంగా ఏర్పడి రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలి. ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.

- దేవెగౌడ, మాజీ ప్రధాని

● ఐక్యతను కొనసాగించాలి



మోదీ, అమిత్ షా ప్రజాస్వామ్యాన్ని తొక్కేశారు. దేశ లౌకికవాద విలువల్ని కాలరాశారు. మోదీ తాను తినకున్నా.. అదానీ, అంబానీ, కార్పొరేట్ స్నేహితులకు మేలు చేస్తున్నారు. ఇప్పటివరకు ప్రతిపక్షాలు ఐక్యంగా ఉన్నాయి. ఇదే పంథాను భవిష్యత్తులోనూ కొనసాగించాలి. విపక్ష ర్యాలీకి సోనియా, రాహుల్ శుభాకాంక్షలు తెలియజేశారు.

- మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్

● ఈ ర్యాలీ 22 పార్టీల హరివిల్లు



ఈ ర్యాలీ చారిత్రాత్మకమైనది.. 22 పార్టీల హరివిల్లు. మోదీ ప్రభుత్వం నుంచి విమోచనం పొంది, లౌకికవాద ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఇది ఉపయోగపడుతుంది. ద్వేషపూరిత రాజకీయాలకు పాల్పడుతున్న మోదీకి సందేశం ఇస్తుంది. బీజేపీ రథ యాత్రను సుప్రీం కోర్టు అడ్డుకున్నందుకు సంతోషం. మోదీని రాజ్యభ్రష్టుడిని చేసేందుకు ఓట్ల చీలికను మమత అడ్డుకుంటున్నారు.

- అభిషేక్ సింఘ్వీ, కాంగ్రెస్

● ఈవీఎం.. దొంగ మెషీన్



బీజేపీ బారి నుంచి దేశాన్ని కాపాడేందుకు ఐక్యంగా పోరాడాలి.. త్యాగం చేయాలి. ఈవీఎంలు నమ్మదగినవి కావు. అవి దొంగ మెషీన్లు. వాటికి అంతం పలకాల్సిందే. బ్యాలెట్ వ్యవస్థను తిరిగి తీసుకొచ్చేందుకు మనమంతా ఈసీపై పోరాడాలి. ప్రధాని ఎవరవుతారు అన్నది ముఖ్యం కాదు. ముందుగా ఎన్నికల్లో అందరం కలిసి పోటీ చేయాలి.

- ఫరూక్ అబ్దుల్లా, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత

● అప్రజాస్వామిక వ్యక్తుల చేతుల్లో ప్రభుత్వం



ప్రపంచంలోనే అత్యంత బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగిన దేశం మనది. కానీ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామిక వ్యక్తుల చేతుల్లో ఉంది. అవినీతిపై పోరాడుతున్నామంటున్న బీజేపీ.. అదే సమయంలో బేరసారాలకు పాల్పడుతోంది. నోట్లరద్దుతో పేద, గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజల అవసరాలను పట్టించుకోని ప్రభుత్వం కేంద్రంలో ఉండటం దురదృష్టకరం.

- కుమారస్వామి, కర్ణాటక సీఎం

● రెండో స్వాతంత్ర్య సమరమే



2019 లోక్‌సభ ఎన్నికలు రెండో స్వాతంత్ర్య సమరం లాంటివి. మోదీ మళ్లీ ప్రధాని కాబోరు. ప్రతిపక్షాల ఐక్యతను చూసి ఆయన భయపడుతున్నారు. అందుకే తిట్లదాడి చేస్తున్నారు. దేశానికి రక్షణగా మేమంతా కలిసివస్తాం.

- ఎంకే స్టాలిన్, డీఎంకే

● ఎట్టిపరిస్థితుల్లోనూ బీజేపీని ఓడించాల్సిందే



ప్రమాదకరంగా మారిన బీజేపీ ప్రభుత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనైనా ఓడించాల్సిందే. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే ప్రభుత్వం మారాల్సిందే. 2019లో మోదీ-షా గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారు. భవిష్యత్తులో ఎన్నికలు ఉండకుండా చేస్తారు. హిట్లర్ లాంటి పాలన వస్తుంది. బీజేపీ మతం పేరుతో ప్రజల్లో శత్రుత్వాన్ని పెంచుతోంది.

- కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం

● ఈ సర్కారును విమర్శిస్తే దేశద్రోహమా!



తప్పుడు అభివృద్ధి లెక్కలతో మోదీ ప్రభుత్వం ప్రజల్ని మోసం చేయాలని చూస్తోంది. ప్రస్తుత పరిస్థితి ఎలా ఉందంటే.. ఈ ప్రభుత్వాన్ని కొనియాడితే దేశభక్తులు, విమర్శిస్తే దేశద్రోహులు అవుతున్నారు. ఒక వ్యక్తి అధికారాన్ని తొలగించడం కాదు, ఆ భావజాలాన్నే తొలగించడానికి మనమంతా కలిసికట్టుగా ఉండాలి.

- యశ్వంత్ సిన్హా, కేంద్ర మాజీ మంత్రి

● మోదీ కాపలాదారు అయితే ప్రజలు పోలీసులు



ప్రధాని మోదీ దేశానికి కాపలాదారు అయితే, ప్రజలు పోలీసులు. వారు తప్పు చేసేవారిని విడిచిపెట్టరు. శిక్షిస్తారు. ఆయన అబద్ధాల తయారీదారు.. హోల్‌సెల్లర్.. డిస్ట్రిబ్యూటర్. ప్రతిపక్ష పార్టీల కలయిక భిన్నత్వంలో ఏకత్వం లాంటిది.

- తేజస్వీ యాదవ్, ఆర్జేడీ

● బీజేపీని గద్దె దించేందుకే ఎస్పీ-బీఎస్పీ పొత్తు



దళిత వ్యతిరేక, మైనారిటీ వ్యతిరేక ఎన్డీయే ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించే ప్రక్రియ ఎస్పీ- బీఎస్పీ కలయితోనే ప్రారంభమైంది. అంబేడ్కర్ రాజ్యాంగం భద్రంగా ఉండాలంటే బీజేపీని ఓడించాల్సిందే.

- సతీశ్ చంద్ర మిశ్రా, బీఎస్పీ

మోదీ హటావో!

(మూడో పేజీ తరువాయి)

నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో విపక్షాల ఐక్యత కళ్లకు కట్టింది. డజనుకుపైగా ప్రతిపక్షాల నుంచి 23 మంది ప్రముఖ నాయకులు, బీజేపీ అసమ్మతి నేతలు చేతులు కలిపారు. ఇటీవల బీజేపీకి రాజీనామా చేసిన అరుణాచల్‌ప్రదేశ్ మాజీ సీఎం గెగాంగ్ అపాంగ్ కూడా హాజరయ్యారు. సభలో చివరిగా మాట్లాడిన మమతా బెనర్జీ 23వ వక్త అంటే ర్యాలీ ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. మాజీ ప్రధాని దేవెగౌడ (జేడీఎస్)తోపాటు ముఖ్యమంత్రులు చంద్రబాబు (టీడీపీ), అరవింద్ కేజ్రీవాల్ (ఆప్), కుమారస్వామి (జేడీఎస్); మాజీ ముఖ్యమంత్రులు శరద్ పవార్ (ఎన్సీపీ), ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ), హేమంత్ సోరెన్; ఇతర నేతలు స్టాలిన్ (డీఎంకే), శరద్ యాదవ్, అరుణ్ శౌరి, యశ్వంత్ సిన్హా తదితరులు దీనికి హాజరయ్యారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి రాలేదు. కానీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సతీశ్ చంద్ర మిశ్రా హాజరయ్యారు. బీజేపీ ఎంపీ శత్రుఘ్న సిన్హా ర్యాలీకి రావడం మరో విశేషం. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్ గాంధీ గైర్హాజరు అయినా.. ఆ పార్టీ తరఫున మల్లికార్జున ఖర్గే, అభిషేక్ మను సింఘ్వీ ర్యాలీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా, పార్టీల మధ్య విభేదాలను ప్రస్తావిస్తూ ఖర్గే ఓ కవితను చదివి వినిపించారు. 'హృదయాలు కలవకపోయినా కనీసం చేతులను అయినా కలపాలి' అనేది దాని సారాంశం. పార్టీల మధ్య విభేదాలను పక్కనబెడదామని నాయకులు సంకల్పం చెప్పుకొన్నారు. ప్రధాని మోదీపై ప్రతి ఒక్కరూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూనే, మోదీని దించేయాలని ప్రతినబూనారు. ప్రధాన మంత్రి ఎవరనే అంశాన్ని ఎన్నికల తర్వాతే నిర్ణయించుకుందామని తీర్మానించారు. ప్రతి నియోజక వర్గంలోనూ బీజేపీ అభ్యర్థిపై విపక్షాల తరఫున ఉమ్మడి అభ్యర్థిని నిలిపేలా కసరత్తు చేద్దామని అనుకున్నారు. ఈవీఎంలకు బదులుగా ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లను వినియోగించాలని చాలామంది నేతలు డిమాండ్ చేశారు. కాగా, ఈ సభ ద్వారా ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా ఉన్నాయన్న సంకేతాలు ప్రజల్లోకి వెళ్లాయని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఆయా రాష్ట్రాల్లో స్థానిక రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా పొత్తులు కుదుర్చుకోనున్నా.. జాతీయ స్థాయిలో మోదీకి వ్యతిరేకంగా పని చేయడం మంచిదేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. భారీ ఎత్తున ప్రతిపక్షాలన్నీ ఒకే వేదిక మీదికి రావడం వల్ల బీజేపీలో స్థైర్యం దెబ్బతింటుందని భావిస్తున్నాయి. యువ నేతలు, గుజరాత్‌కు చెందిన పటీదార్ ఉద్యమ నేత హార్దిక్ పటేల్, దళిత ఉద్యమ నేత, ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానీ ప్రసంగాలను ప్రారంభించి సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇక, చంద్రబాబు బెంగాలీలో తన ప్రసంగాన్ని మొదలుపెట్టి ఆకట్టుకున్నారు. ఇటీవల హిందుత్వవాదులు వేధించిన కవి శ్రీజ వేదికపై కవితలు చదివారు. కాగా, దాదాపు నాలుగు గంటలపాటు సభను మమతా బెనర్జీ ఒంటిచేత్తో నడిపించారు. ప్రతి వక్తనూ సభికులకు పరిచయం చేశారు. సభ తర్వాత ప్రభుత్వ అతిథి గృహం 'సౌజన్య'లో టీపార్టీ ఇచ్చారు. కాగా, కేంద్ర మాజీ మంత్రి అరుణ్ శౌరి మమతను 'బెంగాల్ సివంగి'గా అభివర్ణిస్తే.. స్టాలిన్ 'ఉక్కు మహిళ'గా కితాబునిచ్చారు.

భారీ ఏర్పాట్లు.. కట్టుదిట్టమైన భద్రత

ఈ బహిరంగ సభకు తృణమూల్ కాంగ్రెస్ భారీ ఏర్పాట్లను చేసింది. నేతలకు, జనాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంది. భారీ వేదికలను నిర్మించడమే కాకుండా 30 ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసింది. తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు వలంటీర్లుగా సేవలందించారు.

వచ్చే ఎన్నికలు ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని పునరుద్ధరించేవి

కోల్‌కతా ర్యాలీకి సోనియా సందేశం

కోల్‌కతా, జనవరి 19: రాబోయే లోక్‌సభ ఎన్నికలు అత్యంత కీలకమైనవని యూపీఏ అధ్యక్షురాలు సోనియా గాంధీ చెప్పారు. రానున్న ఎన్నికలు దేశంలో ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని పునరుద్ధరించే ఎన్నికలన్నారు. అహంకారపూరితమైన, విభజనకు పాల్పడుతున్న మోదీ ప్రభుత్వంపై పోరాడే ఎన్నికలని పేర్కొన్నారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలో శనివారం కోల్‌కతాలో నిర్వహించిన విపక్షాల ఐక్యతా ర్యాలీకి సోనియా అభినందనలు తెలిపారు. ఆమె, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఈ ర్యాలీకి హాజరుకాకపోయినప్పటికీ పార్టీ తరఫున మల్లికార్జున ఖర్గే, అభిషేక్ మను సింఘ్వీలను పంపారు. ఈ సందర్భంగా సోనియా సందేశాన్ని ఖర్గే చదివి వినిపించారు. "రాబోయే లోక్‌సభ ఎన్నికలు సాధారణమైనవి కావు. దేశంలో ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని పునరుద్ధరించేవి. మన లౌకిక సంప్రదాయాన్ని రక్షించుకునేవి. భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని ప్రయత్నించే శక్తులను ఓడించే ఎన్నికలు" అని సోనియా తన సందేశంలో పేర్కొన్నారు.

ఈవీఎంలపై పోరు!

- అభ్యంతరాలు ఈసీ దృష్టికి
- 23న మరోసారి ఢిల్లీలో భేటీ
- తదుపరి సభ అమరావతిలో

అమరావతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) వినియోగంపై తమ అభ్యంతరాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని బీజేపీ వ్యతిరేక పక్షాల నాయకులు నిర్ణయించారు. సాంకేతికంగా బాగా అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఈవీఎంలను వినియోగించడం లేదని గుర్తు చేశారు. కోల్‌కతాలో నిర్వహించిన బహిరంగ సభ అనంతరం... ఆయా పార్టీల నేతలంతా సమావేశమయ్యారు. తదుపరి కార్యాచరణపై సమీక్షించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... ఈవీఎంలను ప్రభావితం చేయడం ద్వారా 'రిగ్గింగ్'కు ఉన్న అవకాశాలపై లోతుగా చర్చించారు. "రాఫెల్ కుంభకోణంలో ఆర్జించిన వేలకోట్లను ఎన్నికల్లో విరజిమ్మాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని చంద్రబాబు సూచించారు. ఈ నెల 23న ఢిల్లీలో మళ్లీ సమావేశమై బీజేపీ వ్యతిరేక పోరాటానికి అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేయాలని నిశ్చయించారు.

కుమారస్వామి ఆవేదన

లోక్‌సభ ఎన్నికల్లోపు కర్ణాటకలో తమ ప్రభుత్వాన్ని కూలదోసి అధికారంలోకి రావడానికి బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కుమారస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి వేల కోట్లు విరజిమ్ముతున్నారని ఆరోపించారు.

కూటమి సభగా 'ధర్మపోరాట దీక్ష'

బీజేపీ వ్యతిరేక కూటమి తదుపరి సభ అమరావతిలో నిర్వహించాలని నిర్ణయించారు. మోదీ విధానాలపై ఇప్పటికే పదకొండు జిల్లాల్లో ధర్మపోరాట దీక్ష పేరిట సభలు జరిపామని, వాటికి ముగింపుగా అమరావతిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. దీనినే ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి సభగా నిర్వహిస్తామని, దీనికి అందరూ రావాలని ఆయన కోరారు. వచ్చే నెల 15వ తేదీకి అటూ ఇటూగా ఈ సభ ఉండే అవకాశం ఉందని టీడీపీ వర్గాలు తెలిపాయి. తమ రాష్ట్రాల్లోనూ సభలు పెడతామని కుమారస్వామి, స్టాలిన్, అఖిలేశ్, తేజస్వీ యాదవ్ ప్రతిపాదించారు.



కోల్‌కతాలో తృణమూల్ కాంగ్రెస్ నిర్వహించిన భారీ ర్యాలీ అనంతరం విపక్ష నాయకులందరికీ భోజనం వడ్డిస్తున్న బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

పతనం తథ్యం!

(మూడో పేజీ తరువాయి)

కావాలని ఆకాంక్షించారు. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడమే లక్ష్యంగా బీజేపీ వ్యతిరేక పక్షాలన్నీ ఏకమయ్యాయన్నారు. శనివారం కోల్‌కతాలో 'యునైట్ ఇండియా బ్రిగేడ్' పేరిట నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. బెంగాలీలో తొలి పలుకులు పలికారు. బెంగాలీ ప్రముఖులైన వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్, సుభాష్ చంద్రబోస్ వంటి మహనీయులను గుర్తుచేసుకున్నారు. తర్వాత ఇంగ్లీషులో తన ప్రసంగం కొనసాగించారు. "ఇది చరిత్రాత్మక రోజు. దేశ చరిత్రను మలుపు తిప్పే భారీ సభ నిర్వహిస్తున్న బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి అభినందనలు. ఈ వేదికపై జాతీయ, ప్రాంతీయ పార్టీలకు చెందిన అనేకమంది మహామహులైన నేతలు ఉన్నారు. ఈ సభ లక్ష్యం ఒక్కటే. సేవ్ ఇండియా, సేవ్ డెమోక్రసీ! దేశాన్ని ఒక్కటిగా ఉంచడం మన అందరి లక్ష్యం. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశాన్ని విభజించి పాలిస్తోంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

రాష్ట్రాలపై పెత్తనం

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీని కేంద్రం అమలు చేయలేదని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను మోదీ సర్కారు తీవ్రంగా వేధిస్తోందని ఆక్రోశించారు. సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తోందన్నారు. రాష్ట్రాల అధికారాల్లో వేలు పెడుతూ ఇబ్బందులు సృష్టిస్తున్నారని... తమ హక్కులు లాక్కుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రాల్లో సంక్షోభాలు సృష్టిస్తూ నీచ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. "కశ్మీర్‌లో రాజకీయ సంక్షోభం సృష్టించారు. కర్ణాటక ప్రభుత్వాన్ని కూల్చాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. అక్కడ ఎమ్మెల్యేలను పశువులను కొన్నట్లు కొనేందుకు డబ్బులు వెదజల్లుతున్నారు. కర్ణాటక సర్కారును కూల్చేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు" అని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ అధికార దుర్వినియోగంపై కలిసికట్టుగా పోరాటం మొదలుపెట్టామని చంద్రబాబు తెలిపారు. సీబీఐ, ఈడీ, ఆర్బీఐ, ఐటీ తదితర విభాగాలను స్వార్థానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. ప్రత్యర్థి పార్టీల నాయకులను కేంద్రం వేధిస్తోందన్నారు. ఈవీఎంలకు వ్యతిరేకంగా, మళ్లీ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా ఉద్యమించాల్సి ఉందని పిలుపునిచ్చారు.

ఏపీ అచ్చేదిన్?

గత ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజారిటీ కట్టబెట్టినా ప్రజలకు ఒరిగిందేమీ లేదని చంద్రబాబు విమర్శించారు. "ఆ రోజు బీజేపీ అనేక హామీలు ఇచ్చింది. అచ్చే దిన్ వస్తాయని నినదించింది. జన్‌ధన్, మేకిన్ ఇండియా, గుడ్ గవర్నెన్స్, స్వచ్ఛ భారత్, డిజిటల్ ఇండియా, ముద్రా రుణాలు, అవినీతి అంతం, స్మార్ట్ సిటీస్, నల్లధనం వెనక్కి తేవడం, రెండు కోట్ల ఉద్యోగాలు... వంటి అనేక హామీలు ఇచ్చింది. కానీ, ఈ ప్రధాని మాటలకే పరిమితం అయ్యారు" అని విమర్శించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న ప్రధాని ఆ విషయంలో విఫలమయ్యారన్నారు. "వ్యవసాయరంగంలో సగటు వృద్ధి రేటు కేవలం 1.9 శాతం మాత్రమే. చరిత్రలో ఎప్పుడూ ఇంత తక్కువలేదు. గత నాలుగేళ్ల సగటు ఆర్థిక వృద్ధిరేటు 7.3 శాతమే. దీనివల్ల దేశంలో కొత్తగా ఉపాధి అవకాశాలు రావడం లేదు. ఆంధ్రప్రదేశ్, బెంగాల్, కర్ణాటక తదితర రాష్ట్ర ప్రభుత్వాలు మోదీ కంటే ఎంతో బాగా పాలిస్తున్నాయి" అని చంద్రబాబు తెలిపారు. మోదీ ప్రభుత్వానికి రాజకీయాలు తప్పించి అభివృద్ధి పట్టడం లేదని చంద్రబాబు మండిపడ్డారు.

రాఫెల్ అతిపెద్ద స్కామ్

మోదీ సర్కారు అవినీతిలో కూరుకుపోయిందని చంద్రబాబు ఆరోపించారు. రాఫెల్ డీల్ అతిపెద్ద కుంభకోణమన్నారు. "ఈ కేసులో సుప్రీం కోర్టును కూడా మోసం చేశారు. తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారు" అని ధ్వజమెత్తారు. నోట్లరద్దు, జీఎస్టీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. "నోట్ల రద్దు తర్వాత ఏటీఎంలు మూతబడ్డాయి. బ్యాంకుల నుంచి డబ్బులు తీసుకోవడం సాధారణ పౌరులకు ఇప్పటికీ కష్టమైపోతోంది. నోట్ల రద్దుతో సాధించింది ఏమీ లేదు. పెట్రోలు, డీజిల్ గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి" అని తెలిపారు.





కోల్‌కతాలో యునైట్ ఇండియా బ్రిగేడ్ సభా వేదికపై స్టాలిన్, మమతతో ముఖ్యమంత్రి చంద్రబాబు

పరి'శ్రమ' ఫలిస్తోంది!

వికేంద్రీకరణ విధానంలో విస్తరిస్తున్న అవకాశాలు

- ప్రాంతాభివృద్ధి, ఉద్యోగితే లక్ష్యంగా ప్రగతి పథకాలు
- 5,13,753 కొత్త కొలువులు
- ప్రభుత్వ ప్రోత్సాహకాలతో వెనుకబడ్డ జిల్లాలూ జిగేల్
- 55 వేల కోట్ల పెట్టుబడిని రాబట్టుకొన్న ప్రకాశం జిల్లా
- కియ కారు, హీరో జోరుతో సీమ యువతకు హుషారు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలో పరిశ్రమల సందడి పెరిగింది. ప్రాంతాల వారీగా ఒక్కో రంగం ఒక్కో చోట వేగంగా విస్తరిస్తోంది. కరువు సీమలో 'కారు' ప్రయాణంతో మొదలుపెట్టి, వలసల నేల ఉత్తరాంధ్రలో ఉద్యానవన పరిశ్రమలు అందంగా రూపుదిద్దుకొంటున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ తరహా ప్రగతికి వీలు ఉండేది కాదు. ఏ పెద్ద పరిశ్రమ వచ్చినా హైదరాబాద్ పరిసర ప్రాంతాలే అనువైనవిగా చూపేవారు. వెనుకబడిన జిల్లాలను, ఇతర ప్రాంతాలను పట్టించుకునేవారే కాదు. అసలు రాష్ట్రంలో హైదరాబాద్ మినహా మరో ప్రాంతముందన్న ధ్యాసే లేనంతగా పెట్టుబడులూ, అవకాశాలూ, ఉద్యోగాలూ ఒకే చోట కేంద్రీకృతమయ్యాయి. విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో నిజమైన పారిశ్రామిక విప్లవం ప్రారంభమయింది. అందుబాటులోని వనరులు, చేరువ లోని అవకాశాలను అందిపుచ్చుకొని ఎక్కడికక్కడ అభి వృద్ధి ప్రాజెక్టులు ఆకృతి దాల్చుతున్నాయి. ఈ వికేంద్రీకరణతో రాష్ట్ర ఆదాయం పెరగడం ఒక్కటే కాకుండా, నిరుద్యోగ యువతకు తమ ప్రాంతం దాటిపోవాల్సిన పని లేకుండానే.. ఉపాధి అవకాశాలూ లభిస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు 2014లో పాలనా పగ్గాలు చేపట్టిన వెంటనే గతంలో హైదరాబాద్ నగర అభివృద్ధి, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థలను తీసుకువచ్చేందుకు కృషి చేసిన తరహాలోనే, నవాంధ్రప్రదేశ్ కోసం ప్రపంచమంతా చుట్టి పెట్టుబడుల వేట సాగించారు. అమెరికా, జపాన్, చైనా, సింగపూర్ , దక్షిణ కొరియా దేశాల్లో పర్యటించారు. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికను రాష్ట్ర పారిశ్రామిక ఆకర్షక కేంద్రంగా మార్చేశారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలకు పరిశ్రమలను, కంపెనీలను తీసుకురావడానికి ప్రయత్నించారు. దీని వల్ల ప్రాంతాల మధ్య అసమానత్వ ధోరణి పోయి..సర్వతోముఖాభివృద్ధికి ఇప్పుడు బాటలు పడుతున్నాయి.



కడప.. ఉక్కు

ఉక్కు పరిశ్రమ: మైలవరం మండలం కంబాలదిన్నెలో రూ. 20 వేల కోట్లు పెట్టుబడితో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. దీనికోసం మూడు వేల ఎకరాలను సేకరించాలని నిర్ణయించారు. ఇందులో 2,300 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. మిగతా ఏడు వందల ఎకరాల కోసం భూసేకరణ చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గత ఏడాది డిసెంబరు 27వ తేదీన ఈ పరిశ్రమకు శంకుస్థాపన జరిపారు. ప్రస్తుతం నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక సన్నాహాలను పూర్తి చేసుకొంటున్న ఈ పరిశ్రమ పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల ఉద్యోగాలు లభిస్తాయి.

పెట్టుబడుల పంట

రాష్ట్రమంతా పరిశ్రమలు వరుస కడుతున్నాయి. ఒక్క పరిశ్రమల శాఖతోనే ఎంఎస్‌ఎంఈలతో రూ.17,771.52 కోట్ల పెట్టుబడితో 41,1880 ఉద్యోగాలు .. భారీ పరిశ్రమలలో రూ.62642.76 కోట్ల పెట్టుబడితో 1,01,873 ఉద్యోగాలు దక్కాయి. మొత్తంగా ఈ నాలుగున్నరేళ్లలో రూ.2,40,414.28 కోట్ల పెట్టుబడితో 5,13,753 మందికి ఉద్యోగాలొచ్చాయి.

కొత్త..ప్రకాశం

రామాయపట్నం ఓడరేవు: ఉలవపాడు మండలం రామాయపట్నంలో రూ. 4,240 కోట్ల పెట్టుబడితో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఈ ఓడరేవు కోసం 3,092 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఈ నెల తొమ్మిదో తేదీన శంకుస్థాపన పూర్తి చేసుకొంది. ఈ ఓడరేవు పూర్తయితే 25 వేలమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి.


ఆసియా పల్ప్ అండ్ పేపర్స్: రామాయపట్నం ప్రాంతంలోని గుడ్లూరు మండలం చేవూరు సమీపంలో రూ. 50 వేల కోట్లతో ఇండోనేషియా కంపెనీ ఈ పేపర్ మిల్స్‌ను నిర్మిస్తోంది. ఈ నెల తొమ్మిదో తేదీన శంకుస్థాపన పూర్తిచేసుకొన్న ఈ మిల్స్ కోసం 2,500 ఎకరాలను సేకరించారు. తొలి దశలో రూ. 24,500 కోట్ల విలువైన పనులను చేపడుతున్నారు. పూర్తిస్థాయిలో పేపర్ మిల్స్ సిద్ధమయితే 13 వేల మందికి ఉపాధి దొరుకుతుంది.



అనంత జోరు

కియ: వెనుకబడ్డ రాయలసీమ వాహన తయారీరంగానికి హబ్‌గా మారుతోంది. కరువు తాండవించే అనంతపురం జిల్లాలో దక్షిణ కొరియాకు చెందిన కార్ల తయారీ దిగ్గజ సంస్థ 'కియ' తన ప్లాంటును ఏర్పాటు చేసింది. అనంతపురం ప్లాంటులో తయారైన 'కియ' కారు ఈ నెల 27న మార్కెట్లోకి రానున్నది. 'కియ' సంస్థకు అనుబంధంగా మరిన్ని సంస్థలూ పెట్టుబడులు పెట్టాయి.





తూర్పు- రిఫైనరీ..

హల్దియా పెట్రో కెమికల్ రిఫైనరీ: కాకినాడ సెజ్‌లో రూ. 33 వేల కోట్లతో ఏర్పాటు చేస్తున్నారు. పది రోజుల క్రితం రిఫైనరీ ఏర్పాటుకు సంబంధించిన కీలక ఒప్పందాలు కుదిరాయి. త్వరలోనే శంకుస్థాపన జరపడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది.



కర్నూలు.. సోలార్

సోలార్ పార్కు: ఓర్వకల్లు సమీపంలో రూ.ఆరు వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేశారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ఐదు వేల ఎకరాలను సమకూర్చింది. రెండేళ్ల క్రితం శంకుస్థాపన జరుపుకొన్న ఈ పార్కు గత ఏడాది డిసెంబరు 20వ తేదీన అందుబాటులోకి వచ్చింది. వెయ్యిమందికి ప్రత్యక్షంగా, మరో 1500 మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది.

చిత్తూరు సత్తా

ఇసుజు: శ్రీసిటీ సెజ్‌లో రూ. 1,500 కోట్ల పెట్టుబడితో 107 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. రెండేళ్ల క్రితం శంకుస్థాపన జరుపుకున్న ఈ పరిశ్రమ త్వరలోనే అందుబాటులోకి రానుంది. దాదాపు రెండు వేలమందికి కొత్తగా ఉపాధి లభించనుంది.

అపోలో టైర్స్: వరదయ్యపాలెం సమీపంలోని సెజ్‌లో రూ. 4,125 కోట్ల పెట్టుబడి, 1,400 మందికి ఉపాధి హామీతో 265 ఎ కరాల్లో ఏర్పాటవుతోంది.

హీరో: వరదయ్యపాలెం సమీపంలోని సెజ్‌లో రూ. 1,600 కోట్ల పెట్టుబడి, 2,500 కొత్త కొలువులతో 562 ఎకరాల్లో ఏర్పాటవుతోంది.



ఉత్తరాంధ్ర- ఉద్యానవనం

పతంజలి: విజయనగరం జిల్లాలోని కొత్తవలస మండలంలో ఈ ఔషధ పరిశ్రమ ఏర్పాటవుతోంది. 176 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి సేకరించింది. ఈ పరిశ్రమ వల్ల రెండు వేలమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా పని దొరకనుంది.

ఉద్యానవన కళాశాల: ఉత్తరాంధ్రలో ఉద్యానవన రంగాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో విజయనగరం జిల్లా పార్వతీపురం సమీపంలో ఈ కళాశాల ఏర్పాటు చేశారు. వేగంగా నిర్మాణం పూర్తి చేసుకొన్న ఈ కళాశాలలో క్లాసులు కూడా ప్రారంభించారు.



జిల్లా	ఎంఎస్‌ఎంఈ సంఖ్య	పెట్టుబడి రూ.కోట్లలో	ఉద్యోగాలు	భారీ, మెగా పరిశ్రమలు	పెట్టుబడి రూ.కోట్లలో	ఉద్యోగాలు
అనంతపురం	1428	616.24	18100	11	1098.57	11913
చిత్తూరు	2143	1214.99	29915	32	7488.68	13960
తూర్పుగోదావరి	2548	1861.62	28876	13	5344.8	8149
గుంటూరు	4534	1680.64	40276	9	848.41	2630
కడన	1037	393.81	9600	15	4768.6	1045
కృష్ణా	2675	1269.37	29574	23	2230.11	7365
కర్నూలు	3816	1009.87	32455	7	457.62	843
నెల్లూరు	1338	899.41	17644	27	21012.56	7124
ప్రకాశం	2494	1376.22	28331	13	665.5	2252
శ్రీకాకుళం	1483	628.31	18747	5	835	2345
విశాఖపట్నం	2437	1550.82	39297	33	11300.07	19507
విజయనగరం	2661	602.27	18912	8	407.07	2695
పశ్చిమగోదావరి	1755	4667.95	100153	59	6185.77	22045
మొత్తం	30349	17771.52	411880	255	62642.76	101873

గురుకులాల్లో సాంకేతిక విప్లవం

- విద్య, ఆరోగ్యం, ఆహారం... యాపుల్లోనే సమస్త పర్యవేక్షణ
- తాజాగా ప్రిన్సిపాళ్ల వర్క్‌షాపూ ఆన్‌లైన్‌లోనే...
- పారదర్శకత, అత్యుత్తమ ఫలితాలే లక్ష్యం



అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో సాంకేతికతను వినియోగించుకుంటూ అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నారు. పనితీరులో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారు. ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి రాములు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటూ అనేకాంశాల్లో టెక్నాలజీని ప్రవేశపెట్టారు. విద్యార్థుల మానిటరింగ్ సాఫ్ట్‌వేర్ (శామ్స్)ను పూర్తి స్థాయిలో ఉపయోగించుకుంటున్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల సమాచారాన్ని నిరంతరాయంగా పొందుపరచడంతో పాటు హాజరు, సెలవులు, బోధనా ప్రణాళికలను ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా తయారుచేసుకుంటున్నారు. ప్రతి విద్యార్థికి లాగిన్ ఐడీని క్రియేట్ చేశారు. దీనితో వారు ఆన్‌లైన్ పరీక్షల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. వివరాలన్నింటినీ డ్యాష్ బోర్డుకు అనుసంధానం చేసేందుకు ఈ సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నారు. దీనితో తల్లిదండ్రులకు వారి పిల్లలకు సంబంధించి హాజరు, మార్కుల తదితర వివరాలతో కూడిన సందేశాన్ని ఎప్పటికప్పుడు పంపించడానికి సాధ్యమవుతోంది. విద్యార్థుల ఆరోగ్య విషయాలను క్రమబద్ధంగా నమోదు చేసి, పర్యవేక్షించడానికి వెసులుబాటు కల్పించే 'ఆరోగ్యలక్ష్మి' సాఫ్ట్‌వేర్‌ను వినియోగంలోకి తెచ్చారు. 'అన్నపూర్ణ' పేరుతో మెనూ మానిటరింగ్ సాఫ్ట్‌వేర్‌ను అమల్లోకి తీసుకువచ్చారు. వీటితో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సబ్జెక్టు నిపుణులతో అన్ని గురుకులాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. 10వ తరగతి విద్యార్థులు ఎక్కువ మంది 10/10 జీపీఏ సాధించేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థులకు జపనీస్ భాషను ఆన్‌లైన్ బోధన ద్వారా నేర్పించారు. ఇవన్నీ ఒకెత్తైతే... ప్రధాన అధ్యాపకుల వర్క్‌షాపును కూడా ఆన్‌లైన్‌లో దిగ్విజయంగా నిర్వహించడం మరోఎత్తు. 'జూమ్' యాప్ ఉపయోగించి మొబైల్, డెస్క్‌టాప్ ఆధారంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్క్‌షాప్‌ని దిగ్విజయంగా నిర్వహించారు. శుక్ర, శనివారాల్లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ గురుకులాలకు చెందిన 300 మంది ప్రిన్సిపాళ్లు ఈ యాప్ ద్వారా ఆన్‌లైన్ వర్క్‌షాపులో పాల్గొన్నారు. వర్క్‌షాపును ఉద్దేశించి మంత్రి నక్కా ఆనంద్‌బాబు గుంటూరు క్యాంపు కార్యాలయం నుంచి 'ఆన్‌లైన్'లో మాట్లాడారు. "ఎస్సీ గురుకులాల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి. పరీక్షల్లో గురుకుల విద్యార్థులు 10/10 జీపీఏ సాధించేలా ప్రిన్సిపాళ్లు శ్రద్ధ తీసుకోవాలి. గతంలో కన్నా ఈ సారి మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలి. కార్పొరేట్ కళాశాలల కంటే ఎస్సీ గురుకులాల్లో విద్యార్థుల కోసం ఎక్కువ సౌకర్యాలు కల్పిస్తున్నాం. కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలు సాధించాలి. కొత్తగా ప్రధాన అధ్యాపకులుగా పదోన్నతి పొందిన వారికి శుభాకాంక్షలు" తెలిపిన మంత్రి ఆనందబాబు సాంకేతికతను ఉపయోగించుకుంటున్న కార్యదర్శి రాములను ప్రత్యేకంగా అభినందించారు.

3న జ్యుడీషియల్ కాంప్లెక్స్ ప్రారంభం?

- ఆరంభ కార్యక్రమానికి సుప్రీం సీజే

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో హైకోర్టు (తాత్కాలిక) నిర్వహణ కోసం నిర్మిస్తున్న జ్యుడీషియల్ కాంప్లెక్స్ వచ్చే నెల 3వ తేదీన ప్రారంభం కానున్నట్లు తెలిసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ చేతుల మీదుగా ఆ రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఆ తర్వాత ఫిబ్రవరి 4 లేదా 5 తేదీల నుంచి హైకోర్టు కార్యకలాపాలు జ్యుడీషియల్ కాంప్లెక్స్‌లోనే జరుగుతాయని అంటున్నారు. హైదరాబాద్ నుంచి తరలివచ్చిన హైకోర్టు ప్రస్తుతం విజయవాడలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. జ్యుడీషియల్ కాంప్లెక్స్‌ను 4ఎకరాల్లో 2.35 లక్షల చ.అ. విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. మొత్తం 23 కోర్టు హాళ్లు ఉంటాయి. రూ.161కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనుల్లో సుమారు 90శాతం పనులు చివరి దశలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. హైకోర్టు రోజువారీ కార్యకలాపాలకు వీలుగా సకల ఏర్పాట్లు కొలిక్కి వస్తున్నాయని, మిగిలిన 10 శాతం పనులు ఫిబ్రవరి మొదటి వారంలో పూర్తి చేస్తామంటున్నారు. మరోవైపు, అమరావతిలో ఐకానిక్ భవన నిర్మాణం పూర్తయ్యే వరకూ హైకోర్టు కార్యకలాపాలు జ్యుడీషియల్ కాంప్లెక్స్‌లోనే జరుగుతాయి. సుమారు 12.5 లక్షల చ.అ. విస్తీర్ణంలో, బౌద్ధ స్థూపాన్ని తలపించేలా రూ.1325 కోట్ల అంచనాతో ఐకానిక్ భవన నిర్మాణ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. 2020 అక్టోబరు నాటికి దీనిని పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. ఇందులో 36 సువిశాలమైన కోర్టు హాళ్లు ఉంటాయి. అవసరమైతే మరో 24 కోర్టు హాళ్లను కూడా ఏర్పాటు చేసుకునే వీలుంది.

నిధుల 'దారి'లో దగా

- ఏపీపై వివక్ష అక్షర సత్యం
- జాతీయ రహదారుల లెక్కలతో స్పష్టం
- 6 బీజేపీ రాష్ట్రాలకు 1.07లక్షల కోట్లు
- ఏపీకి రూ.5,399 కోట్లు

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఏపీపై కేంద్రానిది మూమ్మాటికీ సవతి తల్లి ప్రేమే అని మరో సారి తేలింది. జాతీయ రహదారుల ప్రాజెక్టుల నిర్మాణంపై కేంద్రం అధికారికంగా వెల్లడించిన నివేదికే ఆ విషయాన్ని తేటతెల్లం చేసింది. రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ(ఎంఓఆర్‌టీహెచ్) తాజాగా ప్రకటించిన నివేదికలోని గణాంకాలు.. కేంద్రం ఏపీపై చూపించిన సవతి ప్రేమను, బీజేపీ పాలిత రాష్ట్రాలైన యూపీ, మహారాష్ట్ర, గుజరాత్, జార్ఖండ్, ఉత్తరాఖండ్‌లతోపాటు మొన్నటి వరకు ఆ పార్టీ ఏలుబడిలో ఉన్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లపై చూపించిన శ్రద్ధను నిరూపిస్తున్నాయి. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక 2014-2018 నాలుగేళ్ల కాలంలో దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొత్తగా నిర్మించిన జాతీయ రహదారు(ఎన్‌హెచ్)లు, ఖర్చుపెట్టిన లెక్కలు ఆ నివేదికలో ఉన్నాయి. విభజనతో దెబ్బతిన్న ఏపీకి భారీగా రహదారులు, నిధులు ఇచ్చామని కేంద్రం ఇప్పటిదాకా చెబుతూ వస్తోంది. నాలుగేళ్ల వ్యవధిలో 1459 కి.మీ. మేర కొత్తగా జాతీయ రహదారులను నిర్మించినట్లు, ఇందుకోసం రూ.9,383 కోట్లు ఖర్చుపెట్టినట్లు పేర్కొంది. అయితే, ఎన్‌హెచ్‌లపై పెట్టిన ఖర్చులో తిరకాసు ఉంది. ఇందులో ఏడు ప్రతిపాదిత ప్రాజెక్టుల ఖర్చు రూ.3985 కోట్లు కూడా ఉంది. అంటే వాస్తవిక వ్యయం రూ.5,399 కోట్లు మాత్రమే. దీన్ని కేంద్రం పరోక్షంగా ఉటంకించింది. నాలుగేళ్ల వ్యవధిలో దేశవ్యాప్తంగా 28,532 కి.మీ.మేర జాతీయ రహదారులు నిర్మించిన కేంద్రం ఇందుకోసం రూ.2.28 లక్షల కోట్లు ఖర్చుపెట్టింది. ఇందులో ఏపీకి కేటాయించిన నిధులు, నిర్మించిన రహదారులు చాలా స్వల్పం. మన రాష్ట్రానికి సంబంధించి రూ.3985 కోట్ల ప్రతిపాదిత ప్రాజెక్టుల బడ్జెట్ ఉంది. అంటే ఇంకా అవి పట్టాలెక్కలేదు. నికర వ్యయం రూ.5,399 కోట్లు మాత్రమే. అక్షరక్రమంలో నంబర్ 1గా ఉన్న ఏపీని.. నిధుల కేటాయింపు, వ్యయంలో 10వ నంబరులోకి నెట్టేశారు. కేవలం ఆరేడు బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే రూ.1.07 లక్షల కోట్లు ఖర్చుపెట్టారు. ఉత్తరప్రదేశ్‌లో గణనీయంగా రూ.38,148 కోట్లు వెచ్చించారు. ఆ తర్వాత మహారాష్ట్రకు రూ.21,937 కోట్లు వ్యయం చేశారు.

రాష్ట్రాల్లో ఎన్‌హెచ్‌ల నిర్మాణ ఖర్చు

రాష్ట్రం	ఖర్చు(రూ.కోట్లలో)
ఉత్తరప్రదేశ్	38,522
మహారాష్ట్ర	21,937
రాజస్థాన్	13,614
మధ్యప్రదేశ్	9,266
గుజరాత్	7,234
ఛత్తీస్‌గఢ్	6,548
ఉత్తరాఖండ్	5,466
జార్ఖండ్	5,192
మొత్తం	1,07,779
బిహార్	14,797
ఆంధ్రప్రదేశ్	5,399

అవసరం లేకపోయినా..!

మొన్నటి వరకూ కమలం ఏలుబడిలో ఉన్న రాజస్థాన్‌లో 4,116 కి.మీ. మేర జాతీయ రహదారులను నిర్మించింది. దేశంలో ఈ రాష్ట్రానిదే ఎక్కువ వాటా. ఆ తర్వాతి స్థానం మహారాష్ట్రదే. ఇక్కడ 2544 కి.మీ., యూపీలో 2489 కి.మీ., మధ్యప్రదేశ్‌లో 1710 కి.మీ., ఛత్తీస్‌గఢ్‌లో 1639 కి.మీ., ఉత్తరాఖండ్‌లో 843 కి.మీ., జార్ఖండ్‌లో 691 కి.మీ., గుజరాత్‌లో 691 కి.మీ. మేర కొత్తగా జాతీయ రహదారులు నిర్మించింది. అవసరానికిమించి అంటే ట్రాఫిక్ ఏమాత్రం లేనిచోట కూడా 4, 6, 8 వరుసల రహదారులను నిర్మించారు. 4 వరుసలు ప్రతిపాదించిన చోట 6 వరుసల జాతీయ రహదారులను నిర్మించేలా ప్రతిపాదనలు మార్చారు.

దక్షిణాదికి విదిలింపులు

దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలపై కేంద్రం వివక్ష చాలా స్పష్టంగా ఉంది. ఒక్క ఏపీ నుంచి కొత్తగా 2,700 కి.మీ.మేర జాతీయ రహదారులను నిర్మించాలని, 7 స్టేట్ హైవేలను జాతీయ రహదారులుగా మార్చాలని కోరుతూ పంపించిన నివేదికలను తొక్కిపెట్టారు. అ నంతపురం-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేకు నంబర్ కూడా కే టాయించలేదు. నాలుగేళ్లలో కేవ లం 1459 కి.మీ. మేర కొత్తగా ర హదారులు నిర్మించారని పేర్కొన్నారు. కేరళకు 101 కి.మీ. కొత్త ఎన్‌హెచ్‌లను నిర్మించారు. ఎన్డీయేను సమర్థిస్తోన్న తమిళనాడుకు మొండిచేయి చూపించారు. నాలుగేళ్లలో కలిపి 1000కి.మీ. కొత్త రోడ్లు నిర్మించారు.

వైసీపీ నేతల విచారణ

- కోడికత్తి కేసులో ప్రశ్నించిన ఎన్ఐఏ
- మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు సాగిన దర్యాప్తు
- రాష్ట్ర పిటిషన్‌పై రేపు హైకోర్టులో విచారణ


విశాఖలో ఎన్ఐఏ విచారణకు హాజరైన వైసీపీ నేతలు

విశాఖపట్నం/ముమ్మిడివరం/సాలూరు/అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్‌పై కోడికత్తితో దాడిచేసిన కేసులో ప్రత్యక్ష సాక్షులను ఎన్ఐఏ అధికారులు విచారించారు. ఇందుకోసం ఎన్ఐఏ అదనపు ఎస్పీ సాజిద్‌ఖాన్‌తోపాటు మరో అధికారి శనివారం విశాఖ చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయ్‌ప్రసాద్ నివాసంలో వైసీపీ నేతలు మళ్ల విజయ్‌ప్రసాద్, తైనాల విజయ్‌కుమార్, కరణం ధర్మశ్రీ, పీడిక రాజన్నదొర, మజ్జి శ్రీనివాసరావు, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, తిప్పల నాగిరెడ్డి, కేకే రాజు, జియ్యాని శ్రీధర్, కొండా రాజీవ్‌గాంధీ, కృష్ణకాంత్ తదితరులను మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకూ విచారించారు. ఆ రోజు ఏం జరిగింది? అడిగి తెలుసుకున్నారు. ఎయిర్‌పోర్టుకు ఎన్ని గంటలకు వెళ్లారు? జగన్ ఎన్ని గంటలకు వచ్చారు? ముందుగా వెళితే ఎక్కడ గడిపారు? వీఐపీ లాంజ్‌లోకి ఎంట్రీపాస్ ఉందా? లేదా? పాసు లేకుంటే వీఐపీ లాంజ్‌లోకి వెళ్లేందుకు ఎవరు అనుమతించారు? లాంజ్‌లో ఎవరెవరున్నారు? నిందితుడు శ్రీనివాసరావును దాడి కి ముందు ఎప్పుడైనా చూశారా? అంటూ ఆరా తీశారు. ఓ అధికారి తెలుగులో ప్రశ్నలడిగి, సమాధానాలు రాబట్టి, ఆ వివరాలు సాజిద్‌ఖాన్‌కు హిందీలో అనువదించి చెబితే...ఆయన రాసుకున్నారు. ఒక్కొక్కరిని 10 నుంచి 15 నిమిషాలపాటు విచారించారు. ఎమ్మెల్యే రాజన్నదొర విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్షనేతపై దాడి కేసులో పాత్రదారులను కాకుండా సూత్రదారులను విచారించాలని ఎన్ఐఏ అధికారులను కోరామన్నారు. అలాగే, ఎయిర్‌పోర్టు క్యాంటీన్ యజమాని హర్షవర్ధన్‌ను ఎన్ఐఏ అధికారులు విచారించినట్టు తెలిసింది.

శ్రీనివాసరావు ఆర్థిక లావాదేవీలపై ఆరా..

తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలంలోని నిందితుడు శ్రీనివాసరావు స్వగ్రామం ఠాణేలంకలో శనివారం కూడా ఎన్ఐఏ అధికారుల బృందం విచారణ నిర్వహించింది. శుక్రవారం కూడా గ్రామంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విచారించినట్టు సమాచారం. శ్రీనివాసరావుకు ఉత్తరం రాసిచ్చిన జనిపెల్ల విజయదుర్గను ఆ గ్రామ వీఆర్వో సమక్షంలో మళ్లీ విచారించి, చేతిరాతను పరీక్షించేందుకు కొన్ని లేఖలు రాయించుకున్నారు. జగన్‌తో నిందితుడు కలిసి ఉన్న ఫ్లెక్సీ వేయించిన వ్యక్తులను, ఉత్తరం జిరాక్స్ కాపీ తీయించిన జనిపెల్ల శివసుబ్రహ్మణ్యాన్ని విచారించినట్టు సమాచారం. నిందితుడి ప్రవర్తన, తల్లిదండ్రులు తాతారావు, సావిత్రి, సోదరుడు సుబ్బరాజు ఆస్తిపాస్తులు, ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు రుణాలపైనా ఆరాతీశారు. ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిపై గతంలో నమోదైన కేసు వివరాలు, ఎయిర్‌పోర్టు క్యాంటీన్‌లో కుక్‌గా చేరిన సమయంలో ఎన్‌వోసీ కోసం దరఖాస్తు చేసుకున్నాడా? అని ఆరా తీసినట్టు తెలిసింది. అలాగే, ఈ కేసును ఎన్ఐఏకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ సోమవారం విచారణకు రానుంది. అదేరోజు వాదనలు వినిపించాలని కోర్టు ఆదేశించింది. దీంతో సోమవారం వాదనలు వినిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రేపు దావోస్‌కు లోకేశ్

- ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా పెట్టుబడుల వేట
- కీలక వేదికలపై ప్రసంగం



అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సుకు ఐటీ శాఖ మంత్రి లోకేశ్ బృందం వెళ్లనుంది. సోమవారం బయల్దేరి వెళ్లి 24వ తేదీవరకు దావోస్ వేదికగా పెట్టుబడుల వేట సాగించనుంది. పలు ప్రఖ్యాత కంపెనీల సీఈవోలు, చైర్మన్లతో మంత్రి భేటీ అవుతారు. పలు కీలక అంశాలపై దావోస్ వేదికపై ప్రసంగించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్‌కు వెళ్లాలని తొలుత అనుకున్నారు. అయితే, రాజకీయంగా బిజీ కావడం, గణతంత్ర ఉత్సవాలు ఉండడం తదితర కారణాలతో ఆయన రద్దుచేసుకున్నారు. కాండ్యుయెంట్, టీసీఎల్, అదానీ డేటా పార్క్, రిలయన్స్ జియో, ఫ్లెక్స్‌ట్రానిక్స్ వంటి ప్రఖ్యాత కంపెనీలు లోకేశ్ చొరవతోనే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాయి. డిక్సన్, ఫాక్స్‌కాన్, సెల్‌కాన్ లాంటి సంస్థల్ని రాష్ట్రానికి రప్పించడంలో కీలకపాత్ర పోషించారు. వీటన్నింటి దృష్ట్యా దావోస్ వెళ్లే బృందానికి సారథ్యం వహించే బాధ్యతను లోకేశ్‌కు అప్పగించారు. ఈ బృందం దావోస్‌లో డెలాయిట్, ప్రొక్టర్ అండ్ గేంబుల్, విప్రో, పెగా సిస్టమ్స్, ఆర్సెలార్ మిట్టల్, నెస్లే, ఏటీ అండ్ టీ, ఇన్వోస్కో కంపెనీల ప్రతినిధులతో భేటీ కానుంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మొదటి స్థానంలో నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న విధానాలు, ఇస్తున్న రాయితీలు ఆయా కంపెనీల ప్రతినిధులకు బృందం సభ్యులు వివరించనున్నారు. లోకేశ్ బృందం దావోస్‌లో అడుగుపెట్టేనాటికి అక్కడ మైనస్ 7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుందని వాతావరణ శాఖ అంచనా వేసిం ది. ఇలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రోజుకు దాదాపు 15గంటలకు పైగా సాగే వివిధ సమావేశాల్లో ఈ బృందం పాల్గొననుంది. ఈ బృందంలో వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, వ్యవసాయ రంగ ప్రభుత్వ సలహాదారు విజయకుమార్, ఇంధనం, మౌలిక, పెట్టుబడుల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ఏపీఈడీబీ సీఈవో జాస్తి కృష్ణకిషోర్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఆరోఖియారాజ్, ఏపీఐఐసీ ఎండీ అహ్మద్‌బాబు, సమాచార శాఖ కార్యదర్శి రామాంజనేయులు, ఐటీ ఓఎస్డీ కిరణ్ గుత్తా, ఐటీ జీఎం శ్రీనివాస్ తదితరులు ఉంటారు. 21న లోకేశ్ బృందం దావోస్ చేరుకొంటుంది. 22న డెలాయిట్, ప్రొక్టర్ అండ్ గేంబుల్, విప్రో, పెగా సిస్టమ్స్ తదితర మెగా కంపెనీల అధినేతలతో భేటీ అవుతుంది. 23న ఎజైల్ గవర్నెన్స్, డిజిటల్ గవర్నెన్స్, ఇండియా 4.0 అంశాలపై లోకేశ్ కీలకోపన్యాసం చేస్తారు. 24న సస్టెయినబుల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తదితర అంశాలపై చర్చలు జరుపుతారు.

కర్నూలు 'ఫార్మా క్లస్టర్'కు కేంద్రం సాయం

న్యూఢిల్లీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఏర్పాటు చేస్తున్న ఫార్మా క్లస్టర్ పార్కుకు సహకారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ మేరకు సంబంధిత లేఖను ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్‌కు శనివారం కేంద్రం అందించింది. అయితే, డీపీఆర్‌ను రూపొందించి 6 నెలల్లోపు స్కీమ్ స్టీరింగ్ కమిటీకి అందించాలని ఆదేశించిం ది. కాగా, విశాఖపట్నం మెడిటెక్‌కు సాయంపై వారంలో ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్టు ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో ఆ అమ్మాయి సంచలన విజయాలకు మారుపేరు. ఎనిమిదేళ్ల వయస్సులో రాకెట్ పట్టిన ఆ తెలుగు షట్లర్.. నేడు అంతర్జాతీయ వేదికలపై మెరుపులు మెరిపించడానికి సిద్ధమవుతోంది. ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్స్ టోర్నీ డబుల్స్ టైటిల్‌ను వరుసగా నాలుగుసార్లు నెగ్గిన ఈ షట్లర్ భారత బ్యాడ్మింటన్ డబుల్స్ భవిష్యత్ స్టార్‌గా ఎదుగుతోంది. గుత్తా జ్వాల, అశ్విని పొన్నప్ప, సిక్కిరెడ్డి తర్వాత ఆస్థాయిలో రాణిస్తున్న ఆమె పేరు జక్కంపూడి మేఘన. ఈ ఏడాది జరిగే ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో రాణించాలన్న కసితో శ్రమిస్తోంది ఈ డబుల్ బుల్లెట్.

రాకెట్ వేగంతో..


మేఘన

మేఘన తండ్రి రాజేంద్ర కుమార్ ఒకప్పుడు బ్యాడ్మింటన్ క్రీడాకారుడు. ఇప్పుడు కోచ్‌గా పనిచేస్తున్నాడు. వీరి స్వస్థలం విజయవాడ. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. మేఘన బ్యాడ్మింటన్ ప్రయాణంలో తండ్రిదే ప్రధానపాత్ర. తండ్రిగా కంటే కోచ్‌గానే కూతురితో ఎక్కువ సమయం గడుపుతాడు.

చెస్ నుంచి బ్యాడ్మింటన్‌కు..

మేఘనకు ప్రస్తుతం షటిల్ కోర్టే ప్రపంచమైనా.. ఐదేళ్ల వయస్సులో చెస్‌పై ఆమెకున్న ఆసక్తి గమనించిన తల్లిదండ్రులు అందులో శిక్షణ ఇప్పించారు. మేఘన చురుకుదనం చూసి చెస్‌లో ఆమెకు మంచి భవిష్యత్ ఉంటుందనే ఉద్దేశంతో ఆటపై పూర్తి స్థాయిలో దృష్టి పెడితే బాగుంటుందని కోచ్ సూచించాడు. చదువుకు దూరం కావడం ఇష్టం లేని మేఘన నెమ్మదిగా చెస్‌పై ఆసక్తిని తగ్గించుకొంది. ఆతర్వాత బ్యాడ్మింటన్‌వైపు అడుగులు వేసింది. అయితే తొలినాళ్లలో ఆమెను బ్యాడ్మింటన్ ఆడాలని తండ్రి ప్రోత్సహించలేదు. అందులో ఎదురయ్యే ఇబ్బందులు, ఒత్తిళ్ల గురించి వివరించాడు. అయినా, మేఘన బ్యాడ్మింటన్‌పై ఉన్న అనురక్తితో షటిల్ కోర్టులోకి అడుగు పెట్టింది. ఆ తర్వాత ఆమె చిత్తశుద్ధి, కష్టపడే తత్వాన్ని గమనించి రాజేంద్ర ప్రోత్సాహించడం ప్రారంభించాడు.

అబ్బురపరిచే విజయాలు..

ఎనిమిదేళ్లప్పుడు నాన్నతో కలిసి ఆడడం ప్రారంభించిన మేఘన అనతి కాలంలోనే అబ్బురపరిచే విజయాలు సాధించి శభాష్ అనిపించుకుంది. 2012 జైపూర్‌లో జరిగిన జాతీయ జూనియర్ చాంపియన్‌షిప్ అండర్-19 డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచి వెలుగులోకి వచ్చింది. తర్వాతి ఏడాది బ్యాంకాక్‌లో జరిగిన ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్ డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ రాణించి క్వార్టర్స్ దాకా చేరగలిగింది. 2014లో ముంబై వేదికగా జరిగిన టాటా ఓపెన్‌లో డబుల్స్ విజేతగా అవతరించి సత్తా చాటింది. ఇదే టోర్నీలో మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం సాధించింది. ఇక ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టోర్నీలో డబుల్స్ టైటిల్‌ను 2014 నుంచి వరుసగా నాలుగుసార్లు గెలుచుకుంది. ఇదే టోర్నీలో గత ఏడాది మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌నూ కైవసం చేసుకొంది. ఇలా ప్రారంభమైన మేఘన ప్రయాణం నేడు ప్రపంచంలోని మేటి క్రీడాకారులను ఢీకొట్టే స్థాయికి చేరుకుంది.



టార్గెట్.. ఆల్ ఇంగ్లండ్

నేను ఆటలో ఈస్థాయికి రావడానికి కారణం మా అమ్మానాన్నలే. ఎల్లప్పుడు వెంట వుండే అమ్మ, వేలు పట్టుకొని లక్ష్యం వైపు నడిపించే నాన్న తోడుగా ఉండడం నా అదృష్టం. ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటేందుకు కఠోరంగా శ్రమిస్తున్నా.

- మేఘన

గోపీచంద్ సూచనతో..

తొలుత సింగిల్స్ ప్లేయర్‌గానే కెరీర్ ఆరంభించిన మేఘన భారత బ్యాడ్మింటన్ ప్రధాన కోచ్ పుల్లెల గోపీచంద్ సూచనతో డబుల్స్‌కు మారింది. అలా డబుల్స్ బరిలోకి దిగిన ఆమె స్వల్ప వ్యవధిలోనే సత్ఫలితాలను రాబట్టింది. 17 ఏళ్ల వయస్సులో తొలి డబుల్స్ టైటిల్ నెగ్గిన మేఘన ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు.

డాక్టర్ అవ్వాలనుకొని..

ఇంటర్మీడియెట్ చదువుతున్న సమయంలో ఎంబీబీఎస్ చేసి డాక్టర్ కావాలని మేఘన తలిచింది. అయితే బాల్యం నుంచి ప్రేమించిన రాకెట్ కోసం వైద్యవిద్యను అభ్యసించాలన్న తన కోర్కెను పక్కన పెట్టింది. అనంతరం బీఏ డిగ్రీ పూర్తి చేసి ఎంబీఏ చదువుతోంది. ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ కోసం కఠోరంగా శ్రమిస్తున్న మేఘన ఇందులో అంచనాలకు తగ్గట్టు రాణిస్తే భారత బ్యాడ్మింటన్ డబుల్స్‌కు మరో స్టార్ దొరికినట్టే.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి)

మైదాన్
MYDAN
విజయవాడ • ఆదివారం 20 జనవరి 2019

రోజర్ ఫెడరర్, రఫెల్ నడాల్, నొవాక్ జొకోవిచ్‌ల శకంలో మరొక టెన్నిస్ ఆటగాడిని ఊహించడం కష్టమే. కానీ ఆ ఊహను నిజం చేసిన ప్లేయర్ ఆండీ మర్రే. బ్రిటన్‌కు చెందిన ఈ దిగ్గజ ఆటగాడు 'బిగ్ ఫోర్'లో స్థానం సంపాదించాడంటే అతడి సత్తా ఏపాటిదో తెలుస్తుంది. ఫెడెక్స్, స్పెయిన్ బుల్, జొకోను తలదన్ని నెంబర్ వన్ ర్యాంక్‌నూ సొంతం చేసుకోవడం అంతర్జాతీయ టెన్నిస్‌లో మర్రేను మొనగాడిగా నిలబెట్టింది. ఇక సొంత దేశంలో మర్రే ఓ హీరో. ఇటీవల గ్రాండ్‌స్లామ్‌లకు వీడ్కోలు పలుకుతూ అతడు తీసుకున్న నిర్ణయం ఆ దేశ ప్రజలను విచారంలో ముంచెత్తిందంటే మర్రే క్రేజ్ అర్థమవుతుంది. ఆండీ విగ్రహాన్ని ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో ఏర్పాటు చేయాలని వింబుల్డన్ నిర్వాహకులు నిర్ణయించడం మర్రే గొప్పతనానికి మచ్చుతునక.


ఆండీ మర్రే

ఆ ముగ్గురికి సరైనోడు

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఫెడరర్, నడాల్, జొకోవిచ్ మాదిరి అనేక గ్రాండ్‌స్లామ్‌లు గెలవలేకపోవచ్చు. సాధించింది రెండు వింబుల్డన్, ఓ ఫ్రెంచ్ కిరీటాలే కావొచ్చు. కానీ ఆ ముగ్గురితో ఆండీ మర్రే మ్యాచ్‌లు టెన్నిస్ అభిమానులకు కలకాలం గుర్తుండిపోతాయి. అందుకే ఆండీ మర్రే పేరు అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ సర్క్యూట్‌లో మార్మోగుతుంటుంది.

మూడేళ్ల వయస్సులోనే..

జూడీ, విలియమ్ మర్రే దంపతులకు 1987, మే 17 స్కాట్లండ్‌లోని గ్లాస్గోలో జన్మించాడు ఆండీ బారన్ మర్రే. తల్లి జూడీ టెన్నిస్ ప్లేయర్ కావడంతో మూడేళ్ల వయస్సులోనే అతడు రాకెట్ చేతబట్టాడు. తొలినాళ్లలో తల్లి జూడీ, అన్న జేమీ మర్రేనే జూనియర్ మర్రేకు టెన్నిస్ పాఠాలు నేర్పారు. ఎనిమిదేళ్ల వయస్సులో అంటే.. 1996లో జరిగిన ఓ దుర్ఘటన మర్రే జీవితంలో చేదు జ్ఞాపకాలను మిగిల్చింది. డన్‌బ్లేన్ ప్రాథమిక పాఠశాలలో ఉండగా చేతిలో గన్‌తో స్కూల్‌లో ప్రవేశించిన థామస్ హామిల్టన్ అనే వ్యక్తి వస్తూనే విచక్షణా రహితంగా కాల్పులు జరిపాడు. తన ఉన్మాద చర్యతో 16మంది విద్యార్థులు, ఒక టీచర్‌ను బలిగొన్న థామస్.. అదే తుపాకీతో తనను తాను కాల్చుకున్నాడు. అయితే కాల్పులు ప్రారంభం కాగానే ప్రిన్సిపాల్ రూంలోకి పరిగెత్తి దాక్కోవడంతో మర్రే ప్రాణాలతో బయటపడ్డాడు. ఆ ఘోరానికి ప్రత్యక్ష సాక్షి అయిన ఆండీ.. దానిని మరిచిపోయి టెన్నిస్‌పై దృష్టి పెట్టడానికి చాలాకాలమే పట్టింది. 1999లో 11ఏళ్ల వయస్సులో ప్రతిష్ఠాత్మక ఫ్లోరిడా ఆరెంజ్ బౌల్ యూత్ చాంపియన్‌షిప్‌తో తొలి టైటిల్ గెలిచిన మర్రే.. 2001లోనూ ఈ టోర్నీలో విజేతగా నిలిచాడు. ఈ చాంపియన్‌షిప్ టైటిల్‌ను రెండుసార్లు నెగ్గిన జిమ్మీ కానర్స్, మోనికా సెలెస్ సరసన మర్రే నిలిచాడు. 2004లో యూఎస్ ఓపెన్ జూనియర్ చాంపియన్‌షిప్ గెలిచాడు. అంతేకాదు వరల్డ్ జూనియర్ నెంబర్ వన్ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. తదుపరి ఏడాది బీబీసీ 'యంగ్ స్పోర్ట్స్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్' అవార్డు దక్కించుకున్నాడు.

మర్రే.. నీవు కోర్టు లోపలా, బయటా చాంపియన్. నువ్వు టెన్నిస్‌కు వీడ్కోలు పలుకుతున్నందుకు బాధగా ఉంది. టెన్నిస్‌లో సమానత్వం కోసం చేసిన నీ పోరాటం భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది.

- మర్రే రిటైర్మెంట్‌పై టెన్నిస్ దిగ్గజం బిల్లీ జీన్ కింగ్

ప్రొఫెషనల్‌గా..

డేవిస్ కప్‌లో ఆడిన అతి పిన్న వయస్సు బ్రిటిష్ ఆటగాడిగా ఘనత సాధించిన కొద్దికాలానికే 2005లో మర్రే ప్రొఫెషనల్ కెరీర్‌కు శ్రీకారం చుట్టాడు. 2006లో సిన్సినాటి మాస్టర్స్ రెండోరౌండ్‌లో టాప్ ర్యాంకర్ ఫెడరర్‌ను కంగుతినిపించి సంచలనం సృష్టించాడు. ఇదే ఏడాది మరో ప్రముఖ ఆటగాడు ఆండీ రాడిక్‌ను ఓడించి ఎస్‌ఏటీ చాంపియన్‌షిప్‌తో తొలి ఏటీపీ టైటిల్ తన ఖాతాలో వేసుకున్నాడు. 2007లోనూ ఎస్‌ఏపీ టైటిల్ నిలబెట్టుకోవడంతో పాటు సెయింట్ పీటర్స్‌బర్గ్ ఓపెన్ విజేతగా నిలిచి తొలి పది ర్యాంకుల్లోకి దూసుకొచ్చాడు.

నడాల్‌పై విక్టరీతో..

స్పెయిన్ సంచలనం నడాల్‌ను మట్టికరిపించి 2008 యూఎస్ ఓపెన్‌లో టైటిల్ ఫైట్‌కు చేరడంతో టెన్నిస్ ప్రపంచంలో మర్రే పేరు మార్మోగింది. ఫైనల్లో ఫెడరర్ చేతిలో ఓడినా 2009లో రెండో ర్యాంక్‌తో కెరీర్‌లో తొలిసారి అత్యుత్తమ ర్యాంక్‌ను అందుకున్నాడు. 2010, 2011లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మర్రే రన్నరప్‌గా నిలిచాడు. 2012లో మర్రే వింబుల్డన్ ఫైనల్‌కు చేరడంతో బ్రిటన్‌తో పాటు స్కాట్లండ్ కూడా మురిసింది. 1938 తర్వాత ఓ బ్రిటన్ ఆటగాడు ఆల్ ఇంగ్లండ్ క్లబ్ అంతిమ సమరానికి చేరడం అదే తొలిసారి. కానీ ఫైనల్లో ఫెడరర్ చేతిలో ఓడాడు. అయితే 2012 లండన్ ఒలింపిక్స్‌లో ఫెడరర్‌పై ప్రతీకార విజయంతో స్వర్ణ పతకాన్ని సగర్వంగా తన మెడలో వేసుకున్నాడు ఆండీ. అదే ఏడాది యూఎస్ ఓపెన్ ఫైనల్‌తో మర్రే ఆట శిఖరానికి చేరింది. ఐదుసెట్ల పోరులో జొకోవిచ్‌ను చిత్తుచేసి కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్‌ను ముద్దాడాడు. 1977లో ఫ్రెడ్ పెర్రీ తర్వాత యూఎస్ ఓపెన్ గెలిచిన తొలి బ్రిటన్ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. 2013 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జొకోవిచ్‌కు తలవంచిన ఆండీ.. వింబుల్డన్‌లో అదే జొకోను ఓడించి టైటిల్ నెగ్గడం ద్వారా చరిత్ర పుటలకెక్కాడు. 77 ఏళ్ల అనంతరం ఆల్ ఇంగ్లండ్ క్లబ్ విజేతగా నిలిచిన బ్రిటన్ ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాడు.

వెన్నుముక సర్జరీ..

2013లో వెన్నుముక సర్జరీతో మర్రే ఆట దిగజారింది. 2014లో అదేతీరు కొనసాగగా తదుపరి ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ చేరడంతో ఆట గాడిన పడింది. అదే ఏడాది బ్రిటన్ జట్టు డేవిస్ కప్ గెలవడంలో మర్రే కీలక భూమిక పోషించాడు. 2015లో మియామీ టైటిల్‌తో కెరీర్‌లో 500వ విజయం సాధించాడు. 2016లో ఆండీ కెరీర్ మరింత ఉచ్ఛస్థితికి చేరింది. రెండోసారి వింబుల్డన్ టైటిల్‌తో పాటు ఒలింపిక్ గోల్డ్ మెడల్ కొట్టడమేకాదు.. నెంబర్‌వన్ ర్యాంక్‌నూ సొంతం చేసుకున్నాడు. అయితే 2017లో ముంజేయి, తుంటి గాయాలతో అతడి ఆట పూర్తిగా గాడి తప్పింది. 2018లో తుంటి శస్త్రచికిత్స చేయించుకొని ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అడుగుపెట్టినా తొలిరౌండ్ దాటలేకపోయాడు. అంతకుముందే.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను తన చివరి గ్రాండ్‌స్లామ్‌గా మర్రే ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. మర్రేను గౌరవిస్తూ వింబుల్డన్‌లో అతడి విగ్రహాన్ని నెలకొల్పాలని ఆల్ ఇంగ్లండ్ క్లబ్ నిర్వాహకులు తీర్మానించడం విశేషం.

జాతీయతపై వివాదం

స్కాట్లండ్‌లో పుట్టి బ్రిటన్‌లో నివసిస్తున్న మర్రే జాతీయతపై పలుమార్లు వివాదం తలెత్తింది. స్కాట్లండ్‌కు స్వాతంత్ర్యం కల్పించడంపై 2014లో జరిగిన రెఫరెండానికి మద్దతు ఇచ్చిన మర్రేపై విమర్శలు వెల్లువెత్తాయి. 55 శాతం మంది స్కాట్లండ్ స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా ఓటు వేయడంతో...స్వాతంత్ర్యానికి అనుకూలంగా తాను మాట్లాడడంపై పశ్చాత్తాపమేమీ లేదని ఆండీ అంటాడు.


భార్య కిమ్ సియర్స్‌తో..

కెరీర్ రికార్డ్

సింగిల్స్ 663-191

కెరీర్ టైటిల్స్ -43

గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు- 3 (ఒక ఫ్రెంచ్ ఓపెన్, 2 వింబుల్డన్)

డబుల్స్ కెరీర్ రికార్డ్

67-71

టైటిల్స్ -2

కెరీర్ ప్రైజ్‌మనీ

రూ. 434 కోట్లు

ఆటే కాదు..

చిరకాల ప్రేయసి కిమ్ సియర్స్‌ను 2015లో పెళ్లాడిన మర్రేకు ఇద్దరు కూతుళ్లు సోఫియా, ఎడి. ఆటతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్న ఆండీ..సమాజ సేవ తో మరింతగా మన్ననలు పొందాడు. 'మలేరియా నో మోర్ ఇన్ యూకే' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి దేశం నుంచి మలేరియాను పారదోలేందుకు కృషి చేస్తున్నాడు. ఇంకా పలు సేవా కార్యక్రమాలకు నిధుల సేకరణ కోసం జరిగే చారిటీ మ్యాచ్‌ల్లో 31 ఏళ్ల ఆండీ ముందుంటాడు. ఏటీపీ టూర్ మ్యాచ్‌ల్లో పురుషులు, మహిళలకు సమాన ప్రైజ్ మనీకోసం గళమెత్తిన ప్లేయర్లలో మర్రే అగ్రభాగాన నిలిచాడు. అతడి సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా 2017లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'నైట్‌హుడ్' పురస్కారం అందుకున్నాడు.


రిషభ్ పంత్

చిన్నోడే కానీ గట్టోడు..

ధోనీ హవాలో భారత జట్టు మరో వికెట్ కీపర్ గురించి ఆలోచించాల్సిన అవసరమే లేకుండా పోయింది. అన్ని ఫార్మాట్లలోనూ అతడు జట్టును విజయపథంలో నడిపించగలిగాడు. కానీ టెస్టుల నుంచి ధోనీ తప్పుకొన్నాక ప్రత్యామ్నాయ కీపర్ కోసం జట్టు చాలా రోజులుగా అన్వేషించింది. దినేశ్ కార్తీక్, సాహా, పార్థివ్ పటేల్ పోటీలో నిలిచినా ఎవరూ స్థానాన్ని నిలబెట్టుకోలేకపోయారు. కానీ ఆ పరీక్ష యువ ఆటగాడు రిషభ్ పంత్ దగ్గర మాత్రం ఆగింది. జట్టులోకి వచ్చిందే తడవు అందరినీ ఆకట్టుకుంటూ దూసుకెళుతున్నాడు. టెస్టు ఫార్మాట్‌లో చోటును సుస్థిరం చేసుకుని ధోనీ వారసుడనిపించుకుంటున్నాడు. భవిష్యత్‌లోనూ అన్ని ఫార్మాట్లలోనూ కీపర్‌గా పోటీలో ముందున్నాడు.

యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్ క్రికెట్ కెరీర్ చాలా చిన్నది. 21 ఏళ్ల ఈ ఢిల్లీ కుర్రాడు గతేడాదే వన్డే, టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. 2017లో టీ20 జట్టులోకి వచ్చిన అతడు.. ఇప్పటి దాకా అన్ని ఫార్మాట్లలో కలిపి ఆడింది 22 మ్యాచ్‌లే. ఇందులో 10 టీ20లు, 3 వన్డేలు.. 9 టెస్టులున్నాయి. కానీ అప్పుడే తన ఆటతీరుతో విమర్శకుల ప్రశంసలతో పాటు పలు రికార్డులను అధిగమించాడు. ముఖ్యంగా టెస్టుల్లో అతడు ఎదుగుతున్న తీరు భవిష్యత్ తారను చూపుతోంది. ఆడిన 15 ఇన్నింగ్స్‌ల్లో అతడి సగటు 49.71గా ఉండడం విశేషం. ఇందులో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనల్లో అతడు చేసిన శతకాలు క్రికెట్ దిగ్గజాలను సైతం ఆశ్చర్యపరిచాయి. ఆసీస్ మాజీ కెప్టెన్ పాంటింగ్ అయితే 'మరో గిల్‌క్రిస్ట్ తయారవుతున్నాడు' అని కితాబివ్వడం.. కెరీర్ ఆరంభ దశలోనే ఉన్న పంత్ ఘనతను సూచిస్తుంది. ఆరంభం నుంచే బౌలర్లపై ఎదురుదాడికి దిగడం పంత్ శైలి. గిల్‌క్రిస్ట్ కూడా ఇలాగే లోయరార్డర్‌లో దిగి పేసర్లను ఆటాడుకునేవాడు. మరోవైపు వన్డే ప్రపంచకప్ తర్వాత ధోనీ కెరీర్‌కు ముగింపు పలికితే పంత్ అన్ని ఫార్మాట్లలో జట్టుకు కీపర్‌గా కొనసాగే అవకాశాలెక్కువగా ఉన్నాయి. ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగు టెస్టుల్లో పుజారా (521) తర్వాత పంత్ ఎక్కువ పరుగులు (350) సాధించాడు. అయితే అతడి కీపింగ్ సామర్థ్యం మరింత మెరుగవ్వాల్సి ఉన్నా అనుభవంలో రాటుదేలుతాడనడంలో సందేహం లేదు. ఇక స్వల్ప కాలంలోనే టెస్టుల్లో అతడు సాధించిన రికార్డులను ఓసారి పరిశీలిస్తే...

సిక్సర్‌తో ఖాతా తెరిచి: గతేడాది ఇంగ్లండ్ పర్యటనలోనే పంత్ టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. తొలి రెండు మ్యాచ్‌ల్లో బెంచ్‌కే పరిమితమైనా మూడో టెస్టులో చోటు దక్కించుకున్నాడు. ఎలాంటి బెరుకు లేకుండా క్రీజులోకి వచ్చిన పంత్ తన మార్క్‌ను ఘనంగానే చాటాడు. లెగ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ బౌలింగ్‌లో రెండో బంతినే సిక్సర్‌గా బాదాడు. తద్వారా టెస్టు ఫార్మాట్‌లో సిక్సర్‌తో పరుగుల ఖాతా తెరిచిన తొలి భారత క్రికెటర్‌గా.. ప్రపంచ క్రికెట్‌లో 12వ బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు.


ప్రేయసితో..

ఇంగ్లండ్‌లో 'తొలి' శతకం: లండన్‌లో జరిగిన చివరిదైన ఐదో టెస్టులో రిషభ్ శతకం సాధించి మరో ఘనతను అందుకున్నాడు. ఇది అతడికి రెండో టెస్టు. భారత వికెట్ కీపర్లలో అప్పటిదాకా ఇంగ్లండ్‌లో ఎవరూ మూడంకెల స్కోరు చేయలేదు. ఈ మ్యాచ్‌లో భారత్ ఓడినా పంత్ 146 బంతుల్లో 114 పరుగులతో మెరిశాడు. అంతకుముందు ధోనీ చేసిన 92 పరుగులే ఇంగ్లండ్‌లో అత్యధికం. అలాగే టెస్టుల్లో సెంచరీ చేసిన రెండో పిన్నవయస్కుడి (20 ఏళ్ల 342 రోజులు)గా అజయ్ రాత్రా (20 ఏళ్ల 148 రోజులు) తర్వాత నిలిచాడు.

అత్యధిక క్యాచ్‌లు పట్టిన కీపర్‌గా: ఆస్ట్రేలియా టూర్‌లో భారత్ ఆరంభ టెస్టు నెగ్గి చరిత్ర సృష్టించింది. అయితే ఇదే మ్యాచ్‌లో పంత్ టెస్టుల్లో అత్యధిక క్యాచ్ (11)లు పట్టిన కీపర్‌గా జాక్ రస్సెల్, డివిల్లీర్స్ సరసన నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు క్యాచ్‌లు పట్టిన అతడు రెండో ఇన్నింగ్స్‌లో ఐదు క్యాచ్‌లు అందుకున్నాడు. ఈక్రమంలో సాహా 10 క్యాచ్‌ల రికార్డును అధిగమించాడు. ఓ టెస్టు సిరీస్‌లో ఎక్కువ (20) క్యాచ్‌లు పట్టిన భారత కీపర్ కూడా పంతే.

ఆసీస్‌పై రికార్డుల శతకం: ఆసీస్ గడ్డపై పంత్ చేసిన శతకం పలు రికార్డులను తిరగరాసింది. సిడ్నీలో జరిగిన నాలుగో టెస్టులో అతడు అజేయంగా 159 పరుగులు సాధించాడు. దీంతో ఆసీస్‌లో సెంచరీ చేసిన తొలి భారత కీపర్‌గా నిలవడంతో పాటు విదేశాల్లో ధోనీ చేసిన అత్యధిక స్కోరు (2006లో పాక్‌పై 148)ను దాటేశాడు. ఓవరాల్‌గా వ్యక్తిగత స్కోర్లకు సంబంధించి ధోనీ (224), బుధి కుందేరన్ (192) తర్వాత మూడో భారత వికెట్ కీపర్‌గా ఉన్నాడు. అలాగే ఆసియా జట్ల నుంచి కూడా ఆస్ట్రేలియాలో ఇదే అత్యధిక స్కోరు. బంగ్లా వికెట్ కీపర్ ముష్ఫికర్ రహీమ్ కూడా 159 పరుగులే చేశాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
విజయవాడ ● ఆదివారం 20 జనవరి 2019



అనుష్క దిగ్గజమా?

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ సందర్భంగా టెన్నిస్ గ్రేట్ రోజర్ ఫెడరర్‌ను విరాట్ కోహ్లీ, అనుష్క జంట కలుసుకుంది. ఈ సందర్భంగా ముగ్గురూ ఉన్న ఫొటోను ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ నిర్వాహకులు 'ముగ్గురు దిగ్గజాలు.. ఒక్క ఫొటోలో' అనే క్యాప్షన్‌తో ఆస్ట్రేలియన్ ఓపెన్ వెబ్‌సైట్‌లో పోస్టు చేశారు. దీనిపై నెటిజన్లు మండిపడ్డారు. అనుష్కను దిగ్గజంగా పేర్కొనడమేంటని ప్రశ్నించారు. ఫెడరర్, కోహ్లీ స్థాయి బాలీవుడ్ అనుష్కకు ఎక్కడిది అని అభిమానులు కామెంట్లతో విరుచుకుపడ్డారు.

భారత్ 'ఏ' తరఫున రిషభ్ పంత్



న్యూఢిల్లీ: ఇంగ్లండ్ లయన్స్‌తో జరగబోయే ఐదు వన్డేల సిరీస్ కోసం భారత్ 'ఏ' జట్లను ప్రకటించారు. ఈనెల 23న మ్యాచ్‌లు ప్రారంభం కానుండగా తొలి మూడు వన్డేలకు అజింక్య రహానె నేతృత్వం వహించనున్నాడు. అలాగే యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్ చివరి రెండు వన్డేల్లో బరిలోకి దిగబోతున్నాడు. 29, 31న జరిగే ఈ మ్యాచ్‌ల తర్వాత కివీస్‌తో జరిగే టీ20 సిరీస్ కోసం అతడు జాతీయ జట్టులో చేరతాడు. మరోవైపు శ్రేయాస్ అయ్యర్, హనుమ విహారి 'ఎ' తరఫున తొలి మూడు వన్డేలు ఆడనున్నారు. చివరి రెండు వన్డేలకు అంకిత్ బావ్నే కెప్టెన్‌గా ఉంటాడు. ఈ సిరీస్‌లో మ్యాచ్‌లన్నీ తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతాయి. ఇక ఫిబ్రవరి 3,4న జరిగే రెండు రోజుల వామప్ మ్యాచ్‌లో బోర్డు ప్రెసిడెంట్స్ ఎలెవన్ నుంచి రికీ భుయ్, అక్షత్ రెడ్డి బరిలోకి దిగనున్నారు.

ప్రొ బౌట్‌లో వికాస్ బోణీ



న్యూఢిల్లీ: ప్రొఫెషనల్‌గా బరిలోకి దిగిన తొలి బౌట్‌లోనే భారత బాక్సర్ వికాస్ క్రిషన్ విజయం నమోదు చేశాడు. అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన పోరులో స్థానిక బాక్సర్ స్టీవెన్ ఆండ్రడెపై వికాస్ నాకౌట్ విజయం సాధించాడు. అమెరికాకు చెందిన బాబ్ ఆరమ్స్ టాప్ ర్యాంక్ ప్రమోషన్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న వికాస్ రెండో రౌండ్‌లోనే ప్రత్యర్థిపై ఆధిక్యం ప్రదర్శించి విజేతగా నిలిచాడు.

బుమ్రా.. యార్కర్ల స్పెషలిస్ట్



వసీం అక్రమ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ప్రపంచ క్రికెట్‌లో యార్కర్లు సంధించడంలో జస్‌ప్రీత్ బుమ్రాను మించిన వారు లేరని పాక్ పేస్ దిగ్గజం వసీం అక్రమ్ కొనియాడాడు. ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలిచేందుకు పేసర్ బుమ్రా కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. 'ప్రస్తుత ఫాస్ట్‌బౌలర్లలో బుమ్రా అత్యంత ప్రభావవంతంగా యార్కర్లు సంధించగలడు. అతడి బౌలింగ్ శైలి ఇతరులకన్నా విభిన్నంగా ఉండడమే దీనికి కారణం. వన్డేల్లోనే కాకుండా టెస్టుల్లో కూడా ఇలా నిరంతరం యార్కర్లు వేయగలడు. అప్పట్లో నేను, వకార్ యూనిస్ కూడా ఇలా వేశాం. పాక్ నుంచి నేను, భారత్ నుంచి బుమ్రా టెన్నిస్ బాల్ క్రికెట్ నుంచి వచ్చినవాళ్లమే' అని సుల్తాన్ ఆఫ్ స్వింగ్‌గా పిలుచుకునే అక్రమ్ తెలిపాడు.

అక్కపై గెలిచి చెల్లితో పోటీకి..

- వీనస్ విలియమ్స్‌కు హలెప్ షాక్
- ప్రీ క్వార్టర్స్‌లో సెరెనాతో అమీతుమీ

ఆస్ట్రేలియన్ ఓపెన్

ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్‌లో విలియమ్స్ సిస్టర్స్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. అక్క, వీనస్ విలియమ్స్ మూడోరౌండ్లోనే ఇంటిబాట పట్టగా.. చెల్లి సెరెనా తన జోరు కొనసాగిస్తూ ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. టాప్ సీడ్ సిమోన హలెప్ మూడోరౌండ్లో వీనస్‌ను చిత్తుచేసి సెరెనాతో తదుపరి రౌండ్ పోరుకు సిద్ధమైంది. పురుషుల్లో టాప్‌సీడ్ జొకోవిచ్ నాలుగో రౌండ్‌కు చేరాడు.



వీనస్



సిమోన హలెప్

మెల్‌బోర్న్: ఒకరేమో ప్రపంచ నెంబర్ వన్.. మరొకరు 37 ఏళ్ల వయస్సులోనూ అలుపెరగని క్రీడాకారిణి. అలాంటి వీరి నడుమ పోటీ అంటే టెన్నిస్ అభిమానులకు కావాల్సినంత మజా. ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల నాలుగో రౌండ్‌లో సిమోన హలెప్, సెరెనా విలియమ్స్ నడుమ సమరం కోసం యావత్ ప్రపంచం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. శనివారం జరిగిన మూడో రౌండ్‌లో రొమేనియాకు చెందిన హలెప్ 6-2, 6-3తో సెరెనా సోదరి వీనస్ విలియమ్స్‌ను వరుస సెట్లలో చిత్తు చేసింది. సోమవారం జరిగే ప్రీక్వార్టర్‌ఫైనల్లో సెరెనాతో హలెప్ తలపడనుంది. ఎనిమిదో ఆస్ట్రేలియన్ ఓపెన్‌పై కన్నేసిన 16వ సీడ్ సెరెనా మూడో రౌండ్‌లో 6-2, 6-1తో ఉక్రెయిన్ టీనేజర్ డయానా ఎస్ట్రెంస్కాని చిత్తు చేసింది.



సెరెనా

జొకో జోరు..

పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ జొకోవిచ్ జోరు కొనసాగుతోంది. నొవాక్ 6-3, 6-4, 4-6, 6-0తో వర్ధమాన కెనడా ఆటగాడు డెన్నిస్ షపోవలోవ్‌పై మూడో రౌండ్‌లో గెలుపొందాడు. ఈ విజయం దరిమిలా.. టోర్నీ అనంతరం ప్రకటించే ర్యాంకింగ్స్‌లోనూ జొకోవిచ్ నెంబర్ వన్ స్థానం పదిలంగా ఉండనుంది. ప్రీక్వార్టర్‌ఫైనల్లో మరో యువ ఆటగాడు, 15వ సీడ్ డానిల్ మెద్వెదేవ్ (రష్యా)తో జొకోవిచ్ తలపడనున్నాడు. మెద్వెదేవ్ 6-2, 7-6 (3), 6-3 స్కోరుతో డేవిడ్ గోఫిన్ (బెల్జియం)పై మూడో రౌండ్‌లో నెగ్గాడు. పురుషుల ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరేవ్ (జర్మనీ) 6-3, 6-3, 6-2 స్కోరుతో అలెక్స్ బోల్ట్ (ఆస్ట్రేలియా)పై, 11వ సీడ్ బోర్నా కోరిక్ (క్రొయేషియా) 2-6, 6-3, 6-4, 6-3 స్కోరుతో సహచరుడు క్రజినోవిక్‌పై, 8వ సీడ్ కీ నిషికోరి (జపాన్) 7-6 (6), 6-1, 6-2 స్కోరుతో జొ సౌసా (పోర్చుగల్)పై, 16వ సీడ్ మిలోస్ రౌనిక్ (కెనడా) 6-4, 6-4, 7-6 (6) స్కోరుతో ప్రియరీ హెర్బర్ట్ (ఫ్రాన్స్)పై, 23వ సీడ్ పాబ్లో బుస్తా (స్పెయిన్) 6-2, 6-4, 2-6, 6-4 స్కోరుతో 12వ సీడ్ ఫాబియో ఫాగ్నిని ని (ఇటలీ)పై, 28వ సీడ్ లుకాస్ పౌలీ (ఫ్రాన్స్) 7-6 (3), 6-3, 6-7 (12), 4-6, 6-3 స్కోరుతో అలెక్సీ పాపిరిన్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించారు.

ఒసాకా త్రుటిలో..

మహిళల నాలుగో సీడ్ నవోమి ఒసాకా (జపాన్) త్రుటిలో మూడో రౌండ్‌లో ఓటమిని తప్పించుకుంది. తైవాన్‌కు చెందిన వెటరన్ హీసూ వీతో జరిగిన మ్యాచ్‌లో తొలి సెట్ కోల్పోయి, రెండో సెట్‌లో 1-4తో వెనుకంజలో నిలిచిన ఆమె ఆపై అద్భుతంగా పుంజుకొని 5-7, 6-4, 6-1తో గెలుపొంది ఊపిరి పీల్చుకుంది. ఆరో సీడ్ ఎలీనా స్వితోలినా (ఉక్రెయిన్) భుజం నొప్పితో బాధపడుతూ కూడా 4-6, 6-4, 7-5 స్కోరుతో జాంగ్ షూయి (చైనా) నెగ్గి నాలుగో రౌండ్‌లో అడుగుపెట్టింది. ఇతర మ్యాచ్‌ల్లో ఏడో సీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) 6-3, 3-6, 6-2 స్కోరుతో కమీలా గియోర్గి (ఇటలీ)ని, 13వ సీడ్ అనస్తాసియా సెవస్తోవా (లాత్వియా) 6-3, 6-3 స్కోరుతో వాంగ్ క్వియాంగ్ (చైనా)ని, 17వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 6-3, 6-2 స్కోరుతో ఎలిస్ మెర్టెన్స్ (బెల్జియం)ని, 18వ సీడ్ గార్బిన్ ముగురుజా (స్పెయిన్) 7-6 (5), 6-2 స్కోరుతో టిమియా బాసిన్‌స్కీ (స్విట్జర్లాండ్)ని ఓడించి ప్రీక్వార్టర్ ఫైనల్లో ప్రవేశించారు.

సెమీస్‌లో సైనా ఓటమి

కౌలాలంపూర్: కొత్త సీజన్‌ను గ్రాండ్‌గా ఆరంభించాలనుకున్న ఏస్ షట్లర్ సైనా నెహ్వాల్‌కు నిరాశే ఎదురైంది. మలేసియా ఓపెన్ సెమీస్‌లో ఓడి ఇంటిముఖం పట్టింది. శనివారం జరిగిన సెమీఫైనల్స్‌లో సైనా 16-21, 13-21తో ఒలింపిక్ చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్) చేతిలో పరాజయం పాలైంది. ఆదివారం జరిగే ఫైనల్లో థాయ్ షట్లర్ రచనోక్ ఇంటానన్‌తో మారిన్ తలపడనుంది.



ఫెడరరైనా.. ఐడీ చూపాల్సిందే !

మెల్‌బోర్న్: ఫెడరరైనా సరే.. రూల్ రూలే. లాకర్ రూమ్‌లోకి వెళ్లాలంటే ఎవరైనా ఐడీ కార్డు చూపాల్సిందే! శనివారం మెల్‌బోర్న్ పార్క్‌లో ప్రాక్టీస్ కోసం వచ్చిన సందర్భంగా రోజర్‌కు ఈ అనుభవం ఎదురైంది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్గొంటున్న ఆటగాళ్లు, అధికారులు, మీడియాకు నిర్వాహకులు అక్రిడిటేషన్ జారీ చేశారు. అక్రిడిటేషన్‌ను సెక్యూరిటీ వద్ద స్కాన్ చేశాకే ఎవరినైనా లోపలకు అనుమతిస్తారు. అయితే ఫెడరర్ ఐడీ కార్డు మర్చిపోయి రావడంతో అతణ్ని గార్డ్ ఆపాడు. కానీ అతడితో వాదనకు దిగకుండా..సహచరుడు వచ్చి తన ఐడీ కార్డు చూపేవరకూ ఓపిగ్గా ఎదురు చూసిన ఫెడరర్ ఆ తర్వాత లోపలికి వెళ్లాడు.



వెయిట్ లిఫ్టింగ్‌లో శివరామకు పసిడి

కర్నూలు (స్పోర్ట్స్): జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి శివరామకృష్ణ స్వర్ణ పతకం గెలిచాడు. అండర్-19 బాలుర 81 కిలోల విభాగంలో శివరామకృష్ణ ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటాడు.

సౌరాష్ట్ర రికార్డ్ ఛేదన

రంజీ ట్రోఫీ క్వార్టర్స్‌లో యూపీపై విజయం



లఖ్‌నవ్: రంజీ ట్రోఫీ చరిత్రలో రికార్డు ఛేదనతో సౌరాష్ట్ర సెమీస్‌లోకి దూసుకెళ్లింది. హార్విక్ దేశాయ్ (116) సెంచరీతో విజృంభించడంతో.. ఉత్తరప్రదేశ్‌తో క్వార్టర్స్ మ్యాచ్‌లో 372 పరుగుల లక్ష్యాన్ని సౌరాష్ట్ర 115.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. హార్విక్‌తో పాటు టీమిండియా టెస్ట్ ఆటగాడు చటేశ్వర్ పుజారా (67 నాటౌట్), షెల్డన్ జాక్సన్ (73 నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించడంతో.. ఓవర్‌నైట్ స్కోరు 195/2తో ఆఖరి రోజైన శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర మరో 177 రన్స్ జోడించి గెలుపు తీరానికి చేరింది. పుజారా-జాక్సన్ ఐదో వికెట్‌కు 136 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో 2008-09 సీజన్‌లో అసోం నెలకొల్పిన 371 పరుగుల అత్యధిక ఛేదన రికార్డును సౌరాష్ట్ర బ్రేక్ చేసింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో యూపీ 385, సౌరాష్ట్ర 208 రన్స్ సాధించాయి. రెండో ఇన్నింగ్స్‌లో యూపీ 194 స్కోరు చేసింది. సెమీస్‌లో కర్ణాటకతో ఉనాద్కట్ సేన తలపడనుంది. మరో క్వార్టర్స్‌లో ఉత్తరాఖండ్‌పై విదర్భ ఇన్నింగ్స్ 115 పరుగులతో నెగ్గింది. సెమీస్‌లో కేరళతో విదర్భ పోటీపడనుంది.

హ్యామర్స్ హ్యాట్రిక్

లుధియానా: ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో హరియాణా హ్యామర్స్ వరుసగా మూడో విజయం సాధించింది. శనివారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో హరియాణా హ్యామర్స్ 4-3తో ఎంపీ యోధపై గెలిచింది. నిర్ణాయక ఆఖరి బౌట్‌లో అదరగొట్టిన రవి కుమార్.. హ్యామర్స్‌కు విజయాన్ని అందించాడు. పురుషుల 57 కిలోల్లో రవికుమార్ 10-1తో సందీప్ తోమర్‌పై నెగ్గాడు. అంతకు ముందు పురుషుల 86 కిలోల్లో అలి షబనోవ్ 8-0తో దీపక్‌పై గెలిచి హరియాణాకు శుభారంభం అందించాడు. అయితే, తర్వాత జరిగిన మహిళల 76 కిలోల్లో ఎంపీ రెజ్లర్ ఆండ్రియా కరోలినా 6-3తో కిరణ్‌పై నెగ్గి స్కోరు సమం చేసింది. 65 కిలో ల్లో హజి అలియేవ్ 5-2తో రజనీష్‌పై గెలిచి ఎంపీని 2-1 ఆధిక్యంలో నిలిపాడు. మహిళల 62 కిలోల్లో హ్యామర్స్ ప్లేయర్ తయానా 6-5తో ఎలిస్ మోనాలోవాపై గెలిచింది. పురుషుల 74 కిలోల్లో యోధ రెజ్లర్ వాసిల్ మిక్హైలోవ్ 7-6తో ప్రవీణ్ రాణాపై నెగ్గాడు. తర్వాత జరిగిన మహిళల 57 కిలోల బౌట్‌లో హరియాణా ప్లేయర్ అనస్టాసియా నిచితా 8-7తో పూజా దండాపై గెలిచి 3-3తో సమంగా నిలిపింది.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107*
Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.